ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 27-8-2019 మంగళవారం సిటీ సంపుటి 46 సంచిక 18

రూ. 6-50. పేజీలు 14+12 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఫ్రాన్స్‌లోని బీయరజ్‌లో సోమవారం జరిగిన ద్వైపాక్షిక భేటీలో చిరునవ్వులు చిందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

కశ్మీర్ ద్వైపాక్షిక అంశమే

అంగీకరించిన ట్రంప్

మోదీ సమక్షంలో ప్రకటన

మధ్యవర్తిత్వానికి తావులేదని తేల్చిచెప్పిన ప్రధాని

14లో

కేంద్రానికి రూ.1.76 లక్షల కోట్లు

బదిలీకి రిజర్వ్ బ్యాంక్ ఆమోదం

ఇదివరకెన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నుంచి కేంద్ర ప్రభుత్వానికి నిధుల బదిలీకి రంగం సిద్ధమైంది. ఆర్‌బీఐ గత గవర్నర్ ఉర్జిత్ పటేల్‌కు, మోదీ ప్రభుత్వానికి మధ్య ఈ నిధుల విషయంలోనే తీవ్ర అభిప్రాయభేదాలు తలెత్తి.. చివరకు అది ఉర్జిత్ రాజీనామాకూ దారితీసిన విషయం గుర్తుండే ఉంటుంది. అయితే ఆ తర్వాత ఉర్జిత్ స్థానంలో వచ్చిన శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆర్‌బీఐ బోర్డు.. అదనపు నిధుల విషయంలో సమీక్ష చేయడానికి కమిటీ ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. బిమల్ జలాన్ నేతృత్వంలోని ఆ కమిటీ సిఫారసుల మేరకే తాజాగా సోమవారం జరిగిన ఆర్‌బీఐ బోర్డు సమావేశంలో ఈ నిధుల బదిలీకి ఆమోదం లభించింది. దీంతో ఆర్‌బీఐ నుంచి కేంద్రానికి రూ.1,76,051 కోట్ల అ'ధనం' బదిలీ కావడానికి మార్గం సుగమం అయింది. ఆర్థిక వ్యవస్థ మందగమనం పాలైన ఈ తరుణంలో ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించడానికి ఈ నిధులు వీలు కల్పించే అవకాశం ఉంది.

... పూర్తి వివరాలు బిజినెస్ పేజీలో

సెన్సెక్స్ పరుగు

నెమ్మదించిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు గత శుక్రవారం కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీ ప్రభావం సోమవారం స్టాక్ మార్కెట్లలో కనిపించింది. మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ 793 పాయింట్లు దూసుకెళ్లింది. మూడు నెలల్లోనే అతిపెద్ద ఒక రోజు లాభాన్ని నమోదు చేసింది. బీఎస్ఈలో మదుపర్ల సంపదగా పరిగణించే నమోదిత కంపెనీ మార్కెట్ విలువ రూ.2 లక్షల కోట్లకు పైగా పెరిగింది.

సాగు.. సంక్షేమం

బడ్జెట్‌లో వీటికే అధిక ప్రాధాన్యం

- అన్నింటా ఆర్థిక మాంద్యం ప్రభావం
- దీన్ని పరిగణనలోకి తీసుకునే రూపొందించాలని అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం
- త్వరలో శాసనసభ.. పూర్తి స్థాయి బడ్జెట్

ఈనాడు, హైదరాబాద్: ఆర్థికమాంద్యం ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. 2019-20 ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయి బడ్జెట్‌ను త్వరలోనే శాసనసభలో ప్రవేశపెట్టనున్నట్లు సీఎం ప్రకటించారు. బడ్జెట్‌లో ప్రజాసంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ఇతర రంగాలకు అవసరమైన మేర నిధుల కేటాయింపులుండాలని స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి సోమవారం ప్రగతిభవన్‌లో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆర్థిక మాంద్యం, దేశవ్యాప్తంగా చూపుతున్న ప్రభావం, రాష్ట్రంపై ప్రభావం తదితర అంశాలపై చర్చించారు. దేశవ్యాప్తంగా తీవ్రమైన ఆర్థికమాంద్యం ప్రభావం అన్ని రంగాలపై పడిందని సీఎం అన్నారు. రాబడులు తగ్గిపోయాయని అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాదాయం తగ్గిందని చెప్పారు. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో రాష్ట్రంలో ఆదాయం, అవసరాలను బేరీజు వేసుకుని, వాస్తవిక దృక్పథంతో బడ్జెట్‌ను సిద్ధం చేయాలన్నారు. బడ్జెట్ తయారీ అనంతరం మంత్రివర్గ ఆమోదంతో పాటు శాసనసభను సమావేశపరచడం తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంపై సీఎం కార్యాలయం ప్రకటనను విడుదల చేసింది. మంగళవారం కూడా బడ్జెట్ కసరత్తు కొనసాగుతుందని పేర్కొంది. ఫిబ్రవరిలో ఆర్నెల్ల కాలానికి.. అంటే సెప్టెంబరు 30 వరకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించారు.

ప్రాణహిత నదిలో పడవపై ప్రయాణిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బలరాంనాయక్, పొన్నాల లక్ష్మయ్య, రాథోడ్ రమేశ్, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

కాళేశ్వరం అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తాం

- వేల కోట్లు ఖర్చు చేశారు.. ఒక్క ఎకరానికీ నీళ్లివ్వలేదు
- నిబంధనలకు విరుద్ధంగా పనులు కట్టబెట్టారు
- 'ప్రాణహిత-ప్రాణఘోష' యాత్రలో కాంగ్రెస్ నేతల ధ్వజం

2లో

పసిడి మెరుగు

మేలిమి (999 స్వచ్ఛత) బంగారం 10 గ్రాముల ధర సోమవారం రూ.675 పెరిగి, రూ.39,670కి చేరింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర ఆరేళ్ల గరిష్ఠమైన 1554.56 డాలర్లకు చేరింది. ఆభరణాల బంగారం (916 స్వచ్ఛత) సవరు (8 గ్రాములు) ధర రూ.700 పెరిగి రూ.29,500 పలుకుతోంది.

రూపాయి తరుగు

డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఇటీవల దిగజారుతూ వస్తోంది. సోమవారం ఏకంగా 36 పైసలు నష్టపోయి 72.02 వద్ద ముగిసింది.

...వివరాలు బిజినెస్ పేజీలో

ఈపీఎస్.. ఎన్‌పీఎస్!

ఏదో ఒకటి ఎంచుకోవాల్సిందే

- ఈపీఎఫ్‌వో చట్టంలో కీలక సంస్కరణ
- సెప్టెంబరు 22 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఈనాడు - హైదరాబాద్

ఉద్యోగుల భవిష్యనిధి చట్టం(ఈపీఎఫ్)లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. కనీస వేతన నిబంధనలు, ఉద్యోగి పింఛను పథకం (ఈపీఎస్)లో ప్రభుత్వం మార్పులు చేయనుంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న ఈపీఎస్‌తో పాటు జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)ను చట్టంలో చేర్చనుంది. అయితే ఉద్యోగి అభీష్టం మేరకు పింఛను పథకం ఎంపిక చేసుకునే అవకాశం కల్పించనుంది. 2015-16 బడ్జెట్‌లో ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగుల భవిష్యనిధి చట్ట సవరణ బిల్లు-2019 ముసాయిదాను కేంద్ర కార్మిక శాఖ రూపొందించింది. ఈ బిల్లుపై కార్మిక సంఘాలు, పీఎఫ్ చందాదారులు, యాజమాన్యాలు, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తోంది. సెప్టెంబరు 22లోగా అభ్యంతరాలను

rahul.bhagat@ips.gov.in, samir.kumar70@nic.in ఈ-మెయిల్ లేదా రాహుల్ భగత్, డైరెక్టర్, కేంద్ర కార్మికశాఖ, రూము నం.302, శ్రమశక్తి భవన్, దిల్లీ చిరునామాకు పంపించాలని కోరింది. వచ్చే ఏడాది నాటికి చట్ట సవరణలు అమల్లోకి తీసుకువచ్చేలా కార్యాచరణ సిద్ధం చేసింది. ఈపీఎస్‌తో పాటు ఎన్‌పీఎస్‌ను చేర్చాలని గత నాలుగేళ్లుగా ఈపీఎఫ్‌వో బోర్డు

...మిగతా 2లో

వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించి దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశానికి విచ్చేసిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి

మావోయిస్టు ప్రాంతాల్లో మరిన్ని బ్యాంకులు, సెల్‌టవర్లు

- పర్యావరణ అనుమతుల్లో ఇబ్బందులు అధిగమించాలి
- ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో నిర్ణయాలు

5లో

యూరియా ఏదయా?

- వివిధ జిల్లాల్లో కొరతతో సతమతం
- ఆగస్టు కోటా సరఫరాలో విఫలం

రాష్ట్ర మంత్రి అడిగినా స్పందించని కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: యూరియా కొరత పేరుతో రైతులను వ్యాపారులు దెబ్బ తీస్తున్నారు. కేంద్రం సరిగ్గా సరఫరా చేయకపోవడం, నౌకాశ్రయాల నుంచి రైళ్ల ద్వారా జిల్లాలకు సరఫరాలో జాప్యం వంటి కారణాల వల్ల కొన్ని ప్రాంతాల్లో యూరియా దొరక్క రైతులు అల్లాడుతున్నారు. దీన్ని సాకుగా చూపుతూ కొందరు వ్యాపారులు 45 కిలోల యూరియా బస్తా 'గరిష్ఠ చిల్లర ధర(ఎమ్మార్పీ) రూ.266.50 కాగా 350 రూపాయల దాకా వసూలు చేస్తున్నారు. తెలంగాణకు ఈ నెల కోటా ప్రకారం 1.40 లక్షల టన్నుల యూరియాను విదేశాల నుంచి వచ్చే కోటా నుంచి కేంద్ర ఎరువుల శాఖ కేటాయించగా.. ఇంతవరకు 50 వేల టన్నులు కూడా రాలేదు. ఒక ప్రధాన కంపెనీకి 42 వేల టన్నులు కేటాయించగా 9,900 టన్నులే ఇప్పటివరకూ జిల్లాలకు చేర్చింది. నెలాఖరుకు 20 వేల టన్నులే జిల్లాలకు సంపగలమని కంపెనీ వర్గాలు వివరించాయి. తెలంగాణకు యూరియా సంపాల్సిన కంపెనీలకు సంబంధించిన నౌకాశ్రయాలకు విదేశాల నుంచి సరకు తక్కువగా వస్తోంది. విదేశాల నుంచి త్వరగా తెప్పించి కంపెనీలకు కేటాయించే బాధ్యత అంతా కేంద్ర ఎరువుల శాఖ చేతిలో ఉంది. కేంద్రంలో పట్టున్న రాష్ట్రాల వారు ఈ కేటాయింపుల్లో చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రంలో యూరియా దొరకడం లేదని సోమవారం రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు

...మిగతా 2లో

ఇదీ సంగతి!

నీది కుక్క కాటా, నాది పాము కాటు, ఆయనది దోమకాటు.

రెవెన్యూ చట్టంపై ట్రెసా నమూనా ముసాయిదా

కీలక మార్పులకు ప్రతిపాదన

మార్పులు చేర్పులపై ఉద్యోగుల తర్జనభర్జన

3లో

పెండింగ్ బిల్లులు రూ.10 వేల కోట్లపైనే!

సాగునీటి ప్రాజెక్టులకు భారీగా వ్యయం చేస్తున్నా.. బకాయిలూ పెరుగుతున్నాయి

3లో

మార్చినాటికి రెండో రైలు మార్గం

- కీలక దశకు షాద్‌నగర్-మహబూబ్‌నగర్ పనులు
- బడ్జెట్‌లో రూ.200 కోట్ల కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్ నుంచి బెంగళూరు, రాయలసీమ వైపు రాకపోకల్ని సులభతరం చేసేందుకు మహబూబ్‌నగర్ వరకు చేపట్టిన డబ్లింగ్ పనులు కీలకదశకు చేరుకున్నాయి. షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు మట్టిపనులు పూర్తయ్యాయి. రైలుపట్టాల అనుసంధానం, స్టేషన్ భవనాలు, వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆరేడు నెలల్లో వీటిని పూర్తిచేసి మార్చికల్లా రెండోలైను అందుబాటులోకి తీసుకొస్తామని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) చెబుతోంది.

సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి బెంగళూరు, తిరుపతి వైపు వెళ్లే రైళ్లకు హైదరాబాద్ నుంచి కర్నూలు, డోన్ వరకు రైలుమార్గం సింగిల్ లైనే ఉంది. దీంతో కొత్త రైళ్ల ప్రవేశపెట్టేందుకు, ఉన్నవాటి వేగం పెంచేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీని పరిష్కారానికి నాలుగేళ్లక్రితం ఉందానగర్-మహబూబ్‌నగర్ రెండోలైను మంజూరైంది.

షాద్‌నగర్-మహబూబ్‌నగర్ రైలు మార్గంలో రెండు లైను కోసం వేసిన పట్టాలు

రెండో లైను ప్రాజెక్టు ఇలా

- మంజూరు: 2015-16
- ఎంత దూరం: 90 కి.మీ.
- అంచనా వ్యయం: రూ.728కోట్లు
- ప్రాజెక్టు: ఉందానగర్-మహబూబ్‌నగర్

వేగంగా పూర్తి చేస్తాం... సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ సెక్షన్‌లోని ఉందానగర్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ ప్రాజెక్టుకు 2019-20 కేంద్ర బడ్జెట్‌లో రూ.200కోట్లు కేటాయించారు. దీంతో పనుల్లో వేగం పెరిగిందని ఈ ప్రాజెక్టును చేపట్టిన ఆర్‌వీఎన్ఎల్ అధికారి ఒకరు తెలిపారు. "తొలుత షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం. తర్వాత ఉందానగర్ నుంచి షాద్‌నగర్ వరకు రెండోలైను వేగంగా పూర్తిచేస్తాం. ఫలక్‌నుమా నుంచి ఉందానగర్ వరకు ఎంఎంటీఎస్ ప్రాజెక్టులో భాగంగా రెండోలైను వస్తోంది" అని వివరించారు. ఈ మార్గం పూర్తయితే సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు ప్రయాణ సమయం తగ్గుతుంది.







చంద్రయాన్-2లోని టీఎంసీ2 కెమెరా తీసి పంపిన చిత్రాలు

బిలాల చిత్రాలు భళా!

- చిత్రాలు తీసిన టెర్రైన్ మ్యాపింగ్ కెమెరా
- చంద్రయాన్-2 నుంచి మరో అద్భుతం

శ్రీహరికోట - న్యూస్‌టుడే

చంద్రయాన్-2 వ్యోమనౌకలోని టెర్రైన్ మ్యాపింగ్ కెమెరా-2 (టీఎంసీ2) తీసిన చిత్రాలను ఇస్రో విడుదల చేసింది. ఈ కెమెరా చంద్రుడికి 4,375 కిలోమీటర్ల ఎత్తు నుంచి క్రేటర్ జాక్సన్, మిత్ర, మ్యాక్, కొరలెవ్‌ల చిత్రాలను తీసి పంపింది. జాక్సన్ క్రేటర్ చంద్రుడికి సుదూరంలో ఉన్న ఉత్తరార్ధగోళంలో ఉండే ప్రభావ బిలం. ఇది 22.4 డిగ్రీల ఉత్తరం, 163.1 డిగ్రీల పశ్చిమం వద్ద 71 కి.మీల వ్యాసం గల బిలం. మాక్ బిలం పశ్చిమ బాహ్య అంచు వద్ద ఉన్న ఆసక్తికరమైన అంశం. . మిత్రా క్రేటర్. దీని వ్యాసం 92 కి.మీ. భారతీయ భౌతిక శాస్త్రవేత్త, పద్మభూషణ్ గ్రహీత ప్రొఫెసర్ శిశిర్‌కుమార్ మిత్రా పేరు దీనికి పెట్టారు. ఈయన అయానోస్ఫియర్, రేడియోఫిజిక్స్ రంగంలో మార్గ దర్శకులు.

కొరలెవ్ బిలం వ్యాసం 437 కిలోమీటర్లు. ఇది వివిధ పరిమాణాల్లో అనేక చిన్న క్రేటర్లను కలిగి ఉంటుంది. టెర్రైన్ మ్యాపింగ్ కెమెరా-2 ఈనెల 23న 4,375 కిలోమీటర్ల ఎత్తులో సోమెర్‌ఫెల్డ్, కిర్క్‌వుడ్ వంటి ప్రభావ క్రేటర్లను చూపించింది. సోమెర్‌ఫెల్డ్ అనేది చంద్రుడి ఉత్తర అక్షాంశంలో ఉన్న ఒక పెద్ద ప్రభావబిలం. ఇది 65.2 డిగ్రీల ఉత్తరం, 162.4 డిగ్రీల పశ్చిమం వద్ద 169 కిలోమీటర్ల వ్యాసం గల బిలం. ఇది రింగ్ పర్వతం చుట్టూ సాపేక్షంగా చదునైన లోపలి భాగాన్ని కలిగి ఉంది. ఇందులో అనేక చిన్న క్రేటర్స్ ఉన్నాయి. అణు, క్వాంటం భౌతికరంగంలో ముందున్న జర్మన్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్నాల్డ్ పేరును ఈ బిలానికి పెట్టారు. ఈశాన్యంలోని కిర్క్‌వుడ్ బిలం అమెరికన్ ఖగోళ శాస్త్రవేత్త డెనియల్ కిర్క్‌వుడ్ పేరు మీద ఉంది.

మెదక్ జడ్పీ స్థాయీ సంఘంలో కేసీఆర్‌కు స్థానం

మెదక్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మెదక్ జిల్లాపరిషత్తు వ్యవసాయ స్థాయీసంఘంలో స్థానం కల్పించారు. కొత్తగా ఈ జడ్పీ ఆవిర్భవించిన తర్వాత, అధ్యక్షురాలు హేమలత గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏడు స్థాయీసంఘాలకు సభ్యులను నామినేట్ చేశారు. వ్యవసాయానికి సంబంధించి, సభ్యుడిగా సిద్దిపేటజిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేసీఆర్‌ను ఎంచుకున్నారు. ఆ నియోజకవర్గంలోని తూప్రాన్, మనోహరాబాద్ మండలాలు మెదక్ జిల్లా పరిధిలో ఉండటంతో ఆయనకు స్థాయీ సంఘంలో సభ్యత్వమిచ్చారు.

కేఫ్ కాఫీడే అధిపతి సిద్ధార్థది ఆత్మహత్యే!

- నదిలోకి దూకిన సమయంలో ఊపిరితిత్తుల్లోకి నీరు చేరడంతో మృతి
- ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం బలవన్మరణంగానే భావిస్తున్నాం
- మంగళూరు పోలీసు కమిషనర్ హర్ష ప్రకటన

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురి చేసిన కేఫ్ కాఫీడే యజమాని వి.జి.సిద్ధార్థ మరణానికి కారణమైన అంశాలు ప్రాథమికంగా వెల్లడయ్యాయి. నేత్రావతి నదిలోకి దూకిన సమయంలో ఆయన ఊపిరితిత్తుల్లోకి నీరు చేరడంతోనే మృతి చెందారని మంగళూరు నగర పోలీసు కమిషనర్ డాక్టర్ పి.ఎస్.హర్ష సోమవారం ప్రకటించారు. ఫోరెన్సిక్ ప్రయోగశాల అందించిన నివేదికను వెన్‌లాక్ వైద్యులతో పునఃపరిశీలన చేయించామని ఆయన తెలిపారు. ఉళ్లాల సమీపంలోని వంతెన పైనుంచి నేత్రావతి నదిలోకి సిద్ధార్థ జులై 29న దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. రెండు రోజుల అనంతరం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఫోరెన్సిక్ ప్రయోగశాల నివేదిక ప్రకారం సిద్ధార్థది ఆత్మహత్యగానే ప్రాథమికంగా భావిస్తున్నామని హర్ష పేర్కొన్నారు. సిద్ధార్థ తండ్రి గంగయ్య హెగ్డే(95) ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. మైసూరులోని గోపాలగౌడ శాంతవేరి వైద్యశాలలో ఆయన గత 45 రోజులుగా కోమాలో ఉన్నారు. బలవన్మరణానికి నాలుగు రోజుల ముందు తండ్రి పడక పక్కనే కొంత సమయం సిద్ధార్థ గడిపారు. కుమారుడు చనిపోయిన విషయం తెలియకుండానే గంగయ్య కన్నుమూయడం మరింత విషాదకరం.

నేడు, రేపు వర్షసూచన

ఈనాడు, హైదరాబాద్ : ఒడిశా ఉత్తర ప్రాంతంలో 900 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం వల్ల తెలంగాణలో మంగళ, బుధవారాల్లో అక్కడక్కడా ఒకమోస్తరు వర్షాలు పడవచ్చని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. రాష్ట్రంలోని 111 ప్రాంతాల్లో సోమవారం పగటిపూట తేలికపాటి వర్షాలు కురిశాయి. అధికంగా ముధోల్ మండలం ఏడుబిడ్ గ్రామంలో 44.3, గుండాల మండల కేంద్రంలో 23, గరిమెళ్లపాడు 23, బెజ్జూరు 20, జైనూరులో 20.3 మిల్లీమీటర్ల మేరకు నమోదైంది.

సాంకేతిక లోపంతో వెనక్కి మళ్లిన విమానం

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: గాల్లోకి ఎగిరిన ఓ విమానం సాంకేతిక లోపంతో వెనక్కి తిరిగివచ్చింది. శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే విమానం (ట్రూ జెట్ ఎయిర్‌లైన్స్ 2టీ-201) ఇక్కడి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరింది. 15 నిమిషాలు ప్రయాణించిన అనంతరం, సాంకేతిక లోపం తలెత్తినట్లు సిబ్బంది గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. వారు విమానాన్ని అత్యవసరంగా వెనక్కి రప్పించారు. తిరిగి 8.30గంటల సమయంలో శంషాబాద్‌కు చేరుకున్న విమానానికి భారీ మరమ్మతులు అవసరం కావడంతో, ఆ సర్వీస్‌ను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. ప్రయాణికులకు టికెట్ నగదును తిరిగి చెల్లించామని అధికారులు పేర్కొన్నారు.

కాళేశ్వరం అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తాం

ఈనాడు డిజిటల్, ఆసిఫాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేయాలని సీబీఐకి ఫిర్యాదు చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రాణహిత-ప్రాణఘోష' యాత్రలో భాగంగా నేతలు సోమవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిని సందర్శించారు. ఇందులో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ఎంపీలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సీతక్క, శ్రీధర్‌బాబు, నేతలు పొన్నాల లక్ష్మయ్య, హనుమంతరావు, షబ్బీర్ అలీ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు, మూడు టీఎంసీల అదనపు సామర్థ్యం పేరుతో రూ. వేల కోట్ల పనులను నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ పద్ధతిలో తెరాస ప్రభుత్వం గుత్తేదారులకు అప్పగించిందని దుయ్యబట్టారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనులను రూ.38 వేల కోట్లతో ప్రారంభించగా.. కేసీఆర్ సీఎం అయ్యాక కూడా ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా దక్కాలని పలుమార్లు కోరారని ఉత్తమ్ పేర్కొన్నారు. అనంతరం రకరకాల వాదనలతో రీడిజైన్ పేరుతో ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించారన్నారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరందడంతోపాటు ఎల్లంపల్లి జలాశయంలోకి నీటిని మళ్లించొచ్చని పేర్కొన్నారు.

20 శాతం పనులే పూర్తి చేసి కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించారని.. ఒక్క ఎకరానికీ నీళ్లు అందించకుండా రూ.80 వేల కోట్లు ఖర్చు చేశారని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క ఆరోపించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు 28 వేల కోట్లు ఖర్చు చేస్తే 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందేదని తెలిపారు. ప్రాజెక్టుకు జాతీయ హోదా వస్తే కమీషన్లు దక్కవనే రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం డీపీఆర్‌ను కేంద్రానికి ఇవ్వడంలో తాత్సారం చేస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రాజెక్టు ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులను పక్కనపెట్టి, గోదావరి జలాలను తరలించి రాయలసీమను రత్నాలసీమగా చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ అనడం అవివేకమని ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అవినీతిపై కాంగ్రెస్ పార్టీ నేతలంతా కలిసి సీబీఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బలరాం నాయక్, చిన్నారెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాథోడ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదికి హారతి ఇస్తున్న కాంగ్రెస్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రమేశ్ రాథోడ్, బలరాంనాయక్ తదితరులు

ఉండ్రాలయ్య.. ఊరికి ఉపాధి చూపెనయ్యా!

వినాయక విగ్రహాల తయారీతో ఉపాధి పొందే వారు చాలా మంది ఉంటారు. కానీ వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం లోని చాపలగూడెం గ్రామస్థులు మాత్రం ఎంతో ప్రత్యేకం. చిన్నా పెద్దా తేడా లేకుండా.. కులాలకు అతీతంగా ఊరు ఊరంతా పదినెలలపాటు ఇదే పనిలో ఉండటం విశేషం. కుమ్మరిస్వామి ఆధ్వర్యంలో పన్నెండేళ్లుగా ఇక్కడ కలిసికట్టుగా మట్టి విగ్రహాలు తయారుచేస్తున్నారు. పర్యావరణానికి హాని కలగకుండా అంతా మట్టి విగ్రహాలే తయారు చేయడం ఈ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది. ఈ ఏడాది ఇక్కడ మూడువేల పెద్ద విగ్రహాలు, రెండు లక్షల చిన్న విగ్రహాలు తయారుచేశారు.

– ఈనాడు, వికారాబాద్

ఈపీఎస్.. ఎన్‌పీఎస్!

(మొదటి పేజీ తరువాయి)

సమాలోచనలు చేస్తోంది. మూడేళ్ల క్రితం ఈపీఎస్ స్థానంలో ఎన్‌పీఎస్ తరహా ప్రతిపాదన చేర్చుతూ, ఈపీఎఫ్ ఉపసంహరణలపై బడ్జెట్‌లో ఆంక్షలు ప్రతిపాదించడంతో కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో కేంద్రం వెనక్కి తగ్గింది. తాజాగా ఈపీఎస్‌ను కొనసాగిస్తూనే ఎన్‌పీఎస్ పథకాన్ని చట్టంలో ఐచ్ఛికంగా చేర్చింది. ఈపీఎస్ కింద వేతనజీవులకు పదవీ విరమణ తరువాత కచ్చితమైన పింఛను వస్తుంది. భవిష్యనిధి కింద జమ చేసిన చందా మొత్తాన్ని ఒకేసారి ఎలాంటి పన్ను లేకుండా ఉపసంహరించుకోవచ్చు. ఈపీఎస్‌లో కొనసాగుతూ అసహాయ, ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితుల్లో కొలువును వదిలేస్తే నిధి నుంచి మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు అవకాశముంది.

ఈపీఎస్

ఈ పథకం కింద పదవీ విరమణ నాటికి ఉద్యోగి సర్వీసు, చివరి వేతనం (గరిష్ఠంగా రూ. 15 వేలు) ఆధారంగా పింఛను లెక్కించేవారు. ఈ పింఛను కోసం యజమాని చెల్లించే 12 శాతం వాటాలో 8.3 శాతం వాటాను (గరిష్ఠంగా రూ.1250) ఈపీఎస్‌లో జమ చేసేవారు. ఉద్యోగి చివరి వేతనం x సర్వీసు /70 ఆధారంగా పింఛను ఖరారవుతుంది. ఈ మొత్తం ప్రతి నెలా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

ఎన్‌పీఎస్

వేతనజీవులు ఈపీఎస్, ఎన్‌పీఎస్‌లలో ఏదో ఒకటి ఎంచుకోవాలి. ప్రస్తుత ఉద్యోగుల నుంచి ఆప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. కొత్తగా చేరే ఉద్యోగులు ముందుగానే తమ నిర్ణయాన్ని యజమాని ద్వారా ఈపీఎఫ్‌వోకు తెలియజేయాలి. ఎన్‌పీఎస్ పథకాన్ని ఎంచుకుంటే ఆ ఉద్యోగి భవిష్యనిధి పింఛను నియంత్రణ సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ) ఆధీనంలోకి వెళ్తుంది. మధ్యలో ఉద్యోగం మానేసి మొత్తాన్ని తీసుకునేందుకు ఎన్‌పీఎస్ నిబంధనలకు లోబడి అవకాశం ఉంటుంది. ఉద్యోగికి 60 ఏళ్లు వచ్చిన తరువాత కేవలం 60 శాతం మాత్రమే నగదు తీసుకునే వెసులుబాటు (ఇందులో 20 శాతంపై పన్ను) ఉంటుంది. మిగతా 40 శాతం యాన్యుటీ పథకంలో మదుపు చేసి, సంబంధిత బీమా సంస్థ నిర్ణయించిన వడ్డీ ఆధారంగా నెలవారీ పింఛను పొందాల్సి ఉంటుంది.

ఎంచుకోవాల్సిందిలా

కార్మికుల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు వేతన జీవులకు రెండు ఆప్షన్లు ఇచ్చింది. ఎన్‌పీఎస్‌లోకి చేరిన వెంటనే ఈపీఎస్ నుంచి వైదొలుగుతున్నట్లు ఈపీఎఫ్‌వో ధ్రువీకరిస్తుంది. ఉద్యోగి ఎన్‌పీఎస్ నుంచి తిరిగి ఈపీఎస్‌కు వచ్చేందుకు అవకాశం కల్పించింది. అయితే ప్రభుత్వ నిబంధన మేరకు సర్వీసు లెక్కింపు, నిధి మళ్లింపు ఉంటుంది.

వయసు ఆధారంగా చందా తగ్గించుకోవచ్చు

ప్రస్తుత ఈపీఎఫ్ చట్టం ప్రకారం మూలవేతనం, డీఏ, ఇతర భత్యం కలిపి కనీస వేతనంగా నిర్ణయించి ఉద్యోగి వాటా కింద వేతనం నుంచి 12 శాతం, యజమాని సొంతంగా 12 శాతం ఉద్యోగి భవిష్యనిధిలో జమ చేసేవారు. కేంద్రం వేతన కోడ్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో దానిప్రకారం కనీస వేతనం నిర్ణయించి, చందాను తీసుకునేలా బిల్లులో ప్రతిపాదించారు. తక్కువ వేతనం తీసుకుంటున్న ఉద్యోగులు వయసు ఆధారంగా చందాను తగ్గించుకునే అవకాశాన్ని కల్పించనుంది. అయితే యజమాని వాటా (12శాతం) తగ్గించడానికి వీల్లేదు.

రుషి - పాపి

ఒక పాపాత్ముడి కంటే తాను అధికుడిననీ, గొప్పవాడిననీ భావించే రుషి.. తన రుషిత్వాన్ని కోల్పోయి.. తన స్థాయి ఏమిటో, తానేమి చేస్తున్నాడో తెలియని పాపాత్ముడి కంటే కూడా కింది స్థాయికి దిగజారిపోతాడు.

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

27-8-2019 మంగళవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
ద్వాదశి: రా.11-05 తదుపరి త్రయోదశి
పునర్వసు నక్షత్రం: రా.10.55 తదుపరి పుష్యమి
అమృత ఘడియలు: రా.8-36 నుంచి 10-08 వరకు
వర్జ్యం: ఉ.11-21 నుంచి 12-54 వరకు
దుర్ముహూర్తం: ఉ.8-17 నుంచి 9-07 వరకు
తిరిగి రా.10-52 నుంచి 11-38 వరకు
రాహుకాలం: సా.3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5-48; **సూర్యాస్తమయం:** సా.6.16

మృత్యుంజయుడు దుర్గయ్య

- రైలు ఢీకొన్నా ప్రాణాలతో బయటపడిన కీమెన్

రామగుండం, న్యూస్‌టుడే: రైలు ఢీకొంటే మనిషి బతకడం కష్టం. కానీ ఇలాంటి అరుదైన ఘటన పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని కుందనపల్లి రైల్వేగేటు వద్ద సోమవారం జరిగింది. పట్టాలను సరిచేసే పనిలో ఉన్న ఓ కీమెన్‌ను రైలు ఢీకొంది. అతను అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. రైల్వే సిబ్బంది కథనం మేరకు.. కుందనపల్లి రైల్వేగేటు సమీపంలో రామగుండం సెక్షన్ కీమెన్ కత్తుల దుర్గయ్య మూడో ట్రాక్‌పై రైలు పట్టాలు సరిచేసే పనిలో నిమగ్నమై ఉన్నాడు. అదే ట్రాక్‌పై బెంగళూరు నుంచి హజ్రత్ నిజాముద్దీన్ వెళ్లే రాజధాని సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైలు వస్తోంది. ప్రధాన ట్రాక్‌పై ఈ రైలు రావాల్సి ఉండగా ట్రాఫిక్ క్లియరెన్సు లేక రాఘవాపూర్ రైల్వేస్టేషన్ నుంచి మూడో ట్రాక్ మీదుగా మళ్లించారు. రైలు ప్రధాన ట్రాక్‌పైనే వస్తోందని భావించిన దుర్గయ్య తన పనిలో నిమగ్నమయ్యాడు. లోకో పైలట్ హారన్ మోగించినా దుర్గయ్య పట్టించుకోలేదు. దీంతో రైలు అతన్ని ఢీకొని ముందుకు వెళ్లి ఆగింది. సిబ్బంది రైలు దిగి పరిశీలించగా అతను ప్రాణాలతోనే ఉన్నాడు. బోగీ కింద పట్టాల మధ్య పడి ఉన్న కీమెన్‌ను బయటకు లాగారు. అతని ఎడమ కాలు విరగగా, గడ్డం భాగంలో గాయమైంది. స్థానిక రైల్వే అధికారులు కారులో రామగుండం రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లి.. ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం గోదావరిఖనికి, అక్కడి నుంచి కరీంనగర్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా దుర్గయ్య చికిత్స పొందుతున్నాడు.

దుర్గయ్యను కారులో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం ★ చికిత్స పొందుతున్న కీమెన్ దుర్గయ్య

యూరియా ఏదయా?

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర మార్కెటింగ్ సహకార సమాఖ్య(మార్క్‌ఫెడ్) వద్ద 3 లక్షల టన్నుల యూరియా నిల్వలు ఉండాలి. 65 వేల టన్నులే సమాఖ్య గోదాముల్లో ఉంది. రాష్ట్రానికి కేటాయించిన మేరకు వెంటనే సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఇటీవల కేంద్రానికి లేఖ రాశారు. కేంద్ర ఎరువులశాఖ సంయుక్త కార్యదర్శితో నేరుగా మాట్లాడినా ఇంతవరకూ సరఫరా పెరగలేదు.

కొన్ని జిల్లాల్లో కొరత

- నిర్మల్ జిల్లా మామడ, లక్ష్మణచాందా మండలాల్లో యూరియా దొరకడం లేదని రైతులు నిరసనలకు దిగారు. ఈ ప్రాంతాలకు రైలు ద్వారా సరఫరాకు అవకాశం లేక ఆదిలాబాద్ నుంచి పంపుతున్నందున ఆలస్యమవుతున్నట్లు వ్యవసాయాధికారులు చెప్పారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లాకు రావాల్సిన యూరియా కామారెడ్డి జిల్లాకు పంపారని సిరిసిల్ల అధికారులు వ్యవసాయశాఖను సంప్రదించారు. పెద్దపల్లికి రైళ్ల ద్వారా వస్తున్నందున అక్కడి నుంచి సిరిసిల్లకు పంపాలని ఆదేశించినట్లు వ్యవసాయ కమిషనర్ రాహుల్ బొజ్జా 'ఈనాడు'కు చెప్పారు. రైలు మార్గం లేని ప్రాంతాలకు లారీల్లో పంపడంలో ఆలస్యంతో పాటు కొన్ని ప్రాంతాల్లో కొందరు అధికంగా కొనడం వల్ల మిగతావారికి దొరకడం లేదని వివరించారు. వారంలోగా 7 నుంచి 8 రైళ్లలో యూరియా వస్తుందని వివరించారు.
- జగిత్యాల జిల్లా కేంద్రానికి సోమవారం గ్రామాల నుంచి రైతులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం, ఓ ప్రైవేటు విక్రయ కేంద్రంలో పరిమితంగా యూరియా బస్తాలు ఉండగా వేల సంఖ్యలో వచ్చిన రైతుల్లో కొందరికే బస్తాలు లభించాయి. వ్యవసాయాధికారులు పర్యవేక్షించి రైతుకు రెండు బస్తాలు పంపిణీ చేసినా 75% మంది రైతులు బస్తాలు దొరక్క.. నిరాశతో వెనుదిరిగారు.

సెప్టెంబరులో 2.50 లక్షల టన్నులు పంపండి: పార్థసారథి

తెలంగాణకు సెప్టెంబరులో 2.50 లక్షల టన్నుల యూరియాను పంపాలని కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి చబిలేంద్ర రౌల్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి సోమవారం లేఖ రాశారు. జడ్చర్ల, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, మిర్యాలగూడ, సనత్‌నగర్ మంచిర్యాల, వరంగల్, ఆదిలాబాద్, రైల్వేస్టేషన్లకు వెంటనే రెండేసి గూడ్సు రైళ్లలో యూరియా పంపాలని విన్నవించారు.

భార్యపై అనుమానంతో తల నరికాడు

- ఒడిశాలోని పూరీ జిల్లాలో ఘటన

భువనేశ్వర్ అర్బన్(ఒడిశా), న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఓ వ్యక్తి తన భార్య తల నరికి దాంతో నేరుగా పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఈ ఘటన ఒడిశాలోని పూరీ జిల్లా అస్తరంగా ఠాణా పరిధిలోని రాయబెరాహ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గణేష్ బెవురాకు రెండేళ్ల కిందట అన్నపూర్ణతో వివాహమైంది. గణేష్ భార్యతో కలిసి చెన్నైకి వెళ్లి ఓ కిరాణ దుకాణంలో పనికి చేరాడు. వీరికి బాబు పుట్టాడు. వేరే వ్యక్తితో సంబంధం ఉందన్న అనుమానంతో గణేష్ తరచూ భార్యతో గొడవపడేవాడు. 15 రోజుల కిందట భార్యపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. విషయం తెలుసుకున్న అన్నపూర్ణ సోదరుడు చెన్నై వచ్చి ఆమెను తమ గ్రామానికి తీసుకెళ్లాడు. గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లగా రెండు కుటుంబాలతో మాట్లాడి వివాదం పరిష్కరించి అన్నపూర్ణను అత్తవారింటికి పంపారు. ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో మళ్లీ దంపతులు గొడవపడ్డారు. ఆగ్రహించిన గణేష్ గొడ్డలితో భార్య తల నరికి దాంతోనే నేరుగా పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	35.0	26.0
గుంటూరు	34.9	25.6
విశాఖపట్నం	34.2	27.4
విజయవాడ	34.2	25.2
హన్మకొండ	34.0	25.5
నల్గొండ	33.4	25.0
రామగుండం	32.4	25.2
నిజామాబాద్	32.2	23.6
కరీంనగర్	32.0	24.0
హైదరాబాద్	31.6	23.1
సూర్యాపేట	31.5	26.5
మహబూబ్‌నగర్	31.0	23.0
మెదక్	29.6	21.0
ఆదిలాబాద్	28.8	24.2

కొలువుల భర్తీలో ఆదర్శమేదీ!

- 88 ఆదర్శ పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లే లేరు
- 1008 మంది బోధకుల కొరత
- విద్యాశాఖ నివేదికలో వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శ (మోడల్) పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో సతమతమవుతున్నాయి. పాఠశాలల్లో 26 శాతం ఉపాధ్యాయుల కొలువులు ఖాళీగా ఉన్నాయి. 88 పాఠశాలలకు ప్రిన్సిపాళ్లే లేరు. ఆదర్శ పాఠశాలల వార్షిక నివేదికను పాఠశాల విద్యాశాఖ తాజాగా ఆవిష్కరించింది. ఈ నివేదికలో పలు అంశాలను ప్రస్తావించారు. మొత్తం 3,880 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా 2,872 మందే పనిచేస్తున్నారు. మొత్తం 194 పాఠశాలల్లో 88కి ప్రిన్సిపాళ్లే లేకపోవడం గమనార్హం. ఖాళీ కొలువుల్లో అతిథి ఉపాధ్యాయులను నియమించామని నివేదికలో పేర్కొన్నారు. గత ఆరున్నర సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయడం లేదని, ప్రత్యేక టీఆర్‌టీ నిర్వహించి శాశ్వత ఉపాధ్యాయులను నియమించాలని ఎంఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విఠల్, సత్యనారాయణగౌడ్ కోరారు.

నివేదికలోని ముఖ్యాంశాలివీ..

- 39 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. 150 చోట్ల పెరటి తోటలను పెంచారు.
- 2015-16లో 83,130 మంది విద్యార్థులుండగా 2019-20లో ఆ సంఖ్య 1,30,087 మందికి చేరింది. ఇంకా ప్రవేశాలు కొనసాగుతున్నాయి.
- బాసర ఆర్‌జీయూకేటీలో 1500 సీట్లకు 530 మంది ఆదర్శ పాఠశాలల విద్యార్థులే ఎంపికయ్యారు.
- 18 జిల్లాల్లోని 74 పాఠశాలల్లో అసంపూర్తి పనులకు రూ.55.91 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదనలు సమర్పించారు.
- 2015-16లో పదో తరగతిలో 10కి 10 జీపీఏ సాధించినవారు 23 మంది ఉండగా 2018-19లో 210కి పెరిగింది.
- రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌నకు 2,732 మంది ఎంపికవ్వగా వారిలో 873 మంది ఆదర్శ విద్యార్థులే.



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా లోకేశ్‌కుమార్

జలమండలి ఎండీగా కొనసాగనున్న దానకిశోర్

లోకేశ్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) కొత్త కమిషనర్‌గా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ డీఎస్ లోకేశ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కమిషనర్ దానకిశోర్‌కు స్థానచలనం కల్పించింది. ఆయనను జల మండలి మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ)గా కొనసాగాలని ఆదేశించింది. లోకేశ్ బదిలీ దృష్ట్యా రంగారెడ్డి జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్. హరీశ్‌కు ఆ జిల్లా కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. కీలక స్థానం పొందిన లోకేశ్‌కుమార్ 2003 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కర్ణాటకకు చెందిన వారు. ఆయన రంగారెడ్డితో పాటు గతంలో అనంతపురం, ఖమ్మం జిల్లాల కలెక్టర్‌గా పని చేశారు. వివిధ శాఖల్లో విధులు నిర్వర్తించారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికలను పురస్కరించుకొని హైదరాబాద్ నగరానికి చురుకుగా పనిచేసే పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలనే భావనతో లోకేశ్ వైపు ముఖ్యమంత్రి కేసీఆర్ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

సంగీత, నృత్య పరీక్షల ఫలితాల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయ పరిధిలో జరిగిన డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల వార్షిక పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్షలను జూన్‌లో తెలంగాణ, ఏపీలోని 13 ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలు/కళాశాలల్లో నిర్వహించారు. ఫలితాలను సోమవారం వర్సిటీ తరపున వి.అనిల్‌కుమార్ విడుదల చేశారు. మరిన్ని వివరాల కోసం www.telguuniversity.ac.in, www.manabadi.co.in వెబ్‌సైట్‌లలో చూడవచ్చని వర్సిటీ రిజిస్ట్రార్ అలేఖ్య పుంజాల తెలిపారు.

29 నుంచి పీజీఈసెట్ తుది కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు పీజీఈసెట్ చివరి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 29, 30వ తేదీల్లో జరగనుంది. ఆ రెండు రోజులూ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని ప్రవేశాల కన్వీనర్ రమేష్‌బాబు తెలిపారు.

వైద్యవిద్య డైరెక్టర్ పరిధిలోకి 143 మంది

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజారోగ్య సంచాలకులతో పాటు వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న 143 మంది స్పెషలిస్ట్ వైద్యులను వైద్యవిద్య సంచాలకుల పరిధిలోకి తీసుకున్నారు. ఇందులో 28 మంది గైనిక్, 22 మంది జనరల్ మెడిసిన్, 17 మంది టీబీ, సీడీ; 16 మంది జనరల్ సర్జన్, 11 మంది పీడియాట్రిక్, ఇతర విభాగాలకు చెందిన వైద్యులు కూడా ఉన్నారు.

విద్యార్థుల సైకిళ్లకు 'టెస్కాబ్' విరాళం

ఈనాడు, హైదరాబాద్: హాజరు మాసోత్సవంలో భాగంగా..ఈ ఆగస్టులో ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం హాజరు సాధించినవారికి సైకిళ్లు అందనున్నాయి. దీనికి తెలంగాణ రాష్ట్ర సహకార ఎపెక్స్ బ్యాంకు (టెస్కాబ్)..కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పాఠశాల విద్యాశాఖకు రూ.5 లక్షల విరాళం ప్రకటించింది. చెక్కును టెస్కాబ్ ఛైర్మన్ కొండూరి మురళీధర్, ఎండీ నేతి మురళీధర్ సోమవారం విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డిని కలిసి అందజేశారు. ఎంపిక చేసిన 100కిపైగా పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు బహూకరించనున్నారు.

పెండింగ్ బిల్లులు రూ.10 వేల కోట్లపైనే!

- సాగునీటి ప్రాజెక్టులకు భారీగా వ్యయం చేస్తున్నా.. బకాయిలూ పెరుగుతున్నాయి

ఈనాడు, హైదరాబాద్: సాగునీటి రంగానికి తెలంగాణ ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తున్నా.. ఇంకోవైపు పెండింగ్ బిల్లులూ ఎక్కువగానే ఉన్నాయి. దీని ప్రభావం కొన్ని ప్రాజెక్టుల పనులపై పడుతోంది. సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో అందుకు తగ్గట్లుగా కేటాయింపులు చేసింది. ఒకవైపు రాష్ట్ర ఖజానా నుంచి ఖర్చు చేస్తూనే బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకుంది. అయినప్పటికీ కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, దిండి, తుపాకులగూడెం తదితర ప్రాజెక్టుల్లో ఎక్కువ వ్యయంతో కూడుకున్న పనులు జరుగుతుండటం, జలయజ్ఞం పనులు ఇంకా కొనసాగడం, నిర్వహణలో ఉన్న ఎత్తిపోతల పథకాల విద్యుత్తు బిల్లులు.. ఇలా అన్నీ కలిపి పెండింగ్ బిల్లులు రూ.పది వేల కోట్లు దాటినట్లు తెలుస్తోంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ.10,019 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు ఒకటో తేదీ వరకు సాగునీటి రంగంపై రూ.7,600 కోట్లను ప్రభుత్వం ఖర్చుచేసింది. నాలుగు నెలల్లో ఇంత మొత్తం ఖర్చు చేయడం ఎక్కువే. కానీ, దీనికి మించి పెండింగ్ బిల్లులున్నాయి. గత ఏడాదివి కూడా కొనసాగుతుండటంతో ఈ భారం మరింత పెరుగుతోంది.

- కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ఏప్రిల్ నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు ప్రభుత్వం రూ.4500 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో బ్యాంకుల నుంచి ఇచ్చింది రూ.2700 కోట్లు కాగా.. మిగిలింది రాష్ట్ర బడ్జెట్ నుంచి వ్యయంచేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం రూ.2500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు నీటిపారుదల శాఖ వర్గాల సమాచారం.
- పాలమూరు-రంగారెడ్డికి ఇప్పటి వరకు రూ.520 కోట్లు రాష్ట్ర బడ్జెట్ నుంచి ఇచ్చారు. ఇటీవలే పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈ ప్రాజెక్టుకు రూ.పది వేల కోట్ల రుణం మంజూరు చేసింది. ఈ నిధులు విడుదలైతే పనుల వేగం పెరిగే అవకాశం ఉంది.

ప్రధాన ప్రాజెక్టుల వివరాలివీ..

ప్రాజెక్టు	పెండింగ్ బిల్లు (రూ.కోట్లలో)
కాళేశ్వరం ఎత్తిపోతల	2500
పాలమూరు-రంగారెడ్డి	1500
ఎస్ఎల్‌బీసీ	752
దేవాదుల	868
సీతారామ ఎత్తిపోతల	312
దిండి ఎత్తిపోతల	345
చిన్ననీటి వనరులు	830

- సీతారామ ఎత్తిపోతలకు రూ.576 కోట్లు బ్యాంకులు ఇవ్వగా, తుపాకులగూడానికి రూ.206 కోట్లు, దేవాదులకు రూ.230 కోట్లు, వరదకాలువకు రూ.511 కోట్లు బ్యాంకులు రుణంగా ఇచ్చాయి.
- కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు తదితర ఎత్తిపోతల పథకాల్లో విద్యుత్తు బిల్లులు, పనులకు సంబంధించిన బిల్లులు కలిపి అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయి.

హైకోర్టు న్యాయమూర్తులుగా టి.వినోద్‌కుమార్, ఎ.అభిషేక్‌రెడ్డి, కె.లక్ష్మణ్‌లతో ప్రమాణం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్

కొత్త న్యాయమూర్తుల ప్రమాణం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా తడకమళ్ల వినోద్‌కుమార్, అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి, కూనూరు లక్ష్మణ్‌లు సోమవారం ప్రమాణం చేశారు. మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్. చౌహాన్ వీరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులతోపాటు న్యాయవాదులు, బంధువులు హాజరయ్యారు. ప్రమాణం అనంతరం వీరికి పలువురు అభినందనలు తెలిపారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్‌తో కలిసి జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్‌తో జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావుతో జస్టిస్ వినోద్‌కుమార్‌లు కేసుల విచారణ చేపట్టారు.

జస్టిస్ కె.లక్ష్మణ్‌కు రాష్ట్ర బీసీ కమిషన్ అభినందనలు

హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్‌కు రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావులు అభినందనలు తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో కలిసి బీసీ కమిషన్ తెలుగులోకి అనువదించిన పుస్తకాలు, ప్రామాణిక నివేదికలను అందజేశారు.

సాగర్‌కు తగ్గిన వరద

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరదనీరు బాగా తగ్గింది. సోమవారం ఉదయానికి శ్రీశైలం నుంచి కేవలం 231 క్యూసెక్కుల వరద రాగా.. సాగర్ నుంచి ఎడమకాల్వ ద్వారా 8,807 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 9,145 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయ నీటిమట్టం 588.90 (గరిష్ఠ స్థాయి 590) అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద నీరు పూర్తిగా నిలిచిపోగా.. జలాశయ నీటిమట్టం 882.20 (గరిష్ఠ స్థాయి 885) అడుగుల వద్ద ఉంది.

రద్దు, విలీనం.. యోచనే వద్దు

ప్రభుత్వానికి రెవెన్యూ జేఏసీ వినతి

ఈనాడు, హైదరాబాద్: రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసి, ఉద్యోగులను ఇతర శాఖల్లో విలీనం చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వీఆర్వో, వీఆర్ఏల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) కోరింది. కమిటీ తరపున తెలంగాణ వీఆర్వోల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు, కార్యదర్శి సుధాకర్‌రావు, వీఆర్వోల సంఘం నాయకులు బాలనర్సయ్య, వంగూరు రాములు సోమవారం రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

రెవెన్యూ చట్టంపై ట్రెసా నమూనా ముసాయిదా

- కీలక మార్పులకు ప్రతిపాదన
- మార్పులు చేర్పులపై ఉద్యోగుల తర్జనభర్జన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని రూపొందించేందుకు సిద్ధమవుతుండగా తీసుకురావాల్సిన మార్పులు, సంస్కరణలపై ప్రభుత్వానికి ఉద్యోగుల తరపున సూచనలు చేసేందుకు తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం(ట్రెసా) నమూనా ముసాయిదాను రూపొందిస్తోంది. రాష్ట్రంలో సమగ్ర భూసర్వే చేపట్టి భూముల సెటిల్‌మెంట్ పూర్తి చేయాలని, పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని జిల్లాలు లేదా కొన్ని మండలాలను ఎంపిక చేసి సర్వే చేయాలని ప్రతిపాదిస్తున్నారు. ఒక్కరోజులో మ్యుటేషన్ పూర్తయ్యేలా విధానాలు, భూముల రిజిస్ట్రేషన్ పూర్తి చేసే ముందు ఆ భూమికి సంబంధించిన పూర్తి వివరాలను తహసీల్దారుతో నిర్ధరించుకోవడం, వారసత్వ బదిలీ, సర్వే సంఖ్యల సబ్‌డివిజన్ లాంటివి చేపట్టేలా పలు సూచనలను చేర్చారు. నమూనా ముసాయిదాను త్వరలో ప్రభుత్వానికి అందించనున్నారు. ట్రెసా సంఘాధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన విశ్రాంత, సీనియర్ డిప్యూటీకలెక్టర్లు మధుసూదన్, ఏనుగు నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, వీరారెడ్డి, డి.వెంకట్రావు, శ్రీనివాస్‌రావుల కమిటీ ముసాయిదా తయారీలో ఉన్నారు.

ప్రభుత్వం తీసుకొచ్చే కొత్త రెవెన్యూ చట్టంతో రెవెన్యూశాఖలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎలాంటి మార్పులు ఉంటాయోనని ఉద్యోగులు, రెవెన్యూ సంఘాల వారు తర్జనభర్జన పడుతున్నారు. రెవెన్యూశాఖలో సంస్కరణలు చేపడతామని ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచీ మార్గదర్శకాలు, మార్పుల వివరాలు తెలుసుకునేందుకు కలెక్టరేట్ల చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్ర స్థాయిలోనూ రెవెన్యూ సంఘాలపై ఒత్తిడి తెస్తున్నారు. కొత్త చట్టాలకు మద్దతు ఉంటుందని రెవెన్యూ సంఘాలు ప్రకటించినా వారికీ సరైన సమాచారం లేకపోవడంతో గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు గ్రామ రెవెన్యూ వ్యవస్థను ఇతర శాఖల్లో విలీనం చేసే ప్రతిపాదనపై వీఆర్ఓ, వీఆర్ఏ సంఘాలు తమ ఆందోళనలకు కార్యాచరణ ప్రకటించాయి. ట్రెసా, తెలంగాణ తహసీల్దార్ల సంఘం, పలు వీఆర్ఓ, వీఆర్ఏ సంఘాలు, భూమి కొలతలు- భూ దస్త్రాల నిర్వహణ శాఖలకు చెందిన సంఘాలన్నీ కలిసి పనిచేసేందుకు చర్చలు నిర్వహిస్తున్నాయి.

ఎస్సీ వసతి గృహాల ప్రవేశాల్లో నిబంధనల మార్పు

దేవరుప్పుల, న్యూస్‌టుడే: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి (ప్రీ మెట్రిక్), కళాశాల స్థాయి (పోస్ట్ మెట్రిక్) విద్యార్థి వసతిగృహాల ప్రవేశాల్లో..రిజర్వేషన్ నిబంధనలను మార్చారు. ఈబీసీ, ఇతరులు, మైనార్టీలు ప్రవేశాలు పొందేందుకు వీలుగా రిజర్వేషన్ల పునర్విభజన చేస్తూ జీవో నంబరు 10 జారీ అయింది. దీని ప్రకారం ఎస్సీ వసతి గృహాల్లో అన్నివర్గాలవారికి ప్రాధాన్యం కల్పిస్తారు. ఎస్సీ గురుకులాల్లో మాదిరిగా ఇక్కడ రిజర్వేషన్లు అమలు కానున్నాయి. తాజా ఉత్తర్వులు అనుసరించి ఎస్సీలకు 75 శాతం, కన్వర్టెడ్ క్రైస్తవులకు 2, బీసీలకు 12, ఎస్టీలకు 6, మైనార్టీలకు 3, ఓసీ, ఈబీసీలకు 2 శాతం రిజర్వేషన్ల వంతున సీట్లు లభిస్తాయి. సామాజిక సమైక్యత దృష్ట్యా అన్ని వర్గాలనూ కలిపేందుకు అనువుగా ఇప్పటికే సంక్షేమ గురుకులాల్లో రిజర్వేషన్ విధానాన్ని మార్చు చేశారు.

రొయ్యల సరఫరాపై టెండర్ల కమిటీ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఎంపిక చేసిన రిజర్వాయర్లు, ఇతర నీటివనరులకు మంచినీటి రొయ్యల సరఫరాపై..టెండర్ల సంఘాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మత్స్యశాఖ కమిషనర్ అధ్యక్షులుగా, ఐదుగురు సభ్యులుగా ఉంటారని ప్రభుత్వ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పేర్కొన్నారు.

కేటీఆర్‌ను మళ్లీ ప్రభుత్వంలో చూడాలని ఉంది

ట్విటర్‌లో ఎంపీ అసదుద్దీన్

ఈనాడు, హైదరాబాద్: తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మళ్లీ ప్రభుత్వంలో చేరాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఆకాంక్షించారు. ఆయన మళ్లీ మంత్రివర్గంలోకి వస్తారని తాను ఎదురుచూస్తున్నానని సోమవారం అసద్ ట్విటర్‌లో పేర్కొన్నారు. ఒప్పో, అమెజాన్, వన్‌ప్లస్ వంటి సంస్థల ప్రాంగణాల ఏర్పాటు ఘనత మాజీ మంత్రి కేటీఆర్‌దేనని వెల్లడించారు. 'ఎంపీ సాబ్! మీ అభిమానానికి కృతజ్ఞతలు' అంటూ కేటీఆర్ అసద్‌కు రీట్వీట్ చేశారు.

మండలి సభ్యునిగా ప్రమాణం చేసిన అనంతరం గుత్తాకు శుభాకాంక్షలు తెలుపుతున్న మండలి ఉపఛైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు

ఎమ్మెల్సీగా గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రమాణం

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ్యుల కోటాలో శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి ఆవరణలోని తన కార్యాలయంలో గుత్తాతో మండలి ఉపఛైర్మన్ నేతి విద్యాసాగర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, గొంగిడి సునీతలతో కలిసి గుత్తా విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో మండలి సభ్యునిగా ఎన్నికయ్యానని, ఆయన అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు అని చెప్పారు. రాష్ట్ర, ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి కోసం మంత్రి జగదీశ్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి అహర్నిశలు శ్రమిస్తానని గుత్తా ఈ సందర్భంగా తెలిపారు.

వైద్యవిద్య యాజమాన్య కోటాకు రేపు తుది విడత ప్రవేశాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు, మైనారిటీ వైద్యకళాశాలలకు సంబంధించి..యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాల్లో మిగిలిన ఎంబీబీఎస్ సీట్లకు చివరి విడత ప్రవేశాలను బుధవారం నిర్వహిస్తారు. ఆ కోటాల్లో రెండు విడతల ప్రవేశ ప్రక్రియను ఇప్పటికే కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించింది. రెండో విడత ప్రవేశాల్లో చేరికకు గడువు మంగళవారంతో ముగియనుంది. నిర్ణీత గడువు అనంతరం కూడా రెండు కోటాల్లో సీట్లు మిగిలితే, తుది విడత(మాప్ అప్ రౌండ్)గా ఉస్మానియా వర్సిటీ ఆవరణలోని ఆచార్య రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ జరగనుంది. దీనికి నీట్‌లో అర్హులైన అభ్యర్థులందరూ హాజరు కావచ్చని, మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని వర్సిటీ ఉపకులపతి కరుణాకరరెడ్డి తెలిపారు.

మంత్రివర్గంలో 50 శాతం బీసీలుండాలి: ఆర్.కృష్ణయ్య

రాష్ట్రమంత్రివర్గంలో 50 శాతం బీసీలుండేలా ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. మొత్తం 17 మందిలో సగం మంది బీసీ మంత్రులుంటేనే సామాజిక న్యాయం కల్పించినట్లవుతుందన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం మంత్రివర్గంలో 11 మంది మంత్రులుండగా అందులో బీసీలు కేవలం ముగ్గురే ఉన్నారన్నారు.

ఆర్టిజన్లకు ప్రత్యేక నిబంధనలొద్దు

కార్మిక శాఖకు విద్యుత్ సంఘాల వినతి

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్ల పేరుతో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు ప్రత్యేక సర్వీసు నిబంధనలు కల్పించరాదని తెలంగాణ విద్యుత్ ట్రేడ్ యూనియన్ల ఫ్రంట్ (టీటీఎఫ్) కోరింది. శాశ్వత ఉద్యోగులకు ఉన్నవాటినే వారికీ వర్తింపజేయాలని కార్మిక శాఖకు విన్నవించింది. సర్వీసు నిబంధనల ఖరారుపై ఆ శాఖ సోమవారం విద్యుత్ సంస్థల యాజమాన్య, సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించింది. ప్రత్యేక సర్వీసు రూల్స్‌ను ఎటువంటి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని టీటీఎఫ్ తేల్చిచెప్పింది. ఒక కంపెనీలో విధులు నిర్వర్తించే కార్మికులందరికీ రాజ్యాంగం ప్రకారం ఒకే రకమైన నిబంధనలు ఉంటాయని పేర్కొంది. త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని కార్మికశాఖ అధికారులు నచ్చచెప్పారంటూ..ఫ్రంట్ అధ్యక్షుడు సాయిబాబు, కన్వీనర్ శ్రీధర్ ఓ ప్రకటన వెలువరించారు.

కర్ణాటకలో ముగ్గురు ఉపముఖ్యమంత్రులు

ఈనాడు డిజిటల్, బెంగళూరు: కర్ణాటకలో భాజపా ప్రభుత్వం కొత్త సంప్రదాయానికి తెరలేపింది. ముఖ్యమంత్రి యడియూరప్ప ముగ్గురు ఉపముఖ్యమంత్రులను నియమించారు. ఇటీవలే కర్ణాటకలో మంత్రివర్గాన్ని విస్తరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన 17 మందిలో డాక్టర్ అశ్వర్థ నారాయణ, గోవింద కారజోళ, లక్ష్మణ సంగప్ప సవదిలకు ఉప ముఖ్యమంత్రి పదవులు దక్కాయి. అలాగే మంత్రులకు శాఖల కేటాయించారు. సోమవారం రాత్రి ఈ మేరకు ప్రకటించారు. మరోపక్క తొలి మంత్రి వర్గ విస్తరణలో చోటు దక్కని వారికి మలివిడతలో పదవులు కట్టబెడతామని అధిష్ఠానం హామీ నిచ్చినట్లు సమాచారం.

Inter Pass/FAIL ? Don't Worry Join
Job Ready Course Under Learn & Earn
"Digital Marketing with Degree"
NEXTGEN HYD-9849775669 KNR-9246932938
Wanted PRO's & Faculty For Multimedia & Web Design

ADMISSION GUIDANCE
MBBS IN TS & AP
BDS BAMS-BHMS
UNIQUE HYD 9182112053

చంద్రమౌళి పాగిలిపాగిలి ఏడుస్తూన్నా కన్నీళ్లు రావు... అవి ఎప్పుడో ఇంకిపోయాయి. ఆయన బాధామయ బతుకును చూస్తే దేవుళ్లంతా కక్ష కట్టారా... కనికరాన్ని మరచి కష్టాలన్నీ కట్టగట్టుకు వచ్చాయా అనిపిస్తుంది. కడగండ్ల సుడిగుండంలో చిక్కుకున్నా... వెరవని ధీరత్వం ఆయన ముఖంలో కనిపిస్తుంది. విధిరాత పట్టి వెనక్కి లాగుతున్నా ముందుకే సాగాలనే ధైర్యం ఆ మాటల్లో వినిపిస్తుంది.

విధినెదిరించిన వాడు.. విలపించెను నేడు!

చంద్రమౌళిది నల్గొండ మండలం జి.చెన్నారం. ఆయన పుట్టుకతోనే దివ్యాంగుడు. కాళ్లు పని చేయకున్నా... మూడుచక్రాల వాహనమే ఆసరాగా పంక్చర్ దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగించారు. మూగ యువతి రేణుకను పెళ్లి చేసుకున్నారు. మాటరాకున్నా ఆమె చంద్రమౌళికి బాటగా మారింది. కూలి పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచింది. వారిద్దరికీ కావ్య(4) ప్రకాశ్(2) పిల్లలు. ఉన్నంతలో చీకూచింతా లేకుండా వారి జీవనం హాయిగా సాగిపోతోంది. ఈ ఏడాది జూన్‌లో భార్యాబిడ్డలతో కలిసి ఓ శుభకార్యానికి హాజరై తన వాహనంపై చంద్రమౌళి తిరిగి వస్తున్నారు. అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు వీరిని ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో రేణుక, ప్రకాశ్ అక్కడికక్కడే చనిపోయారు. చంద్రమౌళి చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. కావ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆ బాలికను హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. అక్కడి వైద్యులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె కాలును తీసివేశారు. అప్పటిదాకా సంతోషంగా ఉన్న ఆ కుటుంబాన్ని విషాద సంద్రం ముంచేసింది. ఇప్పుడు చంద్రమౌళి ఆశ ఒక్కటే... ఎలాగైనా బతకాలి... తన కుమార్తెను నడిపించుకోవాలి. అందుకు సహాయం చేసే చేతుల కోసం చూస్తున్నారు. తన తల్లితో కలిసి సోమవారం కలెక్టరేట్‌లోని 'ప్రజావాణి'కి వచ్చారు. కావ్యకు ఆసరా పింఛను మంజూరు చేయాలని, తనకు జీవనోపాధిని కల్పించాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ మూడుచక్రాల సైకిలుతో పాటు, కావ్యకు కృత్రిమ కాలును అందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక సాయంతోపాటు రెండు పడ

ఈనాడు

మానవాళికి చిచ్చు!

ప్రాణికోటి మనుగడకు ఆధారభూతమైన ప్రకృతి దైవమైతే, ఆ జీవకోటికి అందే ప్రాణవాయువుల్లో 20 శాతానికి పూచీపడుతున్న అమెజాన్ అడవులు 'దైవమాత'గా పర్యావరణవేత్తల సన్నుతులందుకొంటున్నాయి. భారతావనికి రెట్టింపు పరిమాణంలో బ్రెజిల్, పెరూ, కొలంబియా, ఈక్వెడార్, బొలీవియా, గయానా, సురినామ్, ఫ్రెంచ్ గయానాల్లో 26 లక్షల చదరపు మైళ్ల పరిమాణంలో విస్తరించి ఉన్న అమెజాన్ అరణ్యాలు- ధరిత్రికి ఊపిరితిత్తుల్లా ప్రకృతి ప్రసాదించిన బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి. భూతాపానికి కారణభూతమవుతున్న బొగ్గుపులుసు వాయువును పీల్చి, ఆక్సిజన్‌ను అందించి, ప్రపంచ జల చక్రభ్రమణాన్ని నియంత్రించి, దూరతీరాల దాకా వర్షపాతాన్ని విశేషంగా ప్రభావితం చేసే అమ్మ లాంటి అమెజాన్ గుండెల్లో నేడు మంటలు రేగుతున్నాయి. విశ్వవ్యాప్తంగా గల వృక్ష జంతుజాలంలో 30 శాతానికి, కనీసం 10 శాతం జీవవైవిధ్యానికి నెలవైన అమెజాన్‌ను నిరంతరాయంగా దహిస్తున్న అగ్నికీలలు- మహోపద్రవకారకం అనడంలో మరోమాట లేదు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ చెప్పినట్లుగా- 'మన ఇంటికి నిప్పంటుకుంది'! శివుడి కంఠంలో గరళాన్ని దాచుకొన్నట్లు బొగ్గుపులుసు వాయువును శోషించుకునే అడవులు, మనిషి అత్యాశకు బలయ్యేటప్పుడు అదే గరళాన్ని విరజిమ్ముతాయి. ఇప్పటి కార్చిచ్చు రగులుకోకముందే నరికివేత పాలబడిన అమెజాన్ ఏటా 50 కోట్ల మెట్రిక్ టన్నుల బొగ్గుపులుసు వాయువుల్ని వెదజల్లుతోందని 'వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్' వెల్లడించింది. క్యాలిఫోర్నియా, ఆస్ట్రేలియాల్లోని అడవుల మాదిరిగా అంత తేలిగ్గా నిప్పంటుకోని అమెజాన్ వర్షారణ్యాలు ఇప్పుడింతగా తీవ్రాందోళన కలిగించే స్థాయిలో పరశురామ ప్రీతి అయిపోవడానికి బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సొనారో హ్రస్వదృష్టి విధానాలే కారణం. బ్రెజిల్ పరిధిలో 60 శాతం ఉన్న అమెజాన్ అడవుల్ని నేలమట్టం చేసి దేశాభివృద్ధికి పునాదులు వెయ్యాలన్న బోల్సొనారో పెడసరం యావత్ మానవాళికీ వినాశకరం కానుందన్నది నిస్సందేహం!

తమ కార్యకలాపాల వల్ల ఇతర దేశాల పర్యావరణానికి భంగం వాటిల్లకుండా శ్రద్ధ వహించాలన్నది- 1992 జూన్‌లో రియో డి జెనీరోలో జరిగిన ధరిత్రీ సదస్సు తీర్మానాల్లో అత్యంత కీలకమైనది. నాడు ఆ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చిన బ్రెజిలే నేడు తన పరిధిలోని అమెజాన్ అరణ్యాలు తన ఇష్టారాజ్యానికి లోబడి ఉంటాయంటూ ఒంటెత్తు పోకడలు పోవడం ప్రపంచ పర్యావరణానికే పెను సవాలు రువ్వుతోంది. పర్యావరణ సమతుల్యత సాధనకు, దేశాభివృద్ధి లక్ష్యాలకూ ముడిపెట్టాలన్న ధరిత్రీ సదస్సు మౌలిక లక్ష్యాన్ని ఆచరణాత్మకం చెయ్యడంలో విఫలమైన బ్రెజిల్- సతత హరితారణ్యాల్ని బుగ్గిపాలు చేసి సోయాబీన్, ఆయిల్‌పామ్ వంటి వాణిజ్యపంటల సాగు, గనుల తవ్వకాలు, కలప విక్రయాలతో ఆర్థికంగా బలపడాలని భావిస్తోంది. శ్వేతసౌధంలో కాలిడిన వెంటనే ప్యారిస్ ఒప్పందానికి కట్టుబడేదిలేదన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెంపరితనాన్ని పుణికిపుచ్చుకొన్న బోల్సొనారో- పర్యావరణ పరిరక్షణ నిధులకు భారీగా కోతపెట్టి, అమెజాన్ పరిరక్షణే లక్ష్యంగా ఉన్న ఇరవయ్యేళ్ల విధానానికి సొడ్డుకొట్టి- అడవిని కాల్చుకుతినే వర్గాలకు అక్షరాలా కొమ్ముకాశారు. పర్యావరణ నిబంధనల ఉల్లంఘనుడి'గా గతంలో జరిమానాలు చెల్లించిన బోల్సొనారో- దేశార్థిక ప్రగతికి రక్షిత అటవీ ప్రాంతాలే ప్రధాన అవరోధమంటూ, వాటిని వాణిజ్య ప్రాతిపదికన అభివృద్ధి చేసే మార్గాలపై దృష్టి సారిస్తానని ఎన్నికల ప్రచారంలోనే చెప్పారు. మొన్న జనవరిలో బోల్సొనారో అధికారానికి వచ్చాక 1330 చదరపు మైళ్ల అమెజాన్ అరణ్యం అంతర్ధానమైపోయింది. ఇప్పుడీ విచ్చలవిడి కార్చిచ్చులను అదుపు చెయ్యడానికి ప్రపంచ దేశాల ఒత్తిడికి తలొగ్గి 40 వేల సైనిక సిబ్బందిని పురమాయించినా- అమెజాన్ అరణ్యఘోష ఆగేదెప్పటికి?

గత సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా మూడు కోట్ల 90 లక్షల ఎకరాల వృక్షచ్ఛాయ కనుమరుగైందని, అందులో బెల్జియం దేశమంత పరిమాణంలో అంటే 89 లక్షల ఎకరాల వర్షారణ్యాలు నామరూపాల్లేకుండా పోయాయని మేరీల్యాండ్ విశ్వవిద్యాలయ పరిశోధన వెల్లడించింది. 1990-2000 సంవత్సరాల మధ్య సగటున ఏటా మూడు కోట్ల 95 లక్షల ఎకరాల అడవులు నేలమట్టం కాగా, ఆ మరుసటి దశాబ్దిలో అది మూడుకోట్ల 21 లక్షల ఎకరాల నరికివేతకు దిగివచ్చిందని అంతర్జాతీయ అధ్యయనాలు ఎలుగెత్తుతున్నాయి. భూమ్మీద మనిషికి ఒకటి చొప్పున 780 కోట్ల చెట్లు పెంచాలని ఐక్యరాజ్య సమితి చేసిన నిర్దేశానికి ఏ గతి పట్టిందో గాని, అమెజాన్ గుండెల్లోనే ఆరని చిచ్చు రగిలించే దుర్మార్గాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. జీవనం కోసం పేదలు చెట్లను కొట్టేయకుండా కాచుకోవడానికి 1997లోనే కోస్టారికా జాతీయస్థాయిలో 'పర్యావరణ సేవలకు ప్రతిఫలం' పేరిట కొంత సొమ్ము చెల్లించే విధానాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. దరిమిలా మెక్సికో, చైనా, బొలీవియా వంటివి అదే బాట పట్టినా, అటవీ విధ్వంసం దూకుడు తగ్గిందేకాని పూర్తిగా ఆగలేదు. అమెజాన్ పరిరక్షణ నిధికి జర్మనీ, నార్వే 130 కోట్ల డాలర్లు అందిస్తున్నా- దానివల్ల ఏం ఒరుగుతుందని ప్రశ్నించే బోల్సొనారోవంటి నేతలు నేడు దాపురించారు. సతత హరితారణ్యాల విధ్వంసం తాలూకు ముప్పు అణుబాంబుల వంటి సామూహిక జనహనన ఆయుధ ప్రయోగాలకు ఏ మాత్రం తీసిపోనిది. అణ్వాయుధాలపట్ల ప్రపంచ దేశాలు ఎంత ఆందోళనతో స్పందిస్తాయో బ్రెజిల్ చేస్తున్న పర్యావరణ వినాశాన్నీ అంతే తీవ్రంగా పరిగణించాలి. అమెజాన్ కార్చిచ్చును ఆర్పడానికే కాదు, పర్యావరణానికి చేటుతెచ్చే దుర్మార్గాలకు ఎవరు తెగబడ్డా ప్రపంచ దేశాలన్నీ ఉమ్మడి బాధ్యతతో ఒక్కతాటిపైకి రావాలి. ఎందుకంటే- మనకున్నది ఒక్కటే భూమి!

చికిత్సకు ముందే సందేహాలు

జూనియర్ డాక్టర్ల నిరసన

ప్రపంచ వైద్య రంగంలో గత దశాబ్ద కాలంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. వైద్యవిద్యా రంగమూ అందుకు అనుగుణంగా అనేక విధాలుగా రూపాంతరం చెందుతోంది. దేశంలో అనేక ప్రభుత్వేతర వైద్య విశ్వవిద్యాలయాలు, బోధనాస్పత్రులను నెలకొల్పడమే ఇందుకు నిదర్శనం. వీటిని మంజూరు చేసే, నియంత్రించే విషయంలో భారతీయ వైద్యమండలి (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా- ఎమ్‌సీఐ) విఫలమైందనే విషయం చేదునిజం. ఈ సంస్థ అవినీతి పంకిలమై వైద్య విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిందన్నదీ నిర్వివాదాంశం. దీనిస్థానంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ వైద్యకమిషన్ (నేషనల్ మెడికల్ కమిషన్- ఎన్ఎమ్‌సీ) బిల్లు ఆదిలోనే వివాదాస్పదమైంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, అనేక వైద్యబృందాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. వైద్య విద్యార్థులు (జూనియర్ డాక్టర్లు- జూడాలు) బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనలు, సమ్మెలు చేశారు. అనేక అనుమానాలు, అపోహల మధ్య ఈ బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందింది. రాష్ట్రపతి సంతకం పూర్తిచేసుకుని చట్టమైంది!

అనేక సందేహాలు

దేశ వైద్యరంగాన్ని ప్రభావితం చేసి, కొత్తపుంతలు తొక్కించగల అత్యంత కీలకమైన నిర్ణయంగా ఈ బిల్లు గురించి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ వ్యాఖ్యానించారు. నిజంగా అత్యంత జాగ్రత్తతో తయారు చేసిన బిల్లు అయితే ఇంతమంది వ్యతిరేకించాల్సిన అగత్యం ఎందుకు ఏర్పడుతుంది? రెండేళ్ళ క్రితం ప్రవేశపెట్టిన ముసాయిదా బిల్లు ఎంతోమంది విమర్శకుల సూచనలను పరిగణనలోకి తీసుకొని అనేక మార్పులకులోనై బిల్లుగా రూపాంతరం చెందితే, ఇప్పుడు వ్యతిరేకించడం ఏమిటన్నది ప్రభుత్వ వాదన. ఎంతోమంది అగ్రగణ్యులైన వైద్యులను భారత్ తయారు చేసింది. దేశ విదేశాల్లో అత్యుత్తమ వైద్యనిపుణులుగా భారతీయులకు పేరుంది. అలాంటి వైద్య వ్యవస్థలో కేవలం కొందరు రాజకీయ ప్రాబల్యంతో అవినీతి కార్యకలాపాలు సాగిస్తుంటే... మొత్తం వ్యవస్థనే పూర్తిగా కూలదోసి, కొత్త వ్యవస్థను ఏర్పరచాలనే ప్రయత్నాన్ని వైద్యులు తప్పుపడుతున్నారు. వైద్యులు ఎన్నుకున్న ఎమ్‌సీఐ బృందం స్థానంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసే వ్యక్తులు అవినీతి రహితంగా, పారదర్శకంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రత్యామ్నాయ వ్యవస్థను ఎలా రూపొందించగలరని ప్రశ్నిస్తున్నారు. ఇందులో రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గి కొందరు మాత్రమే రాష్ట్ర ప్రతినిధులుగా 'రొటేషన్' పద్ధతిలో నియమితులైతే, అది బలమైన సంస్థగా ఎలా నిలదొక్కుకుంటుంది? రెండు మూడేళ్ళకోసారి మారిపోతూ, కొన్ని రాష్ట్రాల ప్రాతినిధ్యమైనా లేని వ్యవస్థ ఎంతవరకు సమంజసం? ఈ చట్టం అమలువల్ల రాష్ట్ర ప్రభుత్వాల ప్రాతినిధ్యం తగ్గుతుందని, ఇది సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తుందని వాదన.

ఛైర్మన్ సహా సభ్యులందరూ వారి ఆస్తి, ఆదాయ వివరాలను ముందే ప్రకటించాలి. తరవాతా ఎలాంటి ప్రైవేటు వైద్య బోధనాస్పత్రుల్లో లేదా సంస్థల్లో పనిచేయకూడదని ఈ చట్టం చెబుతోంది. దీనివల్ల ఎన్ఎమ్‌సీ అవినీతి రహిత సంస్థగా పనిచేసే అవకాశం ఉంటుంది. నిర్ణయాత్మక కమిటీల్లో సభ్యులుగా కేవలం కొందరు వైద్యులు మాత్రమే కాక ఐఐటీ, ఐఐఎం, ఇతర సంస్థలు, రంగాలనుంచి నామినేట్ అవుతారు. తద్వారా వైద్యరంగం ప్రాతినిధ్యం తగ్గి, ఇదొక కలగూరగంపలా తయారవుతుందనే వాదనా ఉంది. ఏ సంస్థల్లోనూ భిన్నరంగాల వ్యక్తులకు ప్రవేశం ఉండదన్నది గమనార్హం. స్వయంప్రతిపత్తి గల నాలుగు వ్యవస్థలను ఇందులో భాగంగా చేయాలనుకుంటే ఎమ్‌సీఐని పూర్తిగా తీసివేయవలసిన అవసరం కనిపించదు.

వివాదాస్పదమైన జాతీయ వైద్యకమిషన్ చట్టం

కార్పొరేటీకరణకు పట్టం కడుతున్న విధానాల్లో ఉన్నత విలువలను ఆశించడం దురాశే అవుతుంది. ఎమ్‌బీబీఎస్ సీట్లలో ఇప్పటివరకూ 15 శాతంగా ఉన్న యాజమాన్య కోటాను 50 శాతం చేస్తే ప్రైవేటు భాగస్వామ్యం మరింత పెరుగుతుంది. దేశంలోని 536 వైద్య కళాశాలల్లో సుమారు 80 వేల ఎమ్‌బీబీఎస్ సీట్లలో 38,000 సీట్లు ప్రైవేటు వైద్య కళాశాలల ఆధీనంలో ఉన్నాయి. ఇప్పుడు సుమారు 20 వేల సీట్లు పూర్తిగా యాజమాన్య కోటాలో భర్తీ అవుతాయి. వైద్యవిద్య సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతుంది. ప్రతిభను ప్రోత్సహించవలసిన ప్రభుత్వాలు వైద్యవిద్యను ప్రైవేటు విద్యాసంస్థలకు ధారాదత్తం చేస్తే భవిష్యత్ పర్యవసానాలు ఊహించనలవి కాదు. నిజానికి ప్రైవేటు వైద్య కళాశాలలను ఆమోదించే ప్రక్రియలోనే ఎమ్‌సీఐలో పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందనే ఆరోపణ ఉంది. దానికి మంచి ప్రత్యామ్నాయాన్ని, అవినీతికి ఆస్కారం లేని మార్గాన్ని కొత్తగా రూపొందించిన ఈ బిల్లు చూపలేకపోయింది. కోట్లు గుమ్మరించి కొన్న విద్య సమాజ హితాన్ని సామాన్యుడి వెతలను తీర్చేదిగా ఉండగలదా? నేడు నాటిన గంజాయి వనాల నుంచి రేపు తులసి తీర్థాన్ని ఆశించడం అత్యాశే అవుతుంది.

ప్రైవేటు వైద్యవిద్యా కర్మాగారాల నుంచి వచ్చిన ఈ వైద్యుల్లో ఎంతమంది గ్రామాల్లో పని చేయగలరు? తక్కువ కాలంలో ఎక్కువ మంది వైద్యులను తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం, భవిష్యత్తులో సామాన్యుడికి సరైన వైద్యం అందించే దిశగానే ఉంటుందా అనేది ప్రశ్నార్థకమే. దేశంలో వైద్యులు సంఖ్యాపరంగా పెరిగినంత మాత్రాన సామాన్యుడి ఆరోగ్యానికి, భద్రతకు భరోసా లభించదు. విలువలకు తిలోదకాలు ఇస్తున్నాయనే విమర్శలు ఎదుర్కొంటున్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉన్నవారూ అత్యున్నత ప్రమాణాలు గల ప్రభుత్వ వైద్యవిద్యాలయాల్లో చదివినవారే. విలువలు కేవలం చదివిన సంస్థ పైనే ఆధారపడి ఉండవు. మంచి కుటుంబం, పెంపకం, పెరిగిన వాతావరణం, గురువుల ప్రభావంతో పాటు వ్యక్తిగతంగా కొన్ని ఆశయాలకు కట్టుబడి ఉండేవారికి అవి సొంతమవుతాయి. కాబట్టి, అన్ని ప్రైవేటు వైద్య కళాశాలలనూ శంకించవలసిన అవసరం లేదు. ఎమ్‌బీబీఎస్ తరవాత చదువు ఆపేసి, వైద్యవృత్తిలో కొనసాగాలంటే తప్పనిసరిగా రాయవలసిన 'నేషనల్ ఎగ్జిట్ టెస్ట్' విద్యార్థులకు నిజంగా విషమ పరీక్షే. దేశంలోని అన్ని వైద్య కళాశాలల్లో విద్యాప్రమాణాలు ఒకే విధంగా లేవు. అటువంటప్పుడు అందరికీ ఒకే రకమైన బహుళ ఐచ్ఛిక ప్రశ్నల విధానంలో నిర్వహించే పరీక్ష సమతూకం ఎలా ప్రదర్శిస్తుందనేది పలువురి మదిలో మెదులుతున్న ప్రశ్న. కేవలం పాఠ్యాంశపరమైన జ్ఞానాన్ని మాత్రమే పరీక్షించే ఈ విధానంలో ప్రతి వైద్యుడికీ ప్రాథమికంగా ఉండాల్సిన 'క్లినికల్ స్కిల్స్'కి సంబంధించిన అంశాలు లేకపోవడం గమనార్హం. ఇంజక్షన్లు, చిన్న శస్త్రచికిత్సలు సైతం చేయలేనివారిని తయారు చేస్తున్నారనే అపవాదు ఇప్పటికే ఉంది. ఇకపై ఇది మరింత జటిల సమస్యలా మారి ప్రజలపాలిట ప్రాణాంతక వ్యవస్థ తయారవుతుందనే భయం వ్యక్తమవుతోంది. 'నేషనల్ ఎగ్జిట్ టెస్ట్'లో ఉత్తీర్ణులు కానివారి సంగతేమిటి? వాళ్ళు తిరిగి ఇంటర్మీడియట్ స్థాయికి వెళ్లిపోవాలా, మళ్ళీ పరీక్ష ఎప్పుడు రాయాలి, ఎన్నిసార్లు రాసే అవకాశం ఉందనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేవు.

ఆశావహ దృక్పథం

కొత్త చట్టం స్వభావం తెలిసేందుకు మరి కొంతకాలం పడుతుంది. దాంతో కొన్ని అనుమానాలు పటాపంచలు కావచ్చు. ఊహించని కొత్త పరిణామాలూ తెర మీదకు రావచ్చు. విజ్ఞత గల సమాజం ఎప్పుడూ మార్పు కోరుకుంటుంది. మార్పు మంచిదైతే ఆ సమాజం వివేకవంతమవుతుంది. చైతన్య పూరితమైన సమాజం ఆ మార్పును నిబిడీకృతం చేసుకొని అభివృద్ధి పథంలో సాగుతుంది. కొత్త చట్టాన్ని విమర్శించేవారు సైతం మార్పును పూర్తిగా విభేదించకపోవడం విశేషం. అవినీతి రహిత వ్యవస్థగా దీన్ని రూపొందించడం ప్రభుత్వం ముందున్న సవాలు. నిష్ణాతుల్నే కాదు... నీతిమంతులైనవారినీ ఇందులో నియమించకపోతే ఈ విధానం 'కొత్త సీసాలో పాత సారా' చందంగా తయారయ్యే అవకాశం ఉంది. ప్రైవేటు వైద్య కళాశాలల మంజూరులో, వాటి ప్రమాణాలను పరిశీలించడంలో నిష్పాక్షిక విధానాన్ని రూపొందించాలి. ప్రభుత్వ వైద్య కళాశాలలు ఎక్కువ మంది నిష్ణాతులైనవారిని అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలి. 'సరైన వైద్యం- సకాలంలో చికిత్స' ప్రజల ప్రాథమిక హక్కు. ఆరోగ్యవంతులైన ప్రజలు దేశాభివృద్ధిలో భాగస్వాములవుతారు. రుజా రహిత భారతాన్ని ఏర్పరచుకోవడమే స్వాతంత్ర్య సముపార్జనకు ఫలశ్రుతి!

– డాక్టర్ శ్రీభూషణ్ రాజు

(రచయిత– హైదరాబాద్ నిమ్స్‌లో నెఫ్రాలజీ విభాగాధిపతి)

సౌకర్యాల కొరతే శాపం

'కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్లు' అంటూ గ్రామస్థాయిలో కొందరిని ఈ చట్టం ద్వారా వైద్య వ్యవస్థలోకి ప్రవేశపెట్టారు. ఆరు నెలల తర్ఫీదు తరవాత వీరు గ్రామాల్లో ప్రాథమిక వైద్యం అందించగలుగుతారని ఆకాంక్ష. అనేకమంది నిష్ణాతులైన వైద్యులు గ్రామాలకు వెళ్ళకపోవడానికి ప్రత్యామ్నాయంగా వచ్చిన సమాధానమిది. ఇది అనేక కొత్త ప్రశ్నలకు తావిస్తోందనేది వైద్యుల భావం. ఎన్నో ప్రాథమిక వైద్యకేంద్రాల్లో సరైన వసతులు ఉండవు. రోగులకు నాణ్యమైన చికిత్స అందించగల అవకాశం తక్కువ కాబట్టి, సదుపాయాలను మెరుగుపరచాలి. ఎంతో మంది వైద్యులు సైతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. పలు రాష్ట్రాల్లో భర్తీ చేయని ఖాళీలు అనేకం. సదుపాయాలు పెంచకుండా ప్రజలకు అరకొర వైద్యం అందిస్తామనే విధంగా వ్యవహరించడం సమంజసం కాదన్నదీ పరిశీలించవలసిన వాదన. ఆర్ఎమ్‌పీ వైద్యుల అరకొర చికిత్సలతో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామీణ ప్రజలకు వీరు అంతకంటే మెరుగైన వైద్యాన్ని ఎలా అందించగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో గ్రామాల్లో ఇప్పటికే వేళ్ళూనుకున్న ఆర్ఎమ్‌పీ వైద్య వ్యవస్థను కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్లు ఎలా ఎదుర్కొంటారనేదీ ఆసక్తికరమైన అంశమే.

మంటగలుస్తున్న మానవత్వం

ముక్కుపచ్చలారని పసిబిడ్డలపై నానాటికీ పెరుగుతున్న అత్యాచారాలు ఆందోళన కలిగిస్తున్నాయి. దుర్మదాంధుల దాడులనుంచి పసినలుసులను ఏ విధంగా కాపాడుకోవాలో అంతు చిక్కక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. కఠిన చట్టాలు, తీవ్రమైన శిక్షలూ అకృత్యాలను అడ్డుకోలేకపోతున్నాయి. కేసుల విచారణలో జాప్యం, నేర నిర్ధారణలో పోలీసుల వైఫల్యం వంటివి సమస్యను సంక్షోభ స్థాయికి చేరుస్తున్నాయి. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని గ్రామంలో ఓ కామాంధుడు మూడున్నరేళ్ళ చిన్నారిపై అత్యాచారానికి ఒడికట్టాడు. వికారాబాద్ జిల్లా పెద్దాపూర్ మండల పరిధిలో ఓ యువకుడు సమీపంలోని ఇంట్లో ఉండే అయిదేళ్ల పసిపాపపై అకృత్యానికి తెగబడ్డాడు. వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో పదమూడేళ్ల బాలికను ముగ్గురు స్నేహితులు అత్యాచారం చేశారు. దాంతో ఆ బాలిక ఆత్మహత్య చేసుకుంది. అసోమ్‌లో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన కన్నతండ్రికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. హరియాణాలోని గురుగ్రామ్ ప్రాంతానికి చెందిన ఓ తండ్రి తన ఇద్దరు మైనర్ బాలికలపై అత్యాచారానికి ఒడికట్టినందుకు కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. ఛత్తీస్‌గఢ్‌లో పాఠశాల ప్రాంగణంలో ఓ చిన్నారిపై తోటి విద్యార్థులే అఘాయిత్యానికి ఒడికట్టారు. ఐపీసీ సెక్షన్ 376, 354ఏ, పోక్సో చట్టంలోని సెక్షన్ 4 కింద నిందితులపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఇలాంటి ఘటనలు దేశవ్యాప్తంగా రోజూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. వివిధ కారణాలవల్ల కొన్ని ఘటనలు వెలుగులోకి రావడం లేదు.

బాలికలపై నేరాలు ఏటికేడు పెరిగిపోతున్నాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జాతీయ నేర విభాగం గణాంకాల ప్రకారం 2015లో చిన్నారులపై జరిగిన నేరాలకు సంబంధించి 94,172 కేసులు నమోదవగా, 2016లో ఆ సంఖ్య 1,06,958కి చేరుకుంది. ఏటా పెరుగుతున్న నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అత్యధికంగా అంటే యాభై శాతానికి పైగా కేసులు ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, దిల్లీ, పశ్చిమ్‌బంగలోనే నమోదవుతుండటం గమనార్హం. చిన్నారులపై నేరాల్లో 18శాతం అత్యాచారానికి సంబంధించినవే.

చిన్నారులపై అత్యాచారాలు

పోక్సో చట్టం కింద 34.4 శాతం కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తర్ ప్రదేశ్‌లో 15.3, మహారాష్ట్రలో 13.6, మధ్యప్రదేశ్‌లో 13.1 శాతం కేసులు నమోదయ్యాయి. అకృత్యాలకు సంబంధించిన కేసుల విచారణ నత్తనడకన నడుస్తోంది. శిక్షల శాతం సైతం దిగదుడుపుగానే ఉంది. 2015-16లో 1.06 లక్షల కేసులు నమోదు కాగా 8.87 శాతం కేసుల్లో మాత్రమే నిందితులకు శిక్షలు పడ్డాయి. అధిక శాతం కేసులు రుజువుకాక వీగిపోతున్నాయి. న్యాయస్థానాల్లో పేరుకుపోయిన కేసులను త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఇటీవల వరంగల్‌లో తొమ్మిది నెలల పసిపాపపై అత్యాచారం జరిపి ఆపై పాశవికంగా హత్య చేసిన ఘటనలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు నెలన్నర రోజుల్లోనే విచారణ పూర్తిచేసి నిందితుడికి మరణ శిక్ష విధించింది. ఆ కేసు విషయంలో న్యాయవాదులు సైతం పసిపాపకు అండగా నిలవడం హర్షించదగ్గ విషయం.

మైనర్ బాలికలపై అత్యాచారాలు అరికట్టేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవలే కొత్త చట్టం తీసుకొచ్చింది. దాని ప్రకారం దోషులకు ఉరిశిక్ష విధిస్తారు. సాంకేతిక పరిజ్ఞాన దుర్వినియోగం అధికమైంది. విలువలను విస్మరిస్తున్నారు. వ్యసనాలకు బానిసలవుతూ దారి తప్పుతున్నారు. యువతరానికి నైతిక విలువలు, బంధాలు, అనుబంధాల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది. అందుకు సంబంధించి పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయుల్లో పాఠ్యాంశాలు ప్రవేశపెట్టాలి. అప్పుడే యువతకు సమాజంపట్ల అవగాహన కలుగుతుంది. బాలికల రక్షణ చట్టాలపై విస్తృత ప్రచారం నిర్వహించడం కొంతమేరకు ఫలితాలు ఇస్తుంది. ప్రధానంగా పోక్సో చట్టం పట్ల గ్రామ పంచాయతీ, పురపాలక, నగరపాలక సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ప్రజా ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, నర్సులకు సంపూర్ణ అవగాహన కల్పించాలి. తద్వారా వారు చట్టాలకు సంబంధించి యువతను జాగృతం చేయగలరు. దానివల్ల కొంతవరకైనా మార్పు పొడచూపి దారుణాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

– డాక్టర్ సిలువేరు హరినాథ్

(రచయిత– సెన్‌లో రీసెర్చ్ అసిస్టెంట్)

2014-16 మధ్యకాలంలో ప్రధాన రాష్ట్రాల్లో బాలికలపై అకృత్యాలకు సంబంధించి నమోదైన కేసుల వివరాలు

రాష్ట్రం	2014	2015	2016
ఉత్తర్‌ప్రదేశ్	14,835	11,420	16,079
మహారాష్ట్ర	8,115	13,921	14,559
మధ్యప్రదేశ్	15,085	12,859	13,746
దిల్లీ	9,350	9,489	8,178
పశ్చిమ్‌బంగ	4,909	4,963	7,004
తెలంగాణ	1,930	2,697	2,909
ఆంధ్రప్రదేశ్	2,059	1,992	1,849

ఆధారం: జాతీయ నేర విభాగం- 2016

ఈనాడు లేఖలు

జయహో సింధు!

బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండుసార్లు కాంస్యం, రెండు సార్లు రజతంతో సరిపెట్టుకున్న సింధు... తొలిసారి పసిడి పతకం సాధించి, అంతర్జాతీయ వేదికపై భారత కీర్తిపతాకను ఎగరేసింది. ఇది యువతకు... ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకం. రెండేళ్ల క్రితం తనను ఓడించిన క్రీడాకారిణి ఒకుహరను మ్యాచ్ ప్రారంభం నుంచే సింధు ముప్పుతిప్పలు పెట్టింది. ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిది ఏదీ లేదంటూ నిరూపించింది. ఆద్యంతం ఆమె చూపిన తెగువ, స్థైర్యం ముందు ప్రత్యర్థి విలవిల్లాడింది. మన సమాజంలో చిన్న సమస్యలకే తల్లడిల్లే మహిళలకు సింధు ఆదర్శప్రాయం. కేవలం అడుగు దూరంలో రెండుసార్లు పసిడి పతకాన్ని కోల్పోయినప్పుడు వచ్చిన విమర్శలను ఏ మాత్రం లెక్క చేయకుండా విజయమే ధ్యేయంగా కృషి చేసి, సాధించడం దేశ యువతకు ఓ గొప్ప పాఠం కావాలి.

- నల్లంశెట్టి జాహ్నవి, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్

సరిపడా బస్సులేవీ?

విద్యార్థులు బడులకు, కూలీలు పనులకు గ్రామాల నుంచి సమీప పట్టణాలకు రాకపోకలు జరపడానికి అవసరమైనన్ని బస్సు సర్వీసులు ఉండటంలేదు. రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. దాంతో విద్యార్థులు, కూలీలు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక్కో ఆటోలో పదిమందిని కూర్చోబెడుతున్నారు. ఏడుగురు కూర్చోవలసిన ఆటోల్లో 15 నుంచి 20 మందిని కుక్కుతున్నారు. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నష్టాల పేరుతో ఆర్టీసీ సరిపడా బస్సు సర్వీసులను నడపటంలేదు. రద్దీ ఉన్న సమయంలో బస్సులు తిప్పితే నష్టాలెందుకు వస్తాయనే దిశగా అధికారులు ఆలోచించాలి. దీనివల్ల ప్రయాణికులకూ ప్రయోజనం ఒనగూరుతుంది. గ్రామీణంలో ఉన్న ఒకటీ అరా బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. బస్సు పైన కూడా కూర్చుని ప్రమాదకర రీతిలో ప్రయాణం సాగిస్తున్నారు.

- కోట్ల వేదవతి, బోయపల్లి, మహబూబ్‌నగర్‌జిల్లా

జీవితం ఒక అష్టావధానం

అష్టావధానం ఒక సాహిత్య క్రీడ. ఇందులో అవధాని ప్రధానుడు. అతడు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈ విశిష్ట క్రీడలో ఇతడి చుట్టూ ఎనిమిది మంది ప్రశ్నికులు (ప్రశ్నలు వేసేవారు) కూర్చొని ఉంటారు. వాళ్లు అడిగే ప్రశ్నలకు తగిన విధంగా సమాధానాలు చెప్పి, మెప్పించడం అవధాని కర్తవ్యం. ప్ర

భామ కాదు.. బామ్మ!

'వయసు శరీరానికే కానీ మనసుకు కాదు. ఉత్సాహంగా ఉండేందుకు వృద్ధాప్యం అవరోధం కాదు'. అని వింటుంటాం. ఈ బామ్మను చూస్తే ఆ మాటలు అక్షరసత్యాలని అనిపిస్తుంది. ఎనిమిది పదుల వయసు దాటినా అందంగా తయారై ఫొటోకు ఫోజిచ్చిన ఈ బామ్మ పేరు పసందుల కమలమ్మ. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ వాసి. ఇప్పటికీ తన పనులు తనే చేసుకుంటుంది. సోమవారం ఆమె మనవడు బామ్మ జన్మదిన వేడుక నిర్వహించారు. ఆయన రంగస్థల కళాకారుడు కావడంతో కమలమ్మను ఇలా సుందరంగా ముస్తాబు చేశారు.

– న్యూస్‌టుడే, డోర్నకల్

ఈల్ చేప చర్మం నుంచి కొల్లాజెన్

◆ మూల కణ ఆధారిత టిష్యూ ఇంజినీరింగ్‌లో ఉపయోగం ◆ ఐఐటీ హైదరాబాద్ పరిశోధకుల ఘనత

మానవ శరీరంలోని చర్మం, మృదులాస్థి, ఎముకల్లో కొల్లాజెన్ అనే ప్రొటీన్ ఉంటుంది. ప్రమాదాల బారిన పడి చర్మం కాలడం, ఎముకలు విరగడం తదితర సందర్భాల్లో చికిత్స కోసం దీనిని వాడుతుంటారు. మూలకణ ఆధారిత టిష్యూ ఇంజినీరింగ్‌లో ఇది కీలకంగా ఉంటుంది. ఆవులు, వరాహాల చర్మంతో పాటు ఎలుకల తోకల నుంచి ప్రస్తుతం దీనిని సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ ఖర్చుతో కూడుకున్నది కావడంతో పాటు మత విశ్వాసపరమైన సున్నితాంశాలు ప్రతిబంధకాలుగా మారుతుంటాయి. వీటన్నింటికీ పరిష్కారం చూపేలా ఐఐటీ హైదరాబాద్‌లోని బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధనలు కొనసాగించింది. సముద్రాల్లో ఉండే ఈల్ చేప చర్మం నుంచి కొల్లాజెన్ సేకరిస్తే మేలు జరుగుతుందని గుర్తించారు. యువ శాస్త్రవేత్త మనో గోవిందరాజ్, సహ ఆచార్యుడు

పరిశోధనలో పాలుపంచుకున్న సహ ఆచార్యుడు సుభా నారాయణ్‌రథ్, యువ శాస్త్రవేత్త డాక్టర్ మనో గోవిందరాజ్, పరిశోధక విద్యార్థి ఉదయ్ కిరణ్ రూపావత్ (ఎడమ నుంచి కుడికి)

సుభా నారాయణ్‌రథ్, పరిశోధక విద్యార్థి ఉదయ్ కిరణ్ రూపావత్ పరిశోధనలో పాలుపంచుకున్నారు. ఈ ఫలితాలు 'క్లీనర్ ప్రొడక్షన్ జర్నల్'లో ఇటీవల ప్రచురితమయ్యాయి. ఈ మేరకు సోమవారం ఐఐటీ వర్గాలు ఒక ప్రకటనను విడుదల చేశాయి. సముద్రాల్లో దొరికే ఈల్‌చేప చర్మం నుంచి కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేయవచ్చని వీరు నిరూపించారు. తమ పరిశోధనతో తక్కువ ఖర్చుతో కొల్లాజెన్‌ను అందుబాటులోకి తేవడంతోపాటు కాలుష్యాన్ని తగ్గించొచ్చని సహఆచార్యుడు సుభా నారాయణ్‌రథ్ వెల్లడించారు.

ఉత్పత్తి చేసిన విధానమిదీ

ఈల్ చేప చర్మాన్ని వీరు అసిటిక్ ఆమ్లం, ఉప్పు, పెప్సిన్‌తో శుద్ధి చేశారు. అనంతరం దానికి ఆల్జినేట్ హైడ్రోజెల్‌ను కలిపారు. త్రీడి ప్రింటర్ సాయంతో చికిత్సలో ఉపయోగించేందుకు అనువుగా కొల్లాజెన్ మెటీరియల్‌ను రూపొందించారు. కాస్మొటిక్ సర్జరీలతో పాటు విరిగిన ఎముకను అతికించేందుకూ చేసే చికిత్సల్లో దీనిని వాడితే సత్ఫలితాలుంటాయని పేర్కొంటున్నారు.

– ఈనాడు, సంగారెడ్డి

బొమ్మల ప్యాకెట్‌తో రెహాన్. చిత్రంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు

కథనం కదిలించింది.. మానవత్వం పరిమళించింది

- రెహాన్ కుటుంబానికి కేటీఆర్, కలెక్టర్ అండ
- ఇప్పటివరకు అందిన సాయం రూ.3 లక్షలు

కొళ్లు లేవు.. నడిపించే నాన్నా లేడు.. శీర్షికతో ఈనెల 23న 'ఈనాడు'లో ప్రచురితమైన మానవీయ కథనం పలువురిని కదిలించింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి దేశవిదేశాల నుంచి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వీరి నుంచి ఇప్పటివరకు రూ.3 లక్షల సాయం అందింది. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కూడా స్పందించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి తగు సాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం ఝరాసంగం మండలం కప్పానగర్‌లోని రెహాన్ ఇంటికి కలెక్టర్ హనుమంతరావు, ఇతర అధికారులతో కలిసి వెళ్లారు. వారి ఇంట్లో అరగంట సేపు ఉండి ఆ బాలుడికి రిమోట్ కారు, పియానో, ఏబీసీడీలకు సంబంధించిన బోధన సామగ్రి అందజేశారు. తల్లి షాహిదా, కుమారుడు రెహాన్, తాత షక్రుద్దీన్‌లను చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో పంపేందుకు ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రిలో నిపుణులు అందుబాటులో లేరన్న సమాచారంతో ప్రయాణాన్ని వాయిదా వేశారు. 'ఉండేందుకు ఇల్లు లేదు.. తోబుట్టువు ఇంట్లో ఉంటున్నాం, సొంతిల్లు ఇప్పించడంతోపాటు ఏదైనా చిరుద్యోగం ఇవ్వాలి' అని రెహాన్ తల్లి కలెక్టర్‌కు విజ్ఞప్తిచేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. రెహాన్‌కు కృత్రిమ కాలు ఇవ్వడంతో పాటు చికిత్సలు ఉచితంగా చేయిస్తామని చెప్పారు. కలెక్టర్ సొంతంగా రూ.10 వేలు, జిల్లా అధికారుల తరఫున రూ.40 వేలు కలిపి మొత్తం రూ.50 వేలు సాయంగా అందజేశారు. క్వింటా బియ్యం, మూడు నెలల సరకులు అందించడంతోపాటు పిల్లలకు ఉచితంగా చదువు చెప్పిస్తామని హామీ ఇచ్చారు.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

సరైన మార్గంలోనే ఆర్థిక ఉద్దీపనలు

- అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం భారత్‌పై ప్రభావం చూపదు
- ప్రపంచ వాణిజ్యంలో మన ఎగుమతులు 2 శాతమే
- ముఖ్య ఆర్థిక సలహాదారు కె.వి.సుబ్రమణియన్

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఆర్థిక ఉద్దీపనలు సరైన మార్గంలో ఉన్నాయని, ఆర్థిక వ్యవస్థను కచ్చితంగా బలోపేతం చేస్తాయని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు కె.వి. సుబ్రమణియన్ అన్నారు. నిర్మాణాత్మక సంస్కరణల్లో ఈ నిర్ణయాలు భాగమన్నారు. కొత్తగా ఎంపికైన 140 మంది అఖిల భారత సర్వీసు అధికారులకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీఐ)లో 15 వారాల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుబ్రమణియన్ విలేకరులతో మాట్లాడారు. "దేశ ఆర్థికాభివృద్ధికి అవసరమైన అన్ని అంశాలపై కేంద్రం దృష్టిసారించింది. ఆర్థికాభివృద్ధికి పెట్టుబడులు, రుణాలు కీలకం. ప్రభుత్వరంగ బ్యాంకులకు ప్రకటించిన రూ.70 వేల కోట్ల పెట్టుబడి తోడ్పాటు ఆర్థికాభివృద్ధికి కీలకమైన అంశం" అని వివరించారు. "అమెరికా-చైనా మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధం మన దేశ ఎగుమతులపై ఎలాంటి ప్రభావం చూపదు. ప్రపంచ వాణిజ్యంలో మన దేశ ఎగుమతులు కేవలం 2 శాతమే. ఉత్పాదకత పెంచుకుంటే.. ఎగుమతులు పెంచుకోవడానికి పుష్కలమైన అవకాశాలు, పరిస్థితులు ఉన్నాయి" అని సుబ్రమణియన్ తెలిపారు.

ప్రజాసేవకు చక్కటి అవకాశం

అఖిల భారత సర్వీసుల ద్వారా ప్రజాసేవ చేసేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుబ్రమణియన్ సూచించారు. అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల జీవన స్థితిగతులను మార్చేందుకు ఈ సర్వీసు గొప్ప అవకాశమని యువ అధికారులు గుర్తించాలన్నారు. అవినీతికి దూరంగా ఉంటూ విలువలతో కూడిన జీవితం గడపాలన్నారు. సంతృప్తికర జీవితంలో డబ్బు అనేది ఒక అంశం మాత్రమేనని గుర్తించాలన్నారు. నిబద్ధతతో పనిచేయాలన్నారు. అధికారులకు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ అత్యున్నత ప్రమాణాలతో మెరుగైన శిక్షణ ఇస్తోందని సంస్థ డైరెక్టర్ జనరల్ బి.పి.ఆచార్య చెప్పారు. కార్యక్రమంలో అదనపు డీజీ హర్‌ప్రీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 కోట్ల జీఎస్టీ ఎగవేత

యూపీకి చెందిన వ్యాపారి అరెస్టు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖకు రూ.20.08 కోట్ల వస్తు,సేవల పన్ను (జీఎస్టీ) ఎగవేసిన వ్యాపారి కౌశిక్ శక్తి బాబూరాంను వాణిజ్య పన్నుల శాఖ అరెస్టు చేసింది. ఈమేరకు ఆ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన కౌశిక్ శక్తి పన్నులు చెల్లించకుండానే రూ.150 కోట్లకు పైగా వ్యాపారం చేసినట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 21 సంస్థలను ఏర్పాటు చేయగా ఇందులో తెలంగాణలో నాలుగు సంస్థలు నెలకొల్పి వ్యాపారాలు చేసినట్లు తెలిపారు. దేశంలో వివిధ ప్రాంతాలనుంచి రకరకాల ఉత్పత్తుల్ని హైదరాబాద్‌కు తరలించి జీఎస్టీ చెల్లించకుండానే వ్యాపారులకు సరఫరా చేసినట్లు గుర్తించామన్నారు. ఈ ఏడాది మార్చిలో రిజిస్టర్ చేసుకున్న నాలుగు సంస్థల నుంచి రూ.150 కోట్లు వ్యాపారం చేయగా రూ.20.08 కోట్ల జీఎస్టీ చెల్లించాల్సి ఉందన్నారు. వాణిజ్య పన్నుల శాఖ స్పెషల్ కమిషనర్ ఎం.ఎస్.రెడ్డి నేతృత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన డిప్యూటీ కమిషనర్ ఆర్.ఏడుకొండలు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేసి నిందితుణ్ని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

మిషన్ భగీరథకు 50 శాతం నిధులివ్వండి

కేంద్రానికి మంత్రి ఎర్రబెల్లి విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలంగాణ వ్యాప్తంగా ఇంటింటికి తాగునీరు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకానికి 50శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సోమవారమిక్కడ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖలోని తాగునీరు, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాలతో జల్‌జీవన్ మిషన్ పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో ఎర్రబెల్లి, ఎంపీలు నామా నాగేశ్వర రావు, బండ ప్రకాశ్‌లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మిషన్ భగీరథకు నిధులు ఇవ్వాలని గతంలో నీతి ఆయోగ్ సిఫార్సు చేసిన విషయాన్ని కేంద్రమంత్రికి గుర్తుచేశారు. అనంతరం ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో తాగునీరు కష్టాలు తొలగించడానికి సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తున్న విషయాన్ని కేంద్రమంత్రికి వివరించామన్నారు. మిషన్ భగీరథ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రస్తుత కేంద్ర పథకం జల్‌జీవన్ మిషన్‌కూడా ఈ తరహా పథకమేనన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఇప్పటికే అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకానికి ఏటా రూ.2110 కోట్లు కేంద్రం భరించాలని కోరినట్లు ఎర్రబెల్లి తెలిపారు. అనంతరం ఆయన ఎంపీలతో కలిసి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణలో గ్రామీణాభివృద్ధికి రావాల్సిన రూ.680 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని ఈ సందర్భంగా ఎర్రబెల్లి విజ్ఞప్తి చేశారు.

అర్జీ తీసుకుని.. ఆకలి తీర్చి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: ప్రజావాణి కార్యక్రమంలో వినతులు స్వీకరించడమే కాకుండా.. వారికి కడుపునిండా భోజనం పెట్టి పంపించే కార్యక్రమానికి సంగారెడ్డి కలెక్టర్ హనుమంతరావు శ్రీకారం చుట్టారు. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన వారందరికీ భోజన టోకెన్‌లు ఇచ్చారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సంస్థ, కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా అధికారుల సేవా సంఘం 'సహాయం' ఆధ్వర్యంలో ప్రతి సోమవారం అర్జీదారులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు.

వాంగ్మూలాల నమోదుపై సుప్రీంకోర్టుకెళ్లాం

లింగయ్య ఎన్‌కౌంటర్‌పై హైకోర్టుకు ప్రభుత్వం నివేదన

ఈనాడు, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రాళ్లగడ్డ అటవీ ప్రాంతంలో జులై 31న జరిగిన లింగయ్య ఎన్‌కౌంటర్ ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయాలంటూ ఇల్లెందు మెజిస్ట్రేట్‌కు ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు నివేదించింది. రాళ్లగడ్డ అటవీ ప్రాంతంలో జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్ అని, దీనిపై రీపోస్టుమార్టం నిమిత్తం ఆదేశాలు జారీ చేయాలని, బాధ్యులపై చర్యలకు ఆదేశించాలంటూ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఎన్‌కౌంటర్‌లో ప్రత్యక్ష సాక్షులుగా పిటిషనర్ పేర్కొన్నవారి నుంచి వాంగ్మూలాలను సేకరించాలంటూ ఈ కోర్టు ఆదేశాలిచ్చిందని, వాటిపై సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశామన్నారు. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది స్పందిస్తూ లింగన్న మృతదేహంపై 11 గాయాలున్నట్లు పోస్టుమార్టం రిపోర్టులో ఉందని, దీన్ని బట్టి కాల్చి చంపారని తెలుస్తోందన్నారు. ప్రభుత్వం కౌంటరు దాఖలు చేస్తామని చెప్పడంతో ధర్మాసనం విచారణను సెప్టెంబరు 13వ తేదీకి వాయిదా వేసింది.

'కాళేశ్వరం'పై ప్రమాణపత్రం దాఖలు చేయండి

ఈనాడు, దిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇచ్చిన పర్యావరణ అనుమతులకు సంబంధించి ప్రమాణపత్రం దాఖలు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ హయాతుద్దీన్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ రఘువేంద్ర ఎస్ రాథోడ్ సోమవారం విచారణ చేపట్టారు.

అభివృద్ధి పనుల్లో జోరు పెరగాలి

- మావోయిస్టు ప్రాంతాల్లో మరిన్ని బ్యాంకులు, సెల్‌టవర్లు
- పర్యావరణ అనుమతుల్లో ఇబ్బందులు అధిగమించాలి
- రూ.అరకోటి వరకు పనులను నామినేషన్‌పై స్థానికులకే అప్పగించాలి
- ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో నిర్ణయాలు

తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించి దిల్లీలో నిర్వహించిన సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ మంత్రి మహమూద్ అలీ

ఈనాడు, దిల్లీ: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రంలోని వివిధ శాఖల మంత్రులను కోరారు. ప్రస్తుతం పది రాష్ట్రాల్లోని పది జిల్లాలకే వారి కార్యకలాపాలు పరిమితం అయ్యాయని, ఇక్కడ సైతం పూర్తిగా అవి కనుమరుగయ్యేలా అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఇందుకు నిధులకెలాంటి కొరత లేదని చెప్పారు. సోమవారం ఇక్కడి విజ్ఞాన్ భవన్‌లో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రులు జగన్‌మోహన్‌రెడ్డి(ఏపీ), నీతీశ్‌కుమార్(బిహార్), యోగి ఆదిత్యనాథ్ (ఉత్తర్‌ప్రదేశ్), రఘుబర్‌దాస్(జార్ఖండ్), భూపేష్‌భగేల్(చత్తీస్‌గఢ్), కమల్‌నాథ్ (మధ్యప్రదేశ్)తో పాటు, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, నరేంద్రసింగ్‌తోమర్, అర్జున్‌ముండా, ఎం.ఎన్.పాండే, రవిశంకర్‌ప్రసాద్, కిషన్‌రెడ్డి, తెలంగాణ హోంమంత్రి మహమూద్‌అలీ పాల్గొన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధే ప్రధాన అంశంగా చర్చలు జరిగినట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి.

నియంత్రణలో తెలుగు రాష్ట్రాలు భేష్..

తొలుత హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లా మాట్లాడుతూ.. మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు మంచి పనితీరు కనబరుస్తున్నాయని, మిగతా రాష్ట్రాలకు అవి ఆదర్శంగా నిలిచాయని కితాబిచ్చారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలన్నీ అడవుల్లోనే ఉన్నందున అక్కడ చేపట్టే అభివృద్ధి పనులకు పర్యావరణ అనుమతులు లభించడం సవాల్‌గా మారిందన్నారు. ఇకపై అలాంటి పరిస్థితి తలెత్తకుండా పర్యావరణ, అటవీశాఖలు మిగతా శాఖలతో సమన్వయం చేసుకోవాలని హోంమంత్రి అమిత్‌షా సూచించారు. ముఖ్యమంత్రులే అన్ని విషయాలు చర్చించడం సాధ్యం కానందున.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్రంలోని వివిధశాఖ కార్యదర్శులు నిరంతరం చర్చిస్తూ మావోయిస్టు ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కోరారు. రహదారులు, సెల్‌టవర్ల నిర్మాణానికి పెద్దపీట వేయాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ల ఏర్పాటుకే అనుమతులు ఇస్తున్నారని, ప్రైవేటు ఆపరేటర్లకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వాల నగదు బదిలీ పథకాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలు, ఆదివాసీలు సులభంగా ఉపయోగించుకొనేందుకు వీలుగా మరిన్ని బ్యాంకులు, ఏటీఎంలు, పోస్టాఫీసులు ఏర్పాటుచేయాలని కోరారు. ఇక్కడ చేపట్టే అభివృద్ధి పనులను స్థానికులకే అప్పగించాలని నిర్ణయించారు. ఇప్పటివరకూ నామినేషన్ పద్ధతిన రూ.5లక్షల వరకు పనులు అప్పగించడానికే నిబంధనలు అంగీకరిస్తున్నాయని, ఇకపై ఆ పరిమితిని రూ.50లక్షలకు పెంచాలని తీర్మానించారు. సమావేశానికి మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రులు హాజరుకాలేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తరఫున అక్కడి హోంమంత్రి మహమూద్‌అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రమణ్యం హాజరయ్యారు.

రహదారులు అభివృద్ధి చేయండి: హోంమంత్రి మహమూద్ అలీ

తెలంగాణలో గ్రామీణప్రాంతాల్లో రహదారులను మరింత అభివృద్ధి చేయాలని కేంద్రానికి రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ విజ్ఞప్తి చేశారు. సోమవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన నిర్వహించిన నక్సల్ ప్రభావిత రాష్ట్రాల సీఎంల సమావేశానికి తెలంగాణ నుంచి మంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఎస్ ఎస్‌కే జోషిలు హాజరయ్యారు. అనంతరం మహమూద్ అలీ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రహదారుల అనుసంధానం పెరిగిందని, గ్రామీణ ప్రాంతాలకు మరింతగా రహదారులు అనుసంధానించి అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి మూడు కంపెనీల కేంద్ర బలగాలను కశ్మీర్‌కు పంపిన నేపథ్యంలో రాష్ట్రానికి ఆరు బెటాలియన్లు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడితే నక్సలిజం పెరుగుతుందని అనుమానాలు వ్యక్తం చేశారని, కానీ వాటిని పటాపంచలు చేస్తూ ప్రస్తుతం రాష్ట్రంలో నక్సలిజం లేకుండా చేశామన్నారు.'

ఎన్నికల్లో సమూల మార్పులు రావాలి

'అవే' జాతీయ సదస్సులో మాణిక్ సర్కార్

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఎన్నికల విధానంలో సమూల మార్పులు అవసరమని త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో పోటీ చేయడమంటే పెట్టుబడులు పెట్టి తిరిగి సంపాదించుకుంటామనే ధోరణి పోవాలని.. 30-40 శాతం ఓట్లు, ఎక్కువ సీట్లు వచ్చిన పార్టీలు గద్దెనెక్కే పద్ధతిలో మార్పురావాలని సూచించారు. 'అవే' సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. అవినీతి నిర్మూలన ఉద్యమంలో రాజకీయ పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మీడియా ఎందుకో తన బాధ్యత మరిచిపోయిందనే భావన కలుగుతోందన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. పాలకులు, అధికారులు నిజాయతీగా ఉంటే సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. ఏపీ పూర్వ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పరకాల ప్రభాకర్ మాట్లాడారు. అవాయిడ్ వైల్డ్ నెస్ అండ్ ఈస్టేనెస్ (అవే) వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్‌చౌదరి సంస్థ ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారులు సంజయ్ భాటియా, ఎ.మురళి, ఐపీఎస్ అధికారి బి.రమేశ్‌తోపాటు వివిధ రంగాలకు చెందిన రాధాకృష్ణ, ఆనందరావు, కె.లక్ష్మీబాయి, రాధాకృష్ణ, ఓబులమ్మ, ఇందిరమ్మ, సుబ్రహ్మణ్యం, కానిస్టేబుల్ చంద్రయ్యలను సత్కరించారు.

సదస్సులో ప్రసంగిస్తున్న త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, చిత్రంలో మండలి బుద్ధప్రసాద్, పరకాల ప్రభాకర్, జయప్రకాశ్ నారాయణ తదితరులు



సిద్ధమైన విద్యుత్తు లైన్లు

నడికుడి-సికింద్రాబాద్ మార్గంలో ఇక విద్యుత్తు రైళ్ల కూత

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ నుంచి గుంటూరు రైలు మార్గంలో బీబీనగర్ నుంచి నడికుడి వరకు విద్యుత్తు లైన్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో సెప్టెంబరు 1 నుంచి ఈ మార్గంలో విద్యుత్తు ఇంజిన్లతో రైళ్లను నడిపేందుకు రైల్వే ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 20 ఏళ్లకుపైగా ఈ మార్గంలో విద్యుద్దీకరణ చేపట్టాలని విద్యుత్తు ఇంజిన్లతో రైళ్లను నడిపించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు భావించగా.. ఎట్టకేలకు 250 కిలో మీటర్ల మేరకు విద్యుత్తు లైన్ల ఏర్పాటును పూర్తి చేశారు.

రైలు నుంచి విద్యార్థి తోసివేత

కాళ్లు కోల్పోయిన నిరంజన్‌రెడ్డి

గుత్తి, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా గుత్తి మండలం జక్కలచెరువు రైల్వేస్టేషన్ వద్ద సోమవారం రైలులో నుంచి ఓ విద్యార్థిని గుర్తుతెలియని వ్యక్తులు కిందకు తోసేశారు. ఈ ఘటనలో విద్యార్థి రెండు కాళ్లనూ కోల్పోయాడు. తాడిపత్రికి చెందిన నిరంజన్‌రెడ్డి విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. జ్వరంతో బాధపడుతుండటంతో విజయవాడ-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులో తాడిపత్రికి బయలుదేరాడు. నిద్రలో ఉండటంతో తాడిపత్రిలో రైలు దిగలేకపోయాడు. జక్కలచెరువు సమీపంలో మెలకువ వచ్చింది. రైలు జక్కలచెరువు రాగానే నిదానంగా వెళితే దిగాలని బోగి వాకిలి వద్ద నిలుచున్నాడు. ఈలోగా గుర్తుతెలియని వ్యక్తులు అతణ్ని కిందకు తోసేశారు. రైలు నుంచి కిందపడిన నిరంజన్‌రెడ్డి కాళ్లపై రైలు చక్రాలు వెళ్లాయి. కుడి కాలు శరీరం నుంచి వేరైంది. మరో కాలు నుజ్జునుజ్జయింది.

సైకాలజీ విద్యార్థులకు మనోవేదన

- ప్రయోగ పరీక్ష రాసినా గైర్హాజరు నమోదు
- అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నిర్లక్ష్యం

కరీంనగర్ (గణేశ్‌నగర్), న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం పొరపాటుతో డిగ్రీ సైకాలజీ విద్యార్థులు మనోవేదన అనుభవిస్తున్నారు. జిల్లాలు దాటి వెళ్లి ప్రయోగ తరగతులు, పరీక్షలకు హాజరైనా.. హాజరుకానట్లు మెమోల్లో పేర్కొని అనుత్తీర్ణులను చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ విద్యార్థులు సైకాలజీ ప్రయోగ పరీక్షలకు వరంగల్‌లోని స్టడీ సెంటర్‌లో హాజరయ్యారు. మే నెలలో పరీక్షలు పూర్తయ్యాయి. ఇటీవల ఫలితాలు విడుదల చేశారు. మార్కుల మెమోలో ప్రయోగ పరీక్షలకు గైర్హాజరైనట్లు రావడంతో విద్యార్థులు కంగుతిన్నారు. అధ్యయన కేంద్రానికి, వరంగల్ పరీక్ష కేంద్రానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. కేంద్రం అ

అను నిత్యం.. సేవాతత్వం

మానవత్వానికి చిరునామా ఈ వృద్ధుడు. ఈయన పేరు మహ్మద్ హనీఫ్. 83 ఏళ్ల వయసులోనూ ఆటోనడుపుతూ జీవనోపాధి పొందుతున్నారు. పేదరికంలో ఉన్నా సాటివారికి సాయం చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారినీ, ఆస్పత్రుల వద్ద ఆటో దొరక్క ఇబ్బందిపడేవారినీ ఉచితంగా వారి గమ్యాలకు చేరుస్తున్నారు. రోజూ ఓ పదిమందినైనా ఇలా తీసుకెళ్తారు. రెండేళ్ల క్రితం హజ్ యాత్రకు వెళ్లివచ్చాక ఇతరులకు సాయంచేయాలని అనుకున్నానని చెప్పారు. ప్రధాని మోదీ ఇచ్చిన 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' నినాదానికి ప్రభావితం అయినట్లు తెలిపారు. తన ఫోన్ నంబర్, ఇతర వివరాలను ఆటోపై రాసి మరీ సేవలందిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు పలువురు తనకు ఫోన్ చేసి పిలుస్తున్నారని చెప్పారు. సికింద్రాబాద్ ఆస్పత్రి నుంచి జయశ్రీ అనే మహిళను తీసుకెళ్తుండగా ట్యాంక్‌బండ్ ప్రాంతంలో 'ఈనాడు' కెమెరాకు చిక్కారు.

– ఈనాడు, హైదరాబాద్

పత్తి రైతుల్ని చైతన్యపరుద్దాం: నిరంజన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఈ ఏడాదిలో అంతటా పత్తి దిగుబడి 3.5 నుంచి 5 శాతం వరకు పెరగనుందని, కొనుగోలు ధరలో తేడాలకు అవకాశముందని మార్కెటింగ్ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి తెలిపారు. వచ్చే అక్టోబరు నుంచి మార్కెట్‌కు వచ్చే ఈ పంట కొనుగోళ్లకు సంబంధించి, ప్రభుత్వపరంగా చేయాల్సిన ఏర్పాట్లపై సోమవారం ఆయన సమీక్ష జరిపారు. భారత పత్తి సంస్థ(సీసీఐ) ఎండీ అలీరాజి, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, వ్యవసాయ కమిషనర్ రాహుల్ బొజ్జా, మార్కెటింగ్ సంచాలకురాలు లక్ష్మీబాయి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, పత్తి కొనుగోళ్ల నిబంధనలపై రైతులందరినీ చైతన్యపరిచేలా ప్రచారం జరపాలన్నారు. గోదాములను సిద్ధంగా ఉంచాలని, 302 మిల్లుల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు పత్తిని అమ్మిన వెంటనే ఆన్‌లైన్‌లో చెల్లించాలని, తూకం యంత్రాలు సక్రమంగా ఉండాలని అన్నారు. ఇప్పటికే పత్తి రైతులకు గుర్తింపు కార్డులిచ్చినట్లు చెప్పారు. జిల్లాల స్థాయుల్లోనూ కమిటీలు వేసి కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఆయిల్‌పాం తోటల సాగు తీరును సమీక్షించిన మంత్రి..ఈ పంటను మరింత ప్రోత్సహిస్తామని ప్రకటించారు ప్రస్తుతం 40,000 ఎకరాల్లో సాగవుతున్న దీన్ని 2 లక్షల ఎకరాలకు పెంచాలన్న ప్రతిపాదన ఉందన్నారు.

ప్రమాదాలతో ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం

- మంత్రి ప్రశాంత్‌రెడ్డి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం పడుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 'రహదారి భద్రత'పై బైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన ఒక రోజు సదస్సును మంత్రి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాల ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. రాష్ట్రంలో 26 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని రహదారులు- భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి చెప్పారు. రహదారులకు భద్రతాపరమైన మార్పులు చేయడం వ్యయంతో కూడుకున్న వ్యవహారమన్నారు. 76 శాతం రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్ల నిర్లక్ష్యం, పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు కారణమని రాష్ట్ర రహదారి భద్రత సంస్థ డీజీ టి.కృష్ణప్రసాద్ చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు 2 శాతమే ఉండగా.. ప్రమాదాల వాటా 49 శాతంగా ఉందని వివరించారు. మృతుల్లో 15-45 ఏళ్ల మధ్య వయసు వారే ఎక్కువగా ఉండడం ఆందోళనకు గురిచేసే అంశమని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రవేశపెట్టే ఆలోచన చేస్తోందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, రోడ్లు భవనాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఛైర్మన్ రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో డీట్ పోర్టల్, యాప్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక, ఉపాధికాశాఖల మంత్రి మల్లారెడ్డి. పక్కన యాకూబ్‌నాయక్, జయేశ్ రంజన్, మణికాంత్

డీట్‌లో నమోదు చెయ్.. ఉపాధి పట్టేయ్

నూతన పోర్టల్, యాప్‌లను ఆవిష్కరించిన మంత్రి మల్లారెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్రంలో డీట్ (డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) పోర్టల్‌ను తీసుకువచ్చామని కార్మిక, ఉపాధి శాఖల మంత్రి మల్లారెడ్డి తెలిపారు. సచివాలయంలోని డీ బ్లాక్‌లో సోమవారం డీట్ పోర్టల్, మొబైల్ యాప్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఇందులో ఉద్యోగాలు ఇచ్చే 45 వేల సంస్థల వివరాలు నిక్షిప్తం చేశామని, ప్రస్తుతం 42 వేల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డీట్‌లో నమోదు చేసుకున్న వారి విద్యార్హతలను అనుసరించి ఎలాంటి డబ్బులు తీసుకోకుండా ఉపాధి చూపిస్తామన్నారు. పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన ఎవరైనా ఇందులో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇలాంటి ఆవిష్కరణ రావడం దేశ చరిత్రలోనే తొలిసారని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు. కొత్త సంస్థలకు ఉద్యోగులు దొరకడం డీట్‌తో సులభతరం అవుతుందని, ఇది మరిన్ని సంస్థలను ఆకర్షిస్తుందని చెప్పారు. విద్యార్హతను బట్టి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు సంబంధించిన సమాచారం ఈ యాప్, పోర్టల్ ద్వారా నిరుద్యోగులకు ఎప్పటికప్పుడు(జాబ్ అలర్ట్) అందుతుందని కార్మిక శాఖ కార్యదర్శి యాకూబ్ నాయక్ తెలిపారు. చిన్నస్థాయి మొదలుకుని ఐటీ, ఫార్మా రంగాల వరకు అన్ని రకాల ఉద్యోగాలకు డీట్‌లో సంప్రదించవచ్చని ఆ సంస్థ సీఈవో మణికాంత్ వివరించారు. గూగుల్‌లో https://tsdeet.com వెబ్‌సైట్ లేదా ప్లేస్టోర్ నుంచి డీట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యసంస్థ)
"టూరిజం హౌస్", # 3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

ఆసక్తి వ్యక్తీకరణ

హౌస్‌కీపింగ్, కిచెన్ స్టివార్డింగ్ మరియు గార్డెన్ మెయింటెనెన్స్ సర్వీస్ కొరకు హోటల్ సర్వీసుల అవుట్‌సోర్సింగ్‌ను ఏర్పాటుచేసే నిమిత్తం ఏజెన్సీలు/కాంట్రాక్టరు యొక్క ఎంప్యానెల్‌మెంట్ కొరకు TSTDC ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానిస్తున్నది.
పూర్తి వివరాల కొరకు TSTDC వెబ్‌సైట్ "tourism.telangana.gov.in"ను చూడవల్సిందిగా ఆసక్తిగల ఏజెన్సీలు/కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి.
EOI దాఖలుకు చివరి తేది 9-9-2019న మ. 3.00 గం. లోపు.

సం/-
I/C. జనరల్ మేనేజర్ (హోటల్స్)

చట్టం అంటే లెక్కలేదా?

- నమోదుకు ఆసక్తి చూపని నిర్మాణ సంస్థలు
- బాలారిష్టాలు దాటని స్థిరాస్తి నియంత్రణ చట్టం
- అగ్ర భాగాన మహారాష్ట్ర... ఆరో స్థానంలో తెలంగాణ

ఈనాడు, హైదరాబాద్: స్థిరాస్తి రంగంలో పారదర్శకతకు పెద్దపీట వేసి కొనుగోలుదారులకు అండగా నిలిచేందుకు ఉద్దేశించిన స్థిరాస్తి నియంత్రణ చట్టం (రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్-రెరా) రాష్ట్రంలో బాలారిష్టాలను దాటడంలేదు. దేశంలో ఇది అమలవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఆరో స్థానంలో ఉంది. మహారాష్ట్రది మొదటి స్థానం. అక్కడ రెండేళ్ల క్రితమే అమల్లోకి తెచ్చారు. మన రాష్ట్రంలో ఈ చట్టం ఏడాది క్రితం అమల్లోకి రాగా దీనికింద నమోదు చేసుకోవాల్సిన నిర్మాణ సంస్థలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. కేవలం 50 శాతం సంస్థలే వినియోగించుకున్నాయి. మొదటి మూడు నెలలు ఉచితంగా అవకాశం కల్పించినా... గత నెల వరకూ జరిమానాతో నమోదు చేసుకోవాలని సూచించినా సగంపైగా భవననిర్మాణ సంస్థలు ముందుకు రాలేదు. సుమారు రెండువేలకు పైగా రియల్ ఎస్టేట్ సంస్థల నమోదు అసంపూర్తిగా ఉంది. ఇలాంటి ప్రాజెక్టులను దారిలోకి తెచ్చేందుకు తెలంగాణ రెరా అథారిటీ కసరత్తు చేస్తోంది. సెక్షన్ 59 మేరకు చర్యలు తీసుకోడానికి సిద్ధమవుతోంది.

త్వరలో పూర్తిస్థాయి అథారిటీ

రాష్ట్రంలో పూర్తిస్థాయి రెరా అథారిటీ ఏర్పాటు కావాల్సి ఉంది. చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోపు ఏర్పాటవ్వాలి. ప్రస్తుతానికి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఛైర్మన్‌గా; గ్రామీణ, పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టర్ (డీటీసీపీ) విద్యాధర్ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆగస్టు 30 నాటికి ఏడాది పూర్తి కానున్న నేపథ్యంలో పూర్తిస్థాయి అథారిటీ ఏర్పాటు దిశగా ప్రభుత్వం దృష్టి సారించనుంది. అలాగే అప్పిలేట్ ట్రైబ్యునల్ కూడా ఏర్పాటు కావాలి. రెరా ఇచ్చే తీర్పులపై అభ్యంతరం ఉంటే ఈ ట్రైబ్యునల్‌కు నివేదించుకోవచ్చు. అన్ని రాష్ట్రాల్లో మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని ఆగస్టు రెండో వారంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో డీటీసీపీ విద్యాధర్ సారథ్యంలో ట్రైబ్యునల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

మహారాష్ట్రలో ౯౦ శాతంపైగా కొనుగోలుదారులకు అనుకూలంగా తీర్పులు

మహారాష్ట్ర.. దేశంలోనే రెరా అమల్లో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. పకడ్బందీగా వెబ్‌సైట్ రూపొందించి పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 22,195 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు నమోదు చేసుకున్నాయి. ఈ చట్టం అమల్లోకి తెచ్చినప్పటి నుంచి స్థిరాస్తి సంస్థలు, కొనుగోలుదారుల మధ్య 8,523 వివాదాలు రాగా 63 శాతం మేర పరిష్కారమయ్యాయి. 90 శాతంపైగా వివాదాల్లో కొనుగోలుదారులకు అనుకూలంగా తీర్పులు వచ్చాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రైవేటు నిర్మాణ సంస్థలే కాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన హౌసింగ్‌బోర్డు చేపట్టే ప్రాజెక్టుల్ని కూడా చేర్చారు.

అక్రమ పట్టాల వ్యవహారం తేల్చాల్సిందే

- మహాముత్తారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల బైఠాయింపు

మహాముత్తారం, న్యూస్‌టుడే: అక్రమ పట్టాల వ్యవహారంతో తమకు జరుగుతున్న అన్యాయంపై రైతులు ఆందోళనకు దిగారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాదారం గ్రామానికి చెందిన అన్నదాతలు సోమవారం మూడు కిలోమీటర్ల మేర దౌత్‌పల్లి నుంచి మహాముత్తారం తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. కొర్లకుంట, జీలపల్లి గ్రామాల రైతులూ తరలివచ్చారు. రెవెన్యూ అధికారులకు లంచాలు ఇవ్వలేమంటూ నిరసనగా యామన్‌పల్లిలో వీరు భిక్షాటన చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మాదారం గ్రామస్థులు విలేకర్లతో మాట్లాడారు. '2014 నుంచి మాదారంలోని 91 సర్వే నంబరులో స్థానికులు కాని కాటారం మండలానికి చెందిన వారికి 150 ఎకరాల మేర అక్రమ పట్టాలున్నాయి. ఇటీవల జరిగిన భూ రికార్డుల ప్రక్షాళనలో అనర్హులను తొలగించాలని వినతిపత్రాలు అందజేశాం. అయినా అనర్హులకు పట్టాలు ఇచ్చారు. దొడ్డిదారిన భూమిలేని అనర్హులు రైతుబంధు, బ్యాంకు రుణాలు పొందుతుంటే అన్ని హక్కు పత్రాలున్న మేము పాసుపుస్తకాలు అందక పథకాలకు అనర్హులుగా మిగిలిపోయాం.' అని రైతులు పేర్కొన్నారు. పోలీసులు నచ్చజెప్పడంతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట అన్నదాతల ఆందోళన

ఛాటింగ్ అన్నారు.. చాటింపేశారు!

- యువతులతో గడపవచ్చంటూ ప్యాకేజీల మోసం
- లవ్ ఆర్ట్ డేటింగ్ వెబ్‌సైట్‌తో రూ.కోట్లలో వసూళ్లు

ఈనాడు, హైదరాబాద్: "అందమైన అమ్మాయిలతో మాట్లాడండి... డేటింగ్‌కు ఇష్టపడే వారితో గడపండి. నెల.. మూడు నెలలు.. సంవత్సరం.. ప్యాకేజీలున్నాయి' ' అంటూ కోల్‌కతా కేంద్రంగా రూ.కోట్లు కొల్లగొడుతున్న ముగ్గురు సైబర్ నేరస్థులు సోమా సర్కార్, అంబాసుర్, ఇమ్రాన్‌లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. 'లవ్ ఆర్ట్ డేటింగ్' వెబ్‌సైట్ పేరుతో రెండేళ్ల నుంచి దేశవ్యాప్తంగా వీరు యువకులను ఆకర్షించి రూ. 8 కోట్లు కొల్లగొట్టారని అదనపు డీసీపీ కె.సి.ఎస్.రఘువీర్ సోమవారం తెలిపారు. వీరితో పాటు కాల్‌సెంటర్‌లో పని చేస్తున్న 20 మంది యువతులను అరెస్ట్ చేశారు. కోల్‌కతాకు చెందిన సోమా సర్కార్ రెండేళ్ల కిందట ఒక కాల్ సెంటర్ ఏర్పాటుచేసింది. అంబాసుర్, ఇమ్రాన్‌లను మేనేజర్లుగా, ఇరవైమంది యువతులను టెలీకాలర్లుగా నియమించుకుంది. నష్టాలు రావడంతో పంథా మార్చేసి డేటింగ్ సైట్‌ను ప్రారంభించింది. రిజిస్ట్రేషన్ రుసుం రూ. 1,025, ప్యాకేజీల ఆధారంగా గరిష్ఠంగా రూ. 18,000 వరకు చెల్లించాలి. మాటల వరకు చాలంటే రోజుకు ఒక సారి ఒక యువతి గంటసేపు మాట్లాడుతుంది. డేటింగ్‌కు రావాలంటే సభ్యులు ఏ నగరంలో ఉంటే.. ఆ నగరంలోనే యువతులు వస్తారని చెబుతుంది. యువతుల ఫొటోలు, వారి వివరాలు ఉండడంతో వందలమంది యువకులు సభ్యత్వ రుసుం చెల్లించారు. సోమా కాల్‌సెంటర్‌లో పని చేసే యువతులే వారితో మాట్లాడేవారు.

ప్రధాన నిందితురాలు సోమా సర్కార్, సహ నిందితులు ఇమ్రాన్, అంబాసుర్

బాధితుల ఫొటోలు డేటింగ్ వెబ్‌సైట్‌లో

సభ్యత్వ రుసుం చెల్లించిన యువకులు డేటింగ్ కోసం ఎదురుచూస్తున్నాం.. అని చెప్పగానే వారి ఫొటోలు, ఫోన్ నంబర్లు, చిరునామాలను సేకరించేవారు. అనంతరం వాటిని ఇతర డేటింగ్ సైట్లలో ఉంచేవారు. తర్వాత వారికి ఫోన్ చేసి 'మీ ఫొటోలు ఫలానా వెబ్‌సైట్లలో ఉన్నాయి. మీరు అనైతిక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని కోల్‌కతాలో మీపై కేసులు నమోదవుతున్నాయి.. పోలీసులు అరెస్ట్ చేయకుండా ఉండాలంటే కొంత సొమ్ము చెల్లించాలంటూ' బాధితులను బెదిరించి డబ్బు వసూలు చేసేవారు. ఇలా సోమా సర్కార్ చేతిలో మోసపోయిన ఇద్దరు బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వారిపై దృష్టి పెట్టారు. ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు తన బృందంతో కలిసి కోల్‌కతాకు వెళ్లి ఆదివారం వారిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకువచ్చి జైలుకు తరలించారు.

పోషణ్ అభియాన్‌కు రాష్ట్ర కమిటీ ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: పోషకాహార కార్యక్రమం (పోషణ్ అభియాన్) కింద రాష్ట్రస్థాయిలో ప్రాజెక్టులు మంజూరు చేసేందుకు కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.జగదీశ్వర్ ఉత్తర్వులు జారీచేశారు. కమిటీకి అధ్యక్షులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులుగా మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి వ్యవహరిస్తారు. సభ్యులుగా కేంద్ర మహిళా, శిశు సంక్షేమంతో పాటు వైద్య ఆరోగ్య, గిరిజన సంక్షేమ శాఖలు; ఎన్ఐఎన్, యునిసెఫ్ ప్రతినిధులుంటారు. సమన్వయకర్త బాధ్యతలను రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కమిషనర్ వహిస్తారు.

కలెక్టర్ల కాళేశ్వరం సందర్శన రేపు

నేడు వరంగల్‌లో బస

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ జిల్లాల కలెక్టర్లు బుధవారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. మంగళవారం వారు వరంగల్ చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాజెక్టును పరిశీలిస్తారు. ఇటీవల సమావేశం సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించాలని సీఎం కేసీఆర్ కలెక్టర్లకు సూచించారు. ఇందుకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రాజెక్టును సందర్శించాలని భావిస్తున్నారు. సమయం కుదిరితే ఆయన బుధవారం ప్రాజెక్టు వద్దకు హెలికాప్టర్‌లో వెళ్లి కలెక్టర్లతో సమావేశమయ్యే అవకాశం ఉంది.

తెరాసలో బీసీలకు న్యాయం చేయాలి

తెరాసలోని బీసీ నేతలకు న్యాయం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. జనాభాలో సగభాగంగా ఉన్న బీసీ వర్గాలకుచెందిన వారికి పదవుల్లో పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీసీ సంఘాల నేతలు గణేశాచారి, దుర్గయ్య, యాదగిరి, శ్యామ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో బీసీలు కీలకపాత్ర పోషించారని, వారికి తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు.

నేడు డీపీవోల సమావేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 312 పోస్టులను మంజూరు చేసింది. వీటి భర్తీకి ప్రస్తుతమున్న అధికారుల్లో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని ఆదేశించింది. ఈ మేరకు చర్యలను వేగవంతం చేసిన పంచాయతీరాజ్ శాఖ జిల్లాల పంచాయతీ అధికారుల (డీపీవో)తో మంగళవారం సమావేశం కానుంది. హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి జిల్లా పంచాయతీల అధికారులు ఉద్యోగుల సీనియారిటీ జాబితాలు, సర్వీసు వివరాలు సహా ఈ-పంచాయత్ రిపోర్టులను తీసుకురావాలని సూచించింది.

బ్రహ్మోత్సవాల్లో దాతలకు ప్రత్యేక దర్శనాలు రద్దు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా దాతలకు ప్రత్యేక దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తితిదే సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. తితిదేకు చెందిన వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు అందించిన దాతలకు కల్పించే ప్రత్యేక దర్శనాలతో పాటు గదుల కేటాయింపు సౌకర్యాన్ని సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 10 వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొంది.

జల విద్యుత్ ప్రాజెక్టుపై మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయండి

హైకోర్టులో ఏపీ జెన్‌కో పిటిషన్

ఈనాడు, అమరావతి: పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు (పీహెచ్‌ఈపీ) ఏర్పాటు విషయంలో నవయుగ ఇంజినీరింగ్ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేస్తూ తాము జారీ చేసిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని అభ్యర్థిస్తూ ఏపీ జెన్‌కో హైకోర్టులో అనుబంధ పిటిషన్ వేసింది. నవయుగ సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యానికి విచారణార్హత లేదని పేర్కొంది. పీహెచ్‌ఈపీ విషయంలో బ్యాంకు హామీదారుల అంశంపై మధ్యవర్తిత్వ క్లాజును అనుసరించి నవయుగ సంస్థ.. దిగువ కోర్టును ఆశ్రయించిందని గుర్తు చేసింది. తాము జారీచేసిన ఒప్పంద రద్దు ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించిందని అభ్యంతరం తెలిపింది. హైకోర్టులో మంగళవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.

బెయిలు స్కాంలో మాజీ న్యాయమూర్తి సాక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసులో నిందితుడైన గాలి జనార్దన్‌రెడ్డికి బెయిలు మంజూరుకు జరిగిన ప్రయత్నాలపై ఏసీబీ నమోదుచేసిన కేసులో సాక్షిగా సీబీఐ కోర్టు మాజీ న్యాయమూర్తి బి.నాగమారుతీ శర్మ సోమవారం ఏసీబీ కోర్టు ముందు హాజరయ్యారు. గాలి జనార్దన్‌రెడ్డి బెయిలు వ్యవహారానికి సంబంధించి ఏసీబీ రెండు కేసులు నమోదుచేసింది. గాలి జనార్దన్‌రెడ్డికి బెయిలు కోసం రెండు వర్గాలు ప్రయత్నాలు జరిపాయి. జిల్లా కోర్టుల జడ్జీల స్థాయిలో జరిగిన సంప్రదింపులు, ప్రయత్నాలపై డి. ప్రభాకర్‌రావు, రవి సూర్యప్రకాశ్‌బాబు, కె.లక్ష్మీనరసింహారావు, జి.దశరథరామిరెడ్డి, గాలి సోమశేఖర్‌రెడ్డి, సురేశ్‌బాబు, గాలి జనార్దన్‌రెడ్డిలపై ఓ కేసు నమోదైంది. బెయిలు మంజూరు వ్యవహారంలో తాళ్లూరి పట్టాభిరామారావు, గాలి జనార్దన్‌రెడ్డి, గాలి సోమశేఖర్‌రెడ్డి, జి. దశరథరామిరెడ్డి, టి. హెచ్.సురేశ్‌బాబు, టి.ఆదిత్య, టి. రవిచంద్ర, టి.వి.చలపతిరావు, రౌడీషీటర్ యాదగిరి రావు, గాలి జనార్దన్‌రెడ్డిలను నిందితులుగా పేర్కొన్నారు. ఈ కేసులు 2012లో నమోదుకాగా ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే పలువురి వాంగ్మూలాలను నమోదుచేసిన ఏసీబీ కోర్టు సోమవారం బెయిలుకు జరిగిన ప్రయత్నాలపై నమోదైన కేసులో 4వ సాక్షిగా ఉన్న నాగమారుతీ శర్మ వాంగ్మూలాన్ని నమోదుచేసింది. అప్పటి హైకోర్టు రిజిస్ట్రార్‌గా ఉన్న లక్ష్మీనరసింహారావు తనను కలవాలని కోరడంతో తాను వెళ్లి కలిసినట్లు నాగమారుతీ శర్మ వెల్లడించినట్లు సమాచారం. గాలి జనార్దన్‌రెడ్డికి బెయిలు మంజూరుచేస్తే ఆయన అనుచరులు రూ.40 కోట్లు ఇస్తామంటున్నారని తనతో ప్రస్తావించారన్నారు. దీనికి నిరాకరించినట్లుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఈ వాంగ్మూలంపై నిందితుల తరఫు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామిన్ చేయనున్నారు. మరో కేసులో సోమవారం 84వ సాక్షి వాంగ్మూలాన్ని నమోదుచేయగా, మరో ఇద్దరు సాక్షులను వాంగ్మూలం ఇవ్వడానికి సెప్టెంబరు 12న హాజరుకావాలని సమన్లు జారీచేసింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న గాలితో సహా పలువురు కోర్టు ముందు హాజరయ్యారు.

మైనింగ్ అక్రమార్కులకు ప్రభుత్వం వత్తాసు

- కేంద్ర గనుల మంత్రికి ఎంపీ బండి సంజయ్ ఫిర్యాదు

ఈనాడు, హైదరాబాద్: అక్రమ మైనింగ్ వ్యాపారులకు తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తూ, కేంద్ర చట్టాన్ని ధిక్కరిస్తోందని.. మైనింగ్ సంస్థల అక్రమాల్ని అధికారులు నిర్ధారించినా చర్యలు తీసుకోవట్లేదని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర గనుల మంత్రి ప్రహ్లాద్ జోషికి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన గనుల వ్యాపారులపై చర్యలు తీసుకోవడంతోపాటు వారి నుంచి రావల్సిన మొత్తాన్ని రాబట్టాలని.. 2008 నుంచి ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. సోమవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో వందల క్వారీల నుంచి అనుమతుల్లేకుండా పరిమితికి మించిన గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్నారని..ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తెరాస మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల తమ జేబులు నింపుకొంటున్నారని ఆయన ఆరోపించారు. "2008-11 మధ్య కరీంనగర్ జిల్లాలోని 8 మైనింగ్ ఏజెన్సీల అక్రమాల్ని అధికారులు నిర్ధారించారు. రైళ్లు, కాకినాడ పోర్టు నుంచి చైనాకు గ్రానైట్‌ను ఎగుమతి చేశారు. దాన్ని గుర్తించి రూ.124.94 కోట్ల సీనరేజ్ ఫీజు.. దానిపై ఐదింతల పెనాల్టీ రూ.624.73 కోట్లు కలిపి రూ.749.66 కోట్లు కట్టాలని మైనింగ్ శాఖ 2016లో డిమాండ్ నోటీస్‌లిచ్చింది. ఇప్పటివరకు ఏ ఒక్కరూ ఆ డబ్బు కట్టలేదు. ఈ క్రమంలో అప్పట్లో గనులశాఖ మంత్రిని ఆ శాఖ నుంచి తప్పించారు. ఈ వ్యవహారంలో రూ.కోట్లు చేతులు మారాయి. మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా పెనాల్టీని 4 రెట్లు తగ్గించి ఆ సంస్థలకు లబ్ధి కలిగించారు. చెక్ పోస్టులనూ ఎత్తేశారు" అని సంజయ్ ఆరోపించారు. ఈ అక్రమాలపై రాష్ట్ర గవర్నర్, ప్రధానిని కలిసి విజ్ఞప్తి చేస్తామని.. సీబీఐ, ఈడీ సంస్థలతో విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

రెండు

మనిషిని మనిషిగా నిలబెట్టేదీ, నడిపించేదీ జ్ఞాపకమే! పుట్టినప్పట్నుంచీ.. ఆ మాటకొస్తే తల్లి కడుపులో పడ్డప్పట్నుంచే ప్రతి కదలికా, ప్రతి ఆలోచనా ప్రతి అనుభవమూ, ప్రతి సందర్భమూ ఒక్కో జ్ఞాపకంగా మారుతూ.. మెదడు పొరల్లో నిక్షిప్తమవుతూ.. అవసరమైనప్పుడు వెలికి వస్తూ.. జీవనచక్రాన్ని ముందుకు దూకిస్తుంది! అలాంటి జ్ఞాపకాలన్నీ ఒక్కొక్కటిగా తుడిచిపెట్టుకుపోతుంటే? కన్నవారిని, కట్టుకున్నవారినీ పోల్చుకోలేకపోతే? చివరికి తానెవరో, ఎక్కడున్నానో కూడా తెలుసుకోలేకపోతే? డిమెన్షియా మనిషిని ఇలాంటి దుర్భర స్థితిలోకే నెడుతుంది. కాబట్టే డిమెన్షియా అంటేనే ప్రపంచం ఉలిక్కిపడుతోంది. వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్న నేపథ్యంలో మరింత కలవరపడుతోంది.

రాలిపోయే జ్ఞాపకమా!



ప్రస్తుతం మనం విచిత్రమైన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాం. ఒకవైపు మన ఆయుష్షు పెరుగుతోందని సంతోషిస్తున్నాం. మరోవైపు వయసుతో పాటు వచ్చే, జీవనశైలితో ముడిపడిన సమస్యలు ముంచుకొస్తున్నాయని విచారిస్తున్నాం. రోజురోజుకీ జ్ఞాపకాలను ఒక్కొక్కటిగా రాల్చేస్తూ.. చివరికి చెట్టంత మనిషిని మోడు చేసే డిమెన్షియా ఇలాంటి సమస్యే. మనదేశంలో సుమారు 41 లక్షల మంది దీంతో సతమతమవుతుండగా.. 2035 నాటికి వీరి సంఖ్య రెట్టింపు కావొచ్చని భావిస్తున్నారు. ఇది ఆయా వ్యక్తులకే కాదు. కుటుంబానికీ, సమాజానికీ చిక్కులు తెచ్చిపెడుతుంది. ఒక్కసారి దీని బారినపడితే బయటపడటం కష్టం. ఒకటీ అరా మందులున్నా పూర్తిగా నయం కావటమనేది అసాధ్యం. అలాగని నిరుత్సాహ పడాల్సిన పనిలేదు. జీవనశైలి మార్పులతో, మందులతో, తగు జాగ్రత్తలతో నియంత్రణలో ఉంచుకునే అవకాశముంది. కాబట్టి డిమెన్షియా, దాని పరిణామాల గురించి తెలుసుకోవటం ఎంతైనా అవసరం.

డా॥ జి.వి.సుబ్బయ్య చౌదరి
న్యూరాలజిస్ట్
స్టార్ హాస్పిటల్స్
బంజారాహిల్స్
హైదరాబాద్

మామూలు మతిమరుపు కాదు

'నేను కళ్లజోడు, బండితాళాలు ఎక్కడ పెట్టానో గుర్తుకురావటం లేదు. నాకు డిమెన్షియా వచ్చినట్టేనా?' అని చాలామంది అడుగుతుంటారు. మనం ఎప్పుడో అప్పుడు ఏదో ఒకటి మరచిపోవటం సహజమే. ఇలాంటి మామూలు మతిమరుపులో ఆయా విషయాలు ఆ వెంటనో.. గంటకో, రెండు గంటలకో తిరిగి గుర్తుకొచ్చేస్తాయి. డిమెన్షియా అలా కాదు. ఇందులో మతిమరుపుతో పాటు నిర్ణయాలు సరిగా తీసుకోలేకపోవటం, ఆలోచనా విధానం మారిపోవటం, మాటామంతీ అస్తవ్యస్తం కావటం వంటివీ వేధిస్తాయి. ఇవి దైనందిన వ్యవహారాలనూ దెబ్బతీసే స్థాయిలోనూ ఉంటాయి.

ఏంటీ కారణం?

డిమెన్షియాకు మూలం మెదడులో నాడీ కణాలు దెబ్బతినటం, క్షీణించటం. వాటి మధ్య సమాచార ప్రసరణ కొరవడటం. నాడీ కణాలు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవటానికి, జ్ఞాపకశక్తికి అసిటైల్ కోలిన్ రసాయనం తోడ్పడుతుంది. డిమెన్షియాలో దీని ఉత్పత్తి తగ్గుతుంది. మరోవైపు- టావో ప్రోటీన్, అమీలైడ్ బీటా ప్రోటీన్ మెదడులో విచ్ఛిన్నం కాకుండా అక్కడే పోగుపడి, గట్టిపడిపోతుంటాయి. ఫలితంగా నాడీకణాలు దెబ్బతింటాయి. చనిపోతుంటాయి. జ్ఞాపకాలు ఏర్పడటంలో మెదడులోని హిప్పోక్యాంపస్‌దే కీలకపాత్ర. డిమెన్షియాలో ముందుగా దెబ్బతినేది ఇదే. అందుకే మతిమరుపు ముందుగా బయటపడుతుంది.

లక్షణాలు రకరకాలు

డిమెన్షియాలో మొదట్లో కొత్త జ్ఞాపకాలు దెబ్బతింటాయి. చివర్లో పాత జ్ఞాపకాలు తుడిచిపెట్టుకుపోతాయి. మెల్లగా మొదలయ్యే మతిమరుపు రోజురోజుకీ ఎక్కువవుతూ వస్తుంది. క్రమంగా రోజువారీ పనులు చేసుకోవటం కష్టమైపోయే స్థాయికి చేరుకుంటుంది. స్నానం చేయటం, దుస్తులు వేసుకోవటం, బొత్తాలు పెట్టుకోవటం వంటి పనుల్లో ఇబ్బంది పడుతుంటారు. చివరికి ఎక్కడికి వెళ్లామో, వెళ్తున్నామో తెలియక తికమక పడిపోవచ్చు. కొత్త ప్రాంతాలు, విషయాలను గుర్తుంచుకోలేరు. అందువల్ల ఇంట్లో బాగానే తిరుగుతుంటారు గానీ ఎక్కడికైనా వెళ్తే తికమకపడిపోతారు. తెలిసిన దారులు, పేర్లు మరచిపోతుంటారు. దారి తెలియక తప్పిపోవచ్చు. గడియారం చూసి సమయాన్ని పోల్చుకోవటమూ కష్టమైపోతుంది. సమస్య తీవ్రమైతే బంధాలను, బంధుత్వాలను, కుటుంబ సభ్యులను, తమను తామూ మరచిపోవచ్చు.

ప్రధాన రకం- అల్జీమర్స్

నిజానికి డిమెన్షియా ఒక్క సమస్య కాదు. రకరకాల సమస్యల సముదాయం.

- **అల్జీమర్స్:** డిమెన్షియా బాధితుల్లో 70% మందిలో కనపడేది ఇదే. వీరి మెదడులో బీటా అమైలాయిడ్, టావో ప్రోటీన్లు గట్టిపడిపోతుంటాయి. నాడీకణాలు చనిపోతూ జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. మెదడు కుంచించుకుపోతూ దైనందిన వ్యవహారాలన్నీ కష్టమైపోతుంటాయి.
- **వ్యాస్కులర్ డిమెన్షియా:** దీనికి మూలం మెదడులో స్వల్ప స్థాయిలో పక్షవాతం (స్ట్రోక్) తలెత్తటం. దీంతో చిన్న రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడి మెదడుకు రక్తసరఫరా తగ్గుతుంది. మెదడులో తెల్ల పదార్థంలోని పోచలూ దెబ్బతినొచ్చు. వీరిలో సమస్యలను పరిష్కరించలేకపోవటం, ఆలోచనలు నెమ్మదించటం, ఏకాగ్రత తగ్గటం వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి.
- **లూవీ బాడీ డిమెన్షియా:** మెదడులో బెలూన్ల మాదిరిగా ప్రోటీన్ ముద్దలు పోగుపడటం వల్ల ఇది తలెత్తుతుంది. భ్రాంతులకు లోనవ్వటం, లేనివి ఉన్నట్టు కనపడటం, ఏకాగ్రత కొరవటం వంటివి దీని ముఖ్య లక్షణాలు.
- **ఫ్రాంటోటెంపోరల్ డిమెన్షియా:** నుదురు, కణతల వద్ద మెదడులోని నాడీ కణాలు, వాటి మధ్య అనుసంధానాలు దెబ్బతినటం దీనికి మూలం. దీంతో ప్రవర్తన, వ్యక్తిత్వం, ఆలోచన, నిర్ణయాలు తీసుకోవటం, భాష, కదలికలు అస్తవ్యస్తమవుతాయి.
- **ఇతర సమస్యలు:** హంటింగ్‌టన్స్ డిసీజ్, పార్కిన్సన్స్, మల్టిపుల్ స్క్లెరోసిస్, క్రూజ్‌ఫెల్డ్ జాకోబ్ డిసీజ్, మెదడుకు దెబ్బతగలటం వంటివీ డిమెన్షియాకు దారితీయొచ్చు. వీరిలో ఆయా జబ్బుల లక్షణాలే కాకుండా డిమెన్షియా లక్షణాలూ కనిపిస్తాయి. మెదడులో ఏ భాగం ఎక్కువగా ప్రభావితమైతే దానికి సంబంధించిన లక్షణాలు ప్రస్ఫుటంగా కనబడతాయి.

నివారణ మార్గముంది

డిమెన్షియా వయసు మీద పడుతున్నకొద్దీ తలెత్తే సమస్య. దీనికి వయసే అతిపెద్ద ముప్పు కారకం. డిమెన్షియాకు కారణమయ్యే జన్యు స్వభావం ఉంటే మరింత త్వరగానూ రావొచ్చు. వీటిని మనం మార్చలేకపోవచ్చు గానీ జీవనశైలి మార్పులతో డిమెన్షియా బారినపడకుండా కొంతవరకు కాపాడుకోవచ్చు. ఇవి డిమెన్షియా లక్షణాలు అదుపులో ఉండటానికీ తోడ్పడతాయి. అందుకే చికిత్స విషయంలోనూ వీటికి ప్రాధాన్యం ఇస్తుండటం గమనార్హం.

- **వ్యాయామం:** క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే మధుమేహం, ఊబకాయం, అధిక రక్తపోటు తగ్గుతాయి. ఇవి గుండెకే కాదు, మెదడు ఆరోగ్యానికీ ఎంతగానో మేలు చేస్తాయి.
- **మంచి ఆహారం:** కూరగాయలు, పండ్లు, గింజపప్పులు ఎక్కువగా.. కొవ్వులు, ఉప్పు తక్కువగా తీసుకోవాలి.
- **కుంగుబాటుకు దూరం:** కుంగుబాటు డిమెన్షియాకు దారితీయొచ్చు. అందువల్ల కుంగుబాటు లక్షణాలను గుర్తించి ముందుగానే జాగ్రత్త పడటం మంచిది.
- **మద్యం పరిమితం:** మద్యం తాగకపోవటం ఉత్తమం. ఒకవేళ అలాంటి అలవాటుంటే పరిమితం చేసుకోవాలి.
- **పొగ మానెయ్యాలి:** పొగ అలవాటుంటే వెంటనే మానెయ్యాలి.
- **విటమిన్లు:** విటమిన్ బి12, విటమిన్ బి6 తగ్గకుండా చూసుకోవాలి.
- **మెదడు చురుకు:** మెదడును చురుకుగా ఉంచే చదరంగం వంటి ఆటలు ఆడటం, పదకేళీలు పూరించటం వంటివి చేయాలి. ఇవి నాడీకణాల మధ్య అనుసంధానాలు ఏర్పడటానికి దోహదం చేస్తాయి.
- **నలుగురితో కలివిడిగా:** ఒంటరితనం కుంగుబాటుకు, విచారానికి దారితీస్తుంది. ఇది డిమెన్షియా ముప్పు పెరిగేలా చేస్తుంది. అందువల్ల నలుగురితో కలివిడిగా ఉండటం మంచిది. తరచుగా బంధువుల ఇంటికి వెళ్లాలి. వాళ్లని మన ఇంటికి రమ్మనాలి. స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనాలి. వీలైతే క్లబ్బుల్లో చేరొచ్చు.

డిమెన్షియాను పోలినవీ..

కొన్ని సమస్యల్లోనూ మతిమరుపు వంటి లక్షణాలు ఉండొచ్చు. ముఖ్యంగా కుంగుబాటు(డిప్రెషన్)తో బాధపడేవారు ఆయా విషయాలపై సరిగా దృష్టి పెట్టకపోవటం వల్ల గుర్తుండకపోవచ్చు (సూడో డిమెన్షియా). ఇన్‌ఫెక్షన్లు, థైరాయిడ్ సమస్యలు, మెదడుకు దెబ్బతగలటం, మెదడులో కణితులు, మెదడు పొరల్లో వాపు, సోడియం, క్యాల్షియం వంటి లవణాలు, ఖనిజాలు.. విటమిన్ బి12 మోతాదులు తగ్గటం, కొన్నిరకాల మందుల దుష్ప్రభావాలు, సీసం వంటి భార లోహాల విష ప్రభావాలు, మెదడుకు తగినంత ఆక్సిజన్ సరఫరా కాకపోవటం వంటివీ తాత్కాలికంగా డిమెన్షియాకు దారితీయొచ్చు. ఆయా సమస్యలకు చికిత్స తీసుకుంటే ఇదీ కుదురుకుంటుంది.

నిర్ధారణ ఎలా?

- **న్యూరోకాగ్నిటివ్ పరీక్ష:** ఇందులో బొమ్మలను గుర్తించటం, ఆకారాలను కలపటం వంటి పద్ధతులతో మానసిక స్థితిని అంచనా వేస్తారు. సమస్య ఏ దశలో ఉందో కూడా బయటపడుతుంది.
- **రక్తపరీక్ష:** ఇందులో సోడియం వంటి లవణాల మోతాదులు తెలుస్తాయి. థైరాయిడ్ హార్మోన్, విటమిన్ బి12 మోతాదులు బయటపడతాయి.
- **సీటీ స్కాన్, ఎంఆర్ఐ:** డిమెన్షియానా? ఇతరత్రా సమస్యలేవైనా? ఉన్నాయా అనేది తెలుసుకోవటానికివి తోడ్పడతాయి. పెట్ స్కాన్ కూడా చేయొచ్చు.

చికిత్స

డిమెన్షియాకు ప్రత్యేకించి రెండు రకాల మందులు ఉపయోగపడతాయి. సమస్య మామూలుగా (మైల్డ్) ఉంటే డోనెపెజిల్, గ్లాటిరమర్ అసిటేట్, రివాస్టిజమైన్ వంటి కొలినెస్టరేజ్ ఇన్‌హిబిటార్స్ ఇస్తారు. తీవ్రత ఒక మాదిరిగా (మోడరేట్) ఉంటే వీటితో పాటు మెమాంటిన్ మందూ ఇవ్వాల్సి ఉంటుంది. ఇది మెదడు దెబ్బతినకుండా కాపాడుతుంది. సమస్య తీవ్రంగా ఉన్నవారికీ మెమాంటిన్ ఉపయోగపడుతుంది. అవసరమైతే కొలినెస్టిన్ ఇన్‌హిబిటార్స్ ఇవ్వచ్చు.

కనిపెట్టుకునేవారూ కీలకమే

డిమెన్షియా తీవ్రమైనప్పుడు నిద్ర పట్టకపోవటం, ఆగ్రహంతో ఊగిపోవటం, స్తబ్ధుగా ఉండిపోవటం, భ్రాంతులకు లోనవటం, అనుమానించటం, లేనిపోనివి ఊహించుకోవటం, తిట్టటం, కొట్టటం చేయొచ్చు. తామేం చేస్తున్నామో తెలియక ఇంట్లోంచి పారిపోనూ వచ్చు. రుచి, వాసన తగ్గటం వల్ల సరిగా తినకపోవచ్చు. అందువల్ల వీరిని కనిపెట్టుకునేవారికీ అవగాహన ఉండాలి. ఎప్పుడెలా నడచుకోవాలో తెలుసుకోవటం ముఖ్యం.

- సరిగా నిద్రపోవటం లేదనుకోండి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయించటం, పగటిపూట ఆరుబయట తిప్పటం, ఒంటికి ఎండతగిలేలా చేయటం, పగటిపూట నిద్ర పోకుండా చూసుకోవటం ద్వారా రాత్రుళ్లు బాగా నిద్రపోయేలా చూసుకోవచ్చు. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలి. టీవీ సౌండ్లు తక్కువగా పెట్టాలి.
- మూడ్‌ను బట్టి ప్రవర్తించాలి. కోపగించుకుంటున్నా, తిడుతున్నా దృష్టిని మళ్లించే ప్రయత్నం చేయాలి. వారు చెప్పేది వింటూ నిదానంగా, మనసుకు నచ్చేలా మాట్లాడాలి.
- బలమైన, రుచికరమైన ఆహారం ఇవ్వాలి. లేకపోతే రోగనిరోధకశక్తి తగ్గి ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశముంది. మంచి మూడ్‌లో ఉన్నప్పుడు ఆహారం ఇవ్వటం, తక్కువ తక్కువగా ఎక్కువసార్లు తినేలా చూసుకోవాలి. రుచికోసం సాస్‌ల వంటివి కలిపి ఇవ్వటం మేలు.
- కొత్త ప్రాంతాలకు తీసుకెళ్లినపుడు జాగ్రత్తగా ఉండాలి. కొందరు ఇప్పుడే వస్తానంటూ దూరంగా వెళ్లటానికి ప్రయత్నిస్తుంటారు. వీరు వచ్చిన దారి తెలియక తప్పిపోయే ప్రమాదముంది. వేరే వాళ్ల ఇంటికి వెళ్లినపుడు బాత్రూమ్ ఎక్కడుందో తెలియక తికమకపడొచ్చు. అందువల్ల వెంట ఉండి కనిపెట్టుకోవాలి.
- రాత్రిపూట ఇంట్లో తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి. మూత్ర విసర్జన వంటి వాటికి లేచినప్పుడు సరిగా కనబడకపోతే పడిపోయే ప్రమాదముంది. తివాచీలు పాదాలకు అడ్డుపడి పడిపోవచ్చు. ఇలాంటివి వాడకపోవటం మంచిది. నేల మరీ నున్నగా, పాదం జారిపోయేలా కాకుండా కాస్త గరుకుగా పాదాలకు దన్నుగా ఉండేలా చూసుకోవాలి. బాత్రూమ్‌లో పట్టుకోవటానికి వీలుగా పట్టీలు బిగించాలి.
- డిమెన్షియా బాధితులను కనిపెట్టుకునేవారు మధ్యమధ్యలో విరామం తీసుకోవటం మంచిది. ఎప్పుడూ ఒక్కరే చూసుకుంటుంటే శ్రద్ధ తగ్గిపోవచ్చు. కుంగుబాటుకూ లోనవ్వచ్చు. వీలైనప్పుడల్లా ఇతరులకు చూసుకోమని చెప్పటం, డిమెన్షియా బాధితుల బాగోగులను చూసుకునే బృందాలతో కలిసి పనిచేయటం మేలు.

సమస్య - సలహా

వెంటనే కీమోథెరపీ తీసుకోవాల్సిందేనా?

సమస్య: మా సోదరికి రొమ్ముక్యాన్సర్. ఒక రొమ్ము తొలగించారు. బయాప్సీలో క్యాన్సర్ రెండో దశలో ఉన్నట్టు తేలింది. కీమోథెరపీ తీసుకోవాలని డాక్టర్ చెప్పారు. మరో రెండు నెలల్లో మా సోదరి కుమారుడి పెళ్లి ఉంది. అందుకని కీమోథెరపీ వద్దంటోంది. వెంటనే కీమో తీసుకోకపోతే ఏవైనా ఇబ్బందా? ప్రత్యామ్నాయ మార్గాలేవైనా ఉన్నాయా?

– హర్షిత (ఈమెయిల్ ద్వారా)

సలహా: కీమోథెరపీ అనగానే అందరికీ ప్రధానంగా జట్టు ఊడిపోవటమే గుర్తుకొస్తుంటుంది. చాలామంది దీన్ని తలచుకొని బాధపడుతుంటారు, భయపడుతుంటారు. మీ సోదరి కూడా ఇలాగే కీమోథెరపీని వాయిదా వేసుకోవాలని అనుకుంటున్నట్టు తోస్తోంది. కీమోథెరపీ మందులు ఒంట్లో అతి వేగంగా వృద్ధి చెందే కణాలను నిర్వీర్యం చేస్తాయి. ఈ క్రమంలో శరీరంలోని అన్ని భాగాలపైనా ప్రభావం చూపుతాయి. ఇవి క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయటంతో పాటు మామూలు కణాలనూ దెబ్బతీస్తాయి. వెంట్రుకల కుదుళ్లు దెబ్బతింటే జుట్టు ఊడిపోతుంటుంది. అలాగని అన్ని కీమోథెరపీ మందులు అదే స్థాయిలో ప్రభావం చూపుతాయని అనుకోవద్దు. ముందుగా మీ సోదరికి ఈఆర్ పీఆర్ హెచ్‌ఇఆర్2 పరీక్ష చేయించటం మంచిది. కణితిలో ఈస్ట్రోజెన్ హార్మోన్ గ్రాహకాలు (ఈఆర్), ప్రొజెస్టిరాన్ హార్మోన్ గ్రాహకాలు (పీఆర్)..

> ఇప్పుడు జుట్టు అంతగా ఊడిపోకుండా చూసే కీమో మందులూ ఉన్నాయి. పెగిలేటెడ్ లైపోసోమల్ డాక్సోరుబిసిన్(తో పెద్దగా జుట్టేమీ ఊడిపోదు.

హ్యూమన్ ఎపిడెర్మల్ గ్రోత్ ఫ్యాక్టర్ రిసెప్టర్ 2 (హెచ్‌ఈఆర్2) వివరాలు ఇందులో తేలుతాయి. రొమ్ముక్యాన్సర్లలో సుమారు 80% ఈఆర్ పాజిటివ్, 65% పీఆర్ పాజిటివ్ ఉంటాయి. దాదాపు 20% హెచ్‌ఇఆర్2 పాజిటివ్‌గా ఉంటాయి. ఈఆర్/పీఆర్ నెగెటివ్ కణితులతో పోలిస్తే పాజిటివ్ కణితులు హార్మోన్ చికిత్సకు బాగా స్పందిస్తాయి. మీ సోదరికి ఈఆర్ 80%, పీఆర్ 80% పాజిటివ్‌గా.. హెచ్‌ఇఆర్2 నెగెటివ్‌గా.. క్యాన్సర్ కణాల వ్యాప్తి, వృద్ధిని సూచించే కెఐ-67 ప్రోటీన్ మోతాదులు తక్కువగా ఉంటే నేరుగా హార్మోన్ చికిత్స తీసుకోవచ్చు. హెచ్‌ఇఆర్2 పాజిటివ్‌గా ఉంటే హర్‌సెప్టిన్ మందు ఉపయోగపడుతుంది. దీంతో కీమోథెరపీని కొంతకాలం వాయిదా వేసుకోవచ్చు. ఒకవేళ కీమో అవసరమైనా ఇప్పుడు జుట్టు అంతగా ఊడిపోకుండా చూసే మందులూ అందుబాటులో ఉన్నాయి. పెగిలేటెడ్ లైపోసోమల్ డాక్సోరుబిసిన్ మందుతో పెద్దగా జుట్టేమీ ఊడిపోదు. ఆ తర్వాత అవసరమైతే ఇతరత్రా మందులతో మిగతా మోతాదుల కీమోథెరపీ తీసుకోవచ్చు.

–డా॥ సింహాద్రి చంద్రశేఖర రావు
సర్జికల్ ఆంకాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను, సందేహాలను పంపాల్సిన చిరునామా

సమస్య – సలహా సుఖీభవ ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in

99895 27715
1 ఫోన్‌కాల్‌తో 3 సమస్యలకు పరిష్కారం
వైద్యరంగంలో విశేష సేవలతో అగ్రపథాన దూసుకెళ్తున్న
ఎవిస్ హాస్పిటల్స్ (హైదరాబాద్)
అందించే అద్భుత వైద్య చికిత్సలతో ఆరోగ్యాన్ని పొందండి
కాళ్లలో సరాలవాపు
వెరికోస్ వెయిన్స్
▼ ఎటువంటి కుట్లు, కోతలు, మత్తుమందు, రక్తస్రావం లేని లేజర్ చికిత్స
▼ హైదరాబాద్, బెంగుళూరు ఆసుపత్రులలో రూ.3,600/- విలువైన స్కానింగ్ పరీక్ష ఉచితం.
▼ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనుమతి పొందినవారికి సర్జరీ.
▼ అన్ని ఇన్సూరెన్స్‌లపై అవగాహన కల్పించబడును.
బోదకాలు చికిత్స (లింఫెడియా)
▼ బోదకాలు బాధితులకు పూర్తి స్థాయిలో చికిత్స
▼ పుండ్ల సంరక్షణ కేంద్రం ద్వారా పుండ్లు పూర్తిగా తగ్గేవరకు బాధ్యత తీసుకోబడును
గడ్డలు/కణితులు (ఫైబ్రాయిడ్స్) వల్ల గర్భసంచి తొలగింపులేని చికిత్స.
Picture of Uterine Fibroids
✦ మహిళల గర్భసంచిలో పెరిగే గడ్డలు, కణితులు (ఫైబ్రాయిడ్స్) కారణంగా 99% వరకు గర్భసంచి తొలగింపులేని ఆధునిక చికిత్స ఎవిస్ ప్రత్యేకత.
✦ ఎటువంటి కుట్లు, కోతలు, మత్తుమందులు, రక్తస్రావం ఉండదు.
✦ ఒకే రోజులో డిస్చార్జి
డా॥ రాజా. వి. కొప్పాల M.D., FRCR (England) Fellow in Interventional Radiology (USA) M.D., AVIS Hospitals, Hyderabad.
ఎవిస్ హాస్పిటల్స్
జూబ్లీహిల్స్ రోడ్ నెం.1, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రక్కన, హైదరాబాద్. ఫోన్: 040-22 22 77 99
HYDERABAD - BENGALURU - VIJAYAWADA - GUNTUR - VIZAG

కాళ్లు, చేతుల వాపా?

కాళ్లు, చేతుల వాపు అనగానే రక్తనాళాల సమస్యలే గుర్తుకొస్తాయి. ఇవే కాదు, లింఫ్‌నాళాల వ్యవస్థలో తలెత్తే అడ్డంకులు సైతం వాపులకు దారితీయొచ్చు. దీన్నే లింఫెడిమా అంటారు. ఇది అరుదుగా కనపడే సమస్యే అయినా వచ్చిందంటే బాగా ఇబ్బంది పెడుతుంది. మన ఆరోగ్యంలో లింఫ్ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుంది. రోగనిరోధక వ్యవస్థలో భాగమైన లింఫ్‌నాళాలు ప్రొటీన్‌తో నిండిన ద్రవాన్ని శరీరమంతటికీ సరఫరా చేస్తుంటాయి. హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లు, వ్యర్థ పదార్థాలను గ్రహించుకొని, ఎప్పటికప్పుడు వాటిని నిర్వీర్యం చేస్తూ, బయటకు పంపించెయ్యటానికి ప్రయత్నిస్తుంటాయి. అందువల్ల లింఫ్ ద్రవం తేలికగా కదులుతూ ఉండటం అత్యవసరం. నాళాల్లో ఎక్కడైనా అడ్డంకులు తలెత్తితే ద్రవం అక్కడే నిలిచిపోయి వాపునకు దారితీస్తుంది. ప్రధానంగా కాళ్లు, చేతుల్లో వాపు కనిపిస్తుంది. కొందరికి రెండు కాళ్లు, చేతుల్లోనూ వాపు తలెత్తొచ్చు. వేళ్లూ ఉబ్బొచ్చు. ఆయా భాగాలు బరువుగా అనిపించడటం, సరిగా కదలకపోవడం, నొప్పి, అసౌకర్యం, తరచుగా ఇన్‌ఫెక్షన్లు, చర్మం మందం కావటం వంటి లక్షణాలు వేధిస్తుంటాయి. లింఫెడిమాకు రకరకాల అంశాలు దోహదం చేస్తాయి. పుట్టుకతో లింఫ్ నాళాలు సరిగా ఏర్పడకపోవటం, కొందరికి శస్త్రచికిత్సలు చేసేటప్పుడు లింఫ్ నాళాలు, లింఫ్ గ్రంథులు తొలగించటం, రేడియేషన్ చికిత్స, కణితులు, ఇన్‌ఫెక్షన్ల వంటి ఇతరత్రా కారణాలతోనూ ఇది తలెత్తొచ్చు. ప్రస్తుతం దీన్ని పూర్తిగా నయం చేసే చికిత్సలేవీ లేవు. అందువల్ల తొలిదశలోనే గుర్తించడం ముఖ్యం. తగు జాగ్రత్తలతో నియంత్రణలో ఉంచుకోవచ్చు. వాపు ఉన్న భాగాలను పైకి ఎత్తేలా చేసే వ్యాయామాలు, ఆయా భాగాలపై కట్టు కట్టటం, మర్దన, పొడవైన సాక్స్ ధరించటం వంటివి మేలు చేస్తాయి. సమస్య మరీ తీవ్రంగా ఉంటే అదనపు కణజాలాన్ని తొలగించటానికి శస్త్రచికిత్స అవసరమవుతుంది.

'పచ్చ'గా వర్ధిల్లండి!

పిల్లలు పెద్దయ్యాక సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అనుకుంటున్నారా? అయితే ఇంటి చుట్టుపక్కల చెట్లు చేమలతో కూడిన పచ్చటి వాతావరణం ఉండేలా చూసుకోండి. బాల్యంలో పచ్చటి పరిసరాల్లో పెరిగినవారు పెద్దయ్యాక మరింత సంతోషకరమైన జీవనాన్ని గడుపుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. పరిశోధకులు సుమారు 10 లక్షల డెన్మార్క్ వాసులను ఎంచుకొని, చిన్నప్పుడు వారు గడిపిన ఇళ్లను ఉపగ్రహ చిత్రాల సమాచారంతో విశ్లేషించి మరీ ఈ విషయాన్ని గుర్తించారు. పుట్టినప్పటి నుంచి 10 సంవత్సరాల వయసు వచ్చేవరకు ఎక్కువకాలం పచ్చటి పరిసరాల్లో గడిపినవారికి మానసిక జబ్బుల ముప్పు 45% వరకూ తక్కువగా ఉంటున్నట్టు తేలటం విశేషం. మానసిక జబ్బులకు కారణమయ్యే ఇతరత్రా ముప్పు కారకాలను పక్కనబెట్టి చూసినా ఈ ప్రయోజనం కనపడుతుండటం గమనార్హం.

ఈనాడు సినిమా

టాలీవుడ్ కలవరిస్తున్న పేరు... ప్రభాస్. బాలీవుడ్ సైతం ఆరా తీస్తున్న పేరు.. ప్రభాస్. భారతీయ చిత్రసీమలో, తెలుగు హీరో యిజం చాటిన నిలువెత్తు కటౌట్.. ప్రభాస్. 'బాహుబలి' తరవాత తన ఇమేజ్ రాష్ట్రాలు దాటేసి, దేశాలు చుట్టేసింది. అందుకే 'సాహో' కోసం అంత నిరీక్షణ. రెండేళ్లు ఈ సినిమా కోసం కష్ట పడ్డారు ప్రభాస్. తన క్రేజ్‌ని నమ్మి యూవీ సంస్థ ఏకంగా రూ.350 కోట్లు ఖర్చు పెట్టింది. అందుకే.. 'సాహో' దేశ వ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈనెల 30న విడుదల కాబోతున్న 'సాహో' గురించి ప్రభాస్ మనసు విప్పారు. సోమ వారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'సాహో' ముచ్చట్లు పంచు కున్నారు.

ప్రభాస్

"పెదనాన్న గారు నా విజయాల్ని చూసి పొంగిపోతున్నారు. ముంబయి, దిల్లీలాంటి చోట్లకు వెళ్తుంటే వాళ్లు 'బాహుబలి.. ప్రభాస్' అంటున్నారట. ఆ మాటలు విని ఆయన ఇంకా లావైపోతున్నారు (నవ్వుతూ). నా విజయాల్ని ఆయన బాగా ఆస్వాదిస్తున్నారు. ఆయనకు ఈతరం అభిరుచులేంటో బాగా తెలుసు. 'బిల్లా'లాంటి కథని ఆయన ఒప్పుకుంటారని నేను అనుకోలేదు. గోపీకృష్ణ సంస్థలోనే ఆ సినిమా చేశాం".

నన్నెవరైనా చూస్తారా? అని భయపడేవాణ్ని!

'సాహో' ప్రచార చిత్రాలు చూస్తుంటే హాలీవుడ్ చిత్రాలు గుర్తొస్తున్నాయి. ఈచిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లేటప్పుడు మీ ఉద్దేశాలు కూడా అవేనా?

'సాహో' పక్కాగా ఓ కమర్షియల్ సినిమా. లార్జర్ దేన్ లైఫ్‌లా ఉంటుంది. 'బాహుబలి' తరవాత ఏం చేసినా కొత్తగానే ఉండాలి. 'బాహుబలి'లో చూడండి. ఓ జలపాతాన్ని సృష్టించారు. దాన్ని ఆ స్థాయిలో చూపించాల్సిన పనిలేదు. కానీ ఆకాశమంత ఎత్తు చూపించేసరికి ప్రేక్షకులు విస్మయానికి గురయ్యారు. ఫైటింగులు, ఛేజింగులు ఇవన్నీ భారీ స్థాయిలో ఉండడానికి కారణం కూడా అదే.

'బాహుబలి' తరవాత మీ కోసం పెద్ద దర్శకులు అంతా క్యూలో నిలబడ్డారు. కానీ ఒకే ఒక్క సినిమా అనుభవం ఉన్న సుజిత్‌కి అవకాశం ఇచ్చారు. కారణమేంటి?

'రన్ రాజా రన్'తోనే సుజిత్ చాలా బాగా నచ్చాడు. తను స్క్రీన్ ప్లే బాగా చేయగలడని అర్థమైంది. అందుకే 'నాకో సినిమా చేస్తావా' అని అడిగాను. 'మంచి కథ రాశాక కలుస్తా' అన్నాడు. 'అబ్బా ఏం కాన్ఫిడెన్స్' అనిపించింది. అనుకున్నట్టే మంచి కథతో వచ్చాడు. 'సాహో'లో కొన్ని సన్నివేశాలు చాలా కీలకం. ఒక్కో సన్నివేశం మళ్లీ మళ్లీ తెరపై కనిపిస్తుంటుంది. అందులోనే రకరకాల షేడ్స్ కనిపిస్తాయి. వాటిని తెరకెక్కించడం చాలా కష్టం. వాటిని సుజిత్ సమర్థంగా తెరకెక్కించాడు.

ఈ కథ చెప్పినప్పుడు మీ పాత్రకు రిఫరెన్సులు ఇచ్చారా?

కలిసి కూర్చుని మాట్లాడుకున్నాం. చాలా వర్క్‌షాప్‌లు చేశాం. 'బాహుబలి' స్థాయిలో కాదనుకోండి.. (నవ్వుతూ). సుజిత్‌కి మాస్ పల్స్ బాగా తెలుసు. 'డైహార్డ్ ఫ్యాన్స్' అనే డైలాగ్ ఉండాలన్న ఆలోచన కూడా తనదే.

ఈ సినిమాలో యాక్షన్ దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాటి కోసం ప్రత్యేకంగా చేసిన కసరత్తేంటి?

'బాహుబలి'తో పోలిస్తే 'సాహో'లోని యాక్షన్ సన్నివేశాలు పూర్తిగా విభిన్నమైనవి. కొన్ని యాక్షన్ సన్నివేశాల్ని ఎలా తెరకెక్కించాలో అర్థం కాలేదు. అబుదాబీలో కొన్ని ఫైట్స్ తీశాం. వాటి కోసం జెట్స్, రిమోట్ కార్లు లాంటివి వాడాం. రిమోట్ కార్లని నేను చూడడం అదే మొదటిసారి. ఇలాంటి సన్నివేశాల్ని తెరకెక్కించే కెమెరాలు ప్రత్యేకంగా డిజైన్ చేయిస్తారట. అవి కూడా మేం విదేశాల నుంచి ఓడల్లో దిగుమతి చేసుకోవాల్సివచ్చింది. ప్రతి సన్నివేశానికి ముందు చాలా కసరత్తు చేశాం. కళావిభాగం, కెమెరా టీమ్ సమన్వయంతో పనిచేశాయి. ఈ సన్నివేశాల్ని ఎడిట్ చేసిన విధానం కూడా హాలీవుడ్ స్థాయిలో ఉంటుంది.

'సాహో' కథ గురించి చాలా కథనాలు ప్రచారంలో ఉన్నాయి. మీరు ద్విపాత్రాభినయం చేస్తున్నారని అంటున్నారు. ఈ విషయంపై క్లూ ఇస్తారా?

ద్విపాత్రాభినయం కాకపోవచ్చు (నవ్వుతూ).

"నాకంటే ఎక్కువ విజయాలు సాధించిన వాళ్లంతా వినయంగానే ఉంటున్నారు. రాజమౌళిని పన్నెండేళ్లుగా చూస్తున్నా. తను అప్పుడు ఎలా ఉన్నాడో, ఇప్పుడూ అలానే ఉన్నాడు. చిరంజీవిగారు, రజనీ కాంత్ గారు ఎంతో సాధించారు. వాళ్ల ముందు నేను చిన్నవాడినే కదా".

"ఈమధ్య తెలుగు సినిమా మంచి జోరు మీద ఉంది. మంచి సినిమాలొస్తున్నాయి. చిన్న సినిమాలు కూడా బాగా ఆడుతున్నాయి. అది చాలా మంచి పరిణామం. చిన్న సినిమాలు ఆడితే ప్రతిభావంతులు మరింతమంది బయటకు వస్తారు. ఇటీవల జాతీయ అవార్డుల్లో తెలుగు సినిమా తన సత్తా చాటింది. ఇవన్నీ మంచి పరిణామాలు".

కథ మొత్తం ఇప్పుడే చెప్పొచ్చు. కానీ థియేటర్‌కి వెళ్లేంత వరకూ ఆ ఉత్సుకత ఉండాలి కదా. అందుకే దాస్తున్నాం. కథ గురించి కొన్ని క్లూలు ట్రైలర్‌లో ఇచ్చేశాం.

'బాహుబలి' విజయాన్ని చూసే ఈ సినిమా బడ్జెట్ పెంచుకుంటూ వెళ్లారా?

'బాహుబలి' జరుగుతున్నప్పుడు సుజిత్ ఈ కథ చెప్పాడు. 'బాహుబలి' బాగా ఆడితే ఈ సినిమాపై డబ్బులు ఖర్చు పెట్టొచ్చు అనిపించింది. అదృష్టంకొద్దీ బాగా ఆడింది. దాంతో క్రమంగా 'సాహో' స్కేల్ పెరుగుతూ వెళ్లింది. ఎంత చేసినా రూ.150 కోట్లు దాటదనుకున్నాను. కానీ ఎక్కువైపోయింది.

బడ్జెట్ పెరిగిపోతేంటి ఏమనిపించేది?

నిద్రపట్టేది కాదు. బడ్జెట్ అనేది నా స్నేహితులు చూసుకుంటారు. వాళ్లు అసలు రాజీ పడరు.

'బాహుబలి', 'సాహో'తో బాలీవుడ్‌లోకీ వెళ్లారు. మీ సినిమాలను అక్కడ అగ్ర హీరోలు పోటీగా భావించే పరిస్థితి. అక్కడి హీరోలు మీతో ఎలా ఉంటున్నారు?

పోటీ అని బయట మాట్లాడుకుంటారు. కానీ మా మధ్య అలాంటివేం ఉండవు. అక్కడి కథానాయకులు నన్ను స్వాగతించిన తీరు చాలా ఆనందాన్ని కలిగించింది. రణ్‌బీర్ కపూర్, అజయ్‌దేవగణ్ నాతో బాగా మాట్లాడతారు. ఈ మధ్య ఆమీర్ ఖాన్ ప్రీమియర్ షో కోసం ఆహ్వానించడానికి ఫోన్ చేశారు.

బాలీవుడ్‌లో మల్టీస్టారర్ చేయడానికి రెడీయేనా?

తప్పకుండా. అలాంటి కథల్ని అక్కడ మరింత బాగా ఆదరిస్తారు.

ఓ యాక్షన్ చిత్రాన్ని హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కించాల్సి వస్తున్నప్పుడు కూడా పాటలు అవసరం అనిపిస్తోందా?

మేం తీసింది కమర్షియల్ చిత్రమే. అందులో ఎలాంటి హంగులు ఉండాలో అవన్నీ ఉండాల్సిందే. సడన్‌గా హీరో బాలసుబ్రహ్మణ్యంలా పాటలు పాడాల్సిందే.. (నవ్వుతూ)

తొలినాళ్లకీ ఇప్పటికీ మీలో మీకు కనిపించిన మార్పులు?

'ఈశ్వర్' చేస్తున్నప్పుడు నన్నెవరైనా చూస్తారా? నేనిక్కడ నిలదొక్కుకోగలనా? అనే భయం వేసేది. ఇప్పుడు 'బాహుబలి'ని మరిపించేలా ఏం చేయగలం? ఏం చేస్తే ప్రేక్షకులు ఆస్వాదిస్తారు? అనేది ఆలోచిస్తున్నా.

బయట కూల్‌గా ఉంటారు. సినిమాల్లో వీరోచితంగా కనిపిస్తారు. ఇలా ఎలా చేయగలుగుతున్నారు?

డబ్బులు తీసుకుంటున్నాం కదండీ.. (నవ్వుతూ). సెట్లో ఇప్పటికీ బిడియం ఉంటుంది. కానీ కెమెరా ఆన్ అయితే అది మాయం అవుతుంది.

'సాహో' ఒత్తిడంతా మీరే భరించారు. మీ ఒత్తిడిని తీసుకునే జీవిత భాగస్వామి ఎప్పుడొస్తుంది?

ఒత్తిడి తీసుకుంటుందో, పెంచుతుందో తెలీదు కదా? (నవ్వుతూ). అందుకే కాస్త ఆగాను.

'మిస్ ఇండియా'గా కీర్తి సురేష్

కీర్తి సురేష్

'మహానటి'తో జాతీయ ఉత్తమ నటి పురస్కారాన్ని అందుకుంది కీర్తి సురేష్. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రధారిగా ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. నరేంద్రనాథ్ దర్శకుడు. మహేష్ కోనేరు నిర్మాత. ఇటీవలే యూరప్‌లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. ఈ చిత్రానికి 'మిస్ ఇండియా' అనే పేరును ఖరారు చేసినట్టు ప్రకటించడంతో పాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. నిర్మాత మాట్లాడుతూ "కీర్తి సురేష్ నుంచి ఇప్పుడు ప్రేక్షకులు ఎలాంటి సినిమాని కోరుకుంటారో, అలాంటి సినిమానే 'మిస్ ఇండియా'. ప్రతి అమ్మాయి తన జీవితంలో ఎక్కడో ఒక చోట ఎదుర్కొనే పరిస్థితుల నేపథ్యంలో దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది చిత్రం. కీర్తి సురేష్ జాతీయ పురస్కారాన్ని గెలుచుకొన్నాక నటిస్తున్న తొలి చిత్రం మా సంస్థలోనే కావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పటికే సింహభాగం చిత్రీకరణ పూర్తయింది. మిగిలిన భాగాన్ని పూర్తిచేసి, అక్టోబరు లేదా నవంబరులో చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. "కీర్తి సురేష్ మాత్రమే న్యాయం చేయగల కథ ఇది. అందుకే ఈ కథ సిద్ధమయ్యాక ఆమెకి వినిపించగానే నచ్చి ఒప్పుకొన్నారు. అన్ని రకాల భావోద్వేగాలున్న చిత్రం" అన్నారు దర్శకుడు. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

గీతోపదేశం

ఈరోజుల్లో ఆడవారు
కీలుబొమ్మలా... కానే కారు
రాజ్యాలు ఏలుతున్నారు
రాకెట్లు తోలుతున్నారు
అంతుకు వస్తే చంద్రమండలం
అంతు తేలుస్తారు
గీతం: కాలం మారింది...
చిత్రం: నిన్నే పెళ్లాడతా(1968)
రచన: సి.నారాయణరెడ్డి
– పంపినవారు: పి.సత్యమయ్య, మర్రిమాకులపల్లి

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

చీమ.. ప్రేమ

ఇందు, అమిత్

అమిత్, ఇందు జంటగా నటించిన చిత్రం 'చీమ - ప్రేమ మధ్యలో భామ'. ఎస్.ఎన్. లక్ష్మీ నారాయణ నిర్మాత. శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు దర్శకుడు. వచ్చే నెలలో విడుదల చేస్తారు. దర్శకుడు మాట్లాడుతూ "అల్ప ప్రాణి అయిన చీమ మనిషిగా మారాలని ఆశ పడుతుంది. మరి అది సాధ్యమైందా అనేది తెరపైనే చూడాలి. ఒక యువ జంట ప్రేమ ప్రయాణానికీ, చీమకీ మధ్య సంబంధమేంటన్నది ఆసక్తికరం. కుటుంబ విలువలతో, కామెడీ ప్రధానంగా సాగే చిత్రమిది. సంగీతం, గ్రాఫిక్స్ ప్రధాన ఆకర్షణ" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "చీమ కథే మా చిత్రానికి ప్రధాన బలం. రవి వర్మ సంగీతం, ఎస్పీ బాలు, గీతామాధురి పాడిన పాటలు మెప్పిస్తాయి" అన్నారు.

చివరి నిమిషం వరకూ

ఎలక్సియన్, తనిష్క్ రెడ్డి

తనిష్క్ రెడ్డి, ఎలక్సియన్ జంటగా నటించిన చిత్రం 'దర్పణం'. రామకృష్ణ వెంప దర్శకుడు. క్రాంతి కిరణ్ వెల్లంకి నిర్మాత. సెప్టెంబరు 6న విడుదల అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఈమధ్య తెలుగులో థ్రిల్లర్ చిత్రాలు మంచి విజయాన్ని అందుకుంటున్నాయి. 'దర్పణం' కూడా ఆ జాబితాలో చేరుతుందన్న నమ్మకం ఉంది. చివరి నిమిషం వరకూ ఏం జరుగుతుందన్నది అంతుపట్టదు. ప్రచార చిత్రానికి మంచి స్పందన వచ్చింద"న్నారు. సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని.



భీమనేని శ్రీనివాసరావు

"ప్రేక్షకులు తాము చూసేది రీమేక్ చిత్రమా? లేక డబ్బింగ్ చిత్రమా అనేది పట్టించుకోరు. వాళ్లకు కథ నచ్చిందంటే అన్ని విషయాల్నీ మరిచి పోయి ఆస్వాదిస్తారు. అందుకే నాకు ఎక్కడ మంచి కథ దొరికినా మన ప్రేక్షకులకు చూపించాలని తపిస్తుంటా" అన్నారు దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు. ఆయన ఇటీవల 'కౌసల్య కృష్ణమూర్తి' చిత్రాన్ని తెరకెక్కించారు. తమిళంలో విజయవంతమైన 'కణ'కి రీమేక్ ఇది. ఐశ్వర్య రాజేష్, రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో సోమ వారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు భీమనేని.

కథ నచ్చితే చాలు... అన్నీ మరిచిపోతారు

'కౌసల్య కృష్ణమూర్తి' ఫలితం సంతృప్తిని ఇచ్చిందా?

దర్శకుడిగా నాకు ఈ చిత్రం తర్వాత వచ్చినన్ని ప్రశంసలు గతంలో ఏ సినిమాకూ రాలేదు. టి.సుబ్బరామిరెడ్డి సినిమా చూసి, ప్రత్యేకంగా మా చిత్రబృందాన్ని అభినందించారు. ఓ మంచి కథ కోసం ఎదురు చూస్తున్న సమయంలోనే 'కణ' దొరికింది. ఈ సినిమా ఇంత బాగా వచ్చిందంటే కారణం ఐశ్వర్య రాజేష్. ఆమె కొన్ని నెలల పాటు క్రికెట్‌లో శిక్షణ తీసుకొని నటించింది.

మాతృకలో శివ కార్తికేయన్ చేసిన పాత్రను మళ్లీ ఆయనతోనే చేయించడానికి కారణం?

వాస్తవానికి ఈ చిత్ర మాతృక 'కణ'ను నిర్మించింది ఆయనే. ఈ కథ కోసం చాలా మంది పోటీ పడినా నిర్మాత కె.ఎస్.రామారావుపై ఉన్న గౌరవంతో తెలుగు హక్కుల్ని మాకు ఇచ్చారు. ఆ సమయంలోనే ఆయన ఓ చిన్న కోరిక కోరారు. మాతృకలో నేను పోషించిన పాత్రను తెలుగులోనూ నేనే చేస్తానని అడిగారు. ఇక 'కణ' సంగీత దర్శకుడినే ఇక్కడా తీసుకోవడానికి కారణం.. ఆయన సంగీతంలో ఉన్న కొత్తదనమే.

ఎక్కువగా రీమేక్ కథలతోనే ప్రయాణం చేస్తున్నారు ఎందుకు?

నేను ఏ సినిమానైనా ఒక సాధారణ ప్రేక్షకుడిలాగే చూస్తా. అది నా మనసుకు నచ్చిందంటే వెంటనే మన ప్రేక్షకులకి చూపించాలని తపిస్తుంటా.

ఈ సినిమాలో నటుడిగా చిన్న పాత్రలో మెరిశారు. అవకాశాలొస్తే బయట చిత్రాల్లోనూ చేస్తారా?

నాకు కాస్త విరామం దొరికి, మంచి పాత్రలు వస్తే కచ్చితంగా చేస్తా. చదువుకునే రోజుల్లో నాటకాలు రాసుకొని నేనే నటించే వాడిని. కానీ పరిశ్రమకు వచ్చిన కొత్తలో నటుడిగా ప్రయత్నించడానికి భయం వేసింది. అందుకే ముందు సహాయ దర్శకుడిగా చేరి పని నేర్చుకుంటే చాలు అనుకున్నా. అలా చేస్తున్న రోజుల్లోనూ నటుడిగా అవకాశాలొచ్చాయి, చేశాను. ఆ తర్వాత రెండు పడవలపై ప్రయాణం ఎందుకని చాలా అవకాశాల్ని వదులుకున్నా. ఇటీవల మళ్లీ కొంత విరామం దొరకడంతో 'కుదిరితే కప్పు కాఫీ', 'కెరటం' చిత్రాల్లో నటించా.

'సుడిగాడు 2' తీసుకొచ్చే ఆలోచన ఉందా?

'సిల్లీ ఫెలోస్' సమయంలోనే నరేష్, నేను ఈ విషయం గురించి మాట్లాడుకున్నాం. ఆయన కూడా 'సుడిగాడు 2' చేద్దాం అని అడిగారు. అది ఎప్పుడు కుదురుతుందో చూడాలి. ప్రస్తుతానికి ఓ ప్రాజెక్టు విషయమై చర్చలు జరుగుతున్నాయి.

చిన్నదానా... చిక్కుల్లో పడకు!

స్నేహితులతో పార్టీలు, సరదాలు, విహారయాత్రలు ఎంతో సంతోషాన్నిస్తాయి. వెళ్లేముందు ప్రతి ఆడపిల్లా తనకంటూ హద్దులు, మరికొన్ని స్వీయ రక్షణ చర్యలు తీసుకోలేకపోతే చిక్కుల్లో పడక తప్పదు. అసలేం చేయాలంటే...

● నలుగురు కలిస్తే చాలు ఓ చిన్నపాటి వేడుక చేసుకునే రోజులివి. వీకెండ్ విహారయాత్రలు ఇప్పుడో ట్రెండ్. తరచూ పార్టీలన్నా, దూర ప్రయాణాలన్నా అమ్మానాన్నలు ఓ పట్టాన ఒప్పుకోకపోవచ్చు. వారికుండే భయాలే దానికి కారణం. మీరూ చెప్పకుండా వెళ్లే ప్రయత్నం చేయొద్దు. ఎక్కడికైనా వారి అనుమతితోనే వెళ్లండి. ఇది మీ భద్రతకు ఎంతో ముఖ్యం.

● ఒంటరిగా పార్టీలకు, దూర ప్రయాణాలకు వెళ్లకపోవడమే మంచిది. సోషల్‌మీడియా పరిచయాలతో కలవాలనుకోవడం, పార్టీలు చేసుకోవాలనుకోవడం అసలే వద్దు. జనసంచారం లేని ప్రాంతాల్లో కలవాలనుకుంటే నిరభ్యంతరంగా నో చెప్పండి. అబ్బాయిలతో కలిసి వెళ్లినా, పార్టీ చేసుకున్నా తప్పేం లేదు కానీ... మీ హద్దులు మీరు మరిచిపోవద్దు. ఎదుటివారు ఏ మాత్రం అనుచితంగా ప్రవర్తిస్తున్నా... నిర్మొహమాటంగా కాదని చెప్పడానికి వెనుకాడకండి. ముఖ్యంగా ఫొటోలు తీసేందుకు అసలు ఒప్పుకోవద్దు. ఎంత స్నేహితులైనా ఎవరినీ నమ్మి ఏ పనీ చేయకండి.

● దూర ప్రాంతాలకు విహారయాత్రలకు వెళ్తున్నారా... కచ్చితంగా మీరు వెళ్లే ప్రదేశాల రూట్లు, అక్కడ మీకు తెలిసిన వారి వివరాలతో కూడిన కార్డులు, ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోండి. ఇవి మీకు ఆపత్కాలంలో ఉపయోగపడతాయి. ఫోన్లలో సేఫ్టీయాప్‌లూ ముఖ్యమే. పోలీసులు అమ్మాయిల రక్షణకోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లనూ గుర్తుంచుకోండి. ఎవరిమీదైనా అనుమానం వస్తే... మీ ఆప్తుల సాయం కోరడానికి వెనుకాడొద్దు.

జుట్టుకు పిండిపూత

పట్టులా మెరిసే జుట్టు ఉంటే ఆ అందమే వేరు. కాలుష్యం, జుట్టు విషయంలో చిన్నచిన్న నిర్లక్ష్యాలతో అది ఎండిపోయి పీచులా మారుతుంది. అలా జీవం కోల్పోయిన జుట్టుకు ఈ పూతలు వేసి చూడండి.

- ఓ గిన్నెలో రెండు చెంచాల చొప్పున సెనగపిండి, పెరుగు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించాలి. అరగంట తరువాత తల కడిగేసుకోవాలి తప్ప షాంపూ వాడకూడదు. వారంలో రెండుసార్లు ఈ పూత వేసుకోవచ్చు. అర కప్పు సెనగ పిండి, గుడ్డు, కొంచెం పెరుగు, మూడు నాలుగు చుక్కల కొబ్బరినూనె... కలిపి జుట్టు, మాడుకు బాగా పట్టించాలి. గంట తరువాత గాఢత తక్కువగా ఉండే షాంపూతో శుభ్రం చేసుకోవాలి.
- పావుకప్పు కలబంద గుజ్జులో రెండు చెంచాల తేనె, కొద్దిగా కొబ్బరినూనె కలిపి తలకు పట్టించాలి. అరగంట తరువాత తలస్నానం చేయాలి. ఇలా వారానికోసారి చేస్తోంటే జుట్టు పట్టులా మెరుస్తుంది. తల్లోని మురికీ పోతుంది.
- పావుకప్పు పెరుగులో నిమ్మరసం కలిపి తలంతా రాసుకోవాలి. ఇది జుట్టు ఎండిపోకుండా, పీచులా మారకుండా చేస్తుంది.
- సరిపడా మందారాకుల ముద్దలో కొద్దిగా ఆముదం కలిపి తలకు రాసుకోవాలి. ముప్పావుగంట అయ్యాక గాఢత తక్కువగా ఉన్న షాంపూతో కడిగేసుకుంటే చాలు.

మొక్కజొన్నతో మేలెంతో!

వాతావరణం ఏ మాత్రం చల్లగా మారినా... వేడివేడిగా మొక్కజొన్న కంకుని తినాలని అనిపిస్తుంది. ఇది రుచినే కాదు... ఇందులోని పోషకాలు ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తాయి.

ఇందులో ఉండే పీచు జీర్ణాశయ పనితీరును మెరుగుపరుస్తుంది. అజీర్తిని నివారించి మలబద్ధకం సమస్యను వదిలిస్తుంది. అధిక బరువునూ నియంత్రిస్తుంది. మొక్కజొన్నలో ఉండే కెరొటినాయిడ్లు, బయోఫ్లవనాయిడ్లు రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. కండరాల క్షీణతను దూరం చేస్తాయి.



- బీ12 విటమిన్, ఇనుము, ఫోలిక్ ఆమ్లం మొక్కజొన్నలో అధికం. ఈ పోషకాలు రక్తహీనతకు గురి కాకుండా చేస్తాయి.
- ఇందులో ఉండే బీటా కెరొటిన్ శరీరంలోకి చేరాక ఎ విటమిన్‌గా మారుతుంది. ఈ పోషకం కంటిచూపును మెరుగుపరుస్తుంది.
- మొక్కజొన్నలోని పిండిపదార్థాలు శరీరానికి శక్తిని అందిస్తాయి. చురుగ్గా ఉండేలా చేస్తాయి. దీనిద్వారా అందే ఫైటోకెమికల్స్ రక్తంలో చక్కెరస్థాయుల్ని అదుపులో ఉంచుతాయి.
- ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలూ మొక్కజొన్న నుంచి అందుతాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. గర్భిణులకు అవసరమయ్యే ఫోలిక్ యాసిడ్ సైతం మొక్కజొన్న నుంచి కొంతవరకూ పొందొచ్చని అంటారు నిపుణులు.

ఇన్నిరకాలుగా మేలుచేసే మొక్కజొన్నను కేవలం కాల్చుకుని మాత్రమే కాదు... ఉడికించీ తీసుకోవచ్చు.



వసుంధర

సాహో... అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తోన్న సినిమా. ఇందులో తొలిసారి తెలుగు తెరపై మెరవనున్న శ్రద్ధాకపూర్‌ను... మరింత వర్ణరంజితంగా కనిపించేలా చేయడంలో దుస్తుల డిజైనర్ లేపాక్షి ఎల్లవాడి పాత్ర ఎంతో ఉంది. ఇప్పటికే పలు సినిమాలకు పనిచేసిన ఆమెకు... ఈ అవకాశం ఎలా వచ్చిందీ... దానికోసం ఎంత కష్టపడిందీ.. ఆమె మాటల్లోనే.

సాహో అవకాశం శ్రద్ధతోనే...

విశాల్‌ను ఇందు నమ్ముతుందా..?

మనసు మమత

ఈటీవీ

ఈరోజు రాత్రి 7:30కు ఈటీవీలో

మాది హరియాణా. అమ్మానాన్నది బోధనా రంగం. చిన్నప్పటి నుంచి నాకు ఫ్యాషన్ రంగమంటే ఇష్టం. అదే లక్ష్యంతో పెరిగిన నేను... లండన్‌లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో డిగ్రీ పూర్తి చేశా. ఇటలీలో ప్రత్యేక కోర్సు చదివి బాలీవుడ్‌లో అవకాశాల కోసం ముంబయికి వచ్చా. నేను ఊహించినట్లుగా సినిమా అవకాశం రాలేదు. ప్రకటనలతో నా కెరీర్ మొదలైంది. ఇప్పటివరకు వెయ్యికి పైగా ప్రకటనలకు దుస్తుల డిజైనర్‌గా పని చేశా.

రెండేళ్ల ప్రయాణం... భారీ బడ్జెట్ చిత్రం 'సాహో'లో అవకాశం రావడం అదృష్టంగానే భావిస్తున్నా. శ్రద్ధా కపూర్‌కు నేను చేసిన డిజైన్లంటే చాలా ఇష్టం. ఆమెతో గతంలో 'ఏక్ విలన్'కు పనిచేశా. ఆ ప్రయాణం మా ఇద్దరి మధ్య మంచి అనుబంధాన్ని పెంచింది. ఆ చిత్రం ఆమెకు మంచి పేరూ తెచ్చిపెట్టింది. సాహో కథ విన్నప్పుడే శ్రద్ధ తనకు డిజైనర్‌గా పనిచేయమని అడిగింది. ఈ యూనిట్‌తో కలిసి రెండేళ్లు ప్రయాణించా. ఎన్నో అనుభూతుల్ని మిగుల్చుకోగలిగా.

పరిశోధన చేశా... శ్రద్ధకు తెలుగులో ఇది మొదటి చిత్రం. కథనమూ ఉన్నత ప్రమాణాలతో, ఆధునికంగా కనిపించబోతోంది. ఇవన్నీ తెలుసుకున్నాక ఆమెకు దుస్తులు రూపొందించే ముందు నాదైన పరిశోధన చేశా. చిత్రంలోని సన్నివేశాలను బట్టి ప్రత్యేక దుస్తులుండాలని నిర్మాతలు మొదటే చెప్పారు. అవన్నీ గుర్తుంచుకుని చాలా జాగ్రత్తగా డిజైను చేశా. ప్రతి సందర్భం తెరపై ఓ చిత్రలేఖనంలా కనిపించేలా, ప్రభాస్, శ్రద్ధ పోటాపోటీగా ఉండేలా నా వంతుగా ప్రయత్నించా. ఈ సినిమాకు సంబంధించిన దుస్తులు, చెప్పులు, నగలన్నింటినీ ఇటలీ, లండన్‌లో కొన్నాం. రోజూ చిత్రీకరణ పూర్తయిన తరువాత మర్నాడు చేయబోయే సన్నివేశం, ప్రభాస్ ధరించబోయే దుస్తులు తెలుసుకుని, దానికి తగ్గట్లుగా శ్రద్ధకు డిజైన్ చేసేదాన్ని.

నేనూ ఆ కొండ ఎక్కా: 'ఏ చోట నువ్వున్నా... ఊపిరిలా నేనుంటా' పాటను ఆస్ట్రియాలోని మంచు కొండలపై ఏడు రోజులు చిత్రీకరించారు. అభిమానులకు ఈ పాట రంగుల విందే. ప్రభాస్ దాదాపు సూట్స్‌లో ఉంటే, శ్రద్ధ 30 నుంచి 40 మీటర్ల పొడవుండే పెద్దపెద్ద గౌనుల్లో కనిపిస్తుంది. ఇందులో హీరోయిన్ కోసం 16 సంచుల దుస్తులు, 42 జతల చెప్పుల బ్యాగులు, రెండు సంచుల నగలు మోసుకుంటూ నేనూ కొండెక్కేదాన్ని. విదేశాల్లో చిత్రీకరణ అంటే మన పని మనమే చేసుకోవాలి. ఆ చలిలో వేకువజామునే మా ప్రయాణం మొదలయ్యేది. శ్రద్ధకు ఎరుపు రంగంటే ఇష్టం. ఇందులో విదేశీ పోలీసు అధికారిణిలా కనిపిస్తుంది. దానికి తగినట్లుగా మహిళా పోలీసు అధికారుల ఆహార్యంపై నాదైన హోంవర్క్ చేసుకున్నా. ఎన్నో దేశాలకు చెందిన పోలీసు ఆఫీసర్లను పరిశీలించా. శ్రద్ధ శారీరాకృతికి సరిపోయేలా చాలా ప్రయత్నాలు చేసి చివరకు దుస్తుల్ని డిజైను చేశా. ఇందులో శ్రద్ధ వేసుకున్న తెలుపురంగు డ్రెస్, పసుపు రంగు గౌను నాకెంతో నచ్చాయి.

మహర్షిలోనూ... సాహో మాత్రమే కాదు... గతంలోనూ కొన్ని తెలుగు సినిమాలకు పనిచేశా. నా మొదటి సినిమా జూనియర్ ఎన్‌టీఆర్ నటించిన శక్తి. ఇందులో ఇలియానాకు దుస్తులు డిజైన్ చేశా. 'బుడ్డా హోగా తేరా బాప్'లో అమితాబ్‌కి డిజైనింగ్ చేసే అవకాశం వచ్చింది. మహేశ్‌బాబు 'మహర్షి'లో పూజాహెగ్డేకి దుస్తులు డిజైను చేయగలిగా కానీ.. మహేష్‌కి కాదు. ఆయనతో పనిచేస్తే బాగుంటుందని చాలాసార్లు అనుకున్నా. ఆ కల ప్రకటనల రూపంలో నెరవేరింది. వీళ్లే కాదు... కాజల్, సాయిధరమ్‌తేజ్, రాణా దగ్గుబాటి వంటివారికీ పనిచేశా. బాలీవుడ్‌లోనూ కొన్ని సినిమాలు చేసిన అనుభవం ఉంది.

క్రికెటర్లకూ: భారత క్రికెటర్లు ధోని, సచిన్, యువరాజ్, శిఖర్‌ధావన్, సెహ్వాగ్ తదితరులందరితో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. వాళ్లు నటించిన ప్రకటనలకు దుస్తులు రూపొందించా. అన్నింట్లో నాకంటూ గుర్తింపు తెచ్చుకోవడం వెనుక నేను చేసే హోంవర్క్ ఎంతో ఉంటుంది. ఎప్పటికప్పుడు మారుతున్న ఫ్యాషన్‌ను అనుసరిస్తుంటా. ఈ రంగంలో పోటీ ఎక్కువ. దాన్ని తట్టుకోవాలంటే... కొంత కష్టపడటం తప్పదు. సమయం దొరికినప్పుడల్లా ప్రయాణాలు చేస్తూ... అక్కడి ఫ్యాషన్లు గమనిస్తుంటా. నటీనటులతో పనిచేస్తున్నప్పుడు వాళ్లనుంచి ఎన్నో కొత్త విషయాలూ నేర్చుకుంటా. ఇప్పుడు వాళ్లూ ఫ్యాషన్లపై అవగాహన పెంచుకుంటున్నారు. పాత్రలకు తగినట్లుగా కొన్ని సలహాలూ ఇస్తుంటారు. ఆ సలహాలూ పరిగణిస్తా. వస్త్రాలు, రంగులు, డిజైన్లు... ప్రతి సినిమాకు దుస్తులు ఒకేలా లేకుండా చూడటానికి ఎంత కష్టమైనా పడతా. నేను చేపట్టిన ప్రాజెక్టు ఏదైనా నటీనటులు భిన్నంగా కనిపించేలా చేయడమే నా లక్ష్యం.

ఆ భోజనం మరువలేను...

విదేశాల్లోనే కాదు... హైదరాబాద్‌లోనూ 'సాహో' షూటింగ్ జరిగింది. ప్రతిరోజూ ప్రభాస్ ఇంటినుంచి భోజనం వచ్చేది. దాదాపు 12 నుంచి 16 రకాల వంటకాలు తెప్పించేవారు. కాస్త ఘాటుగా ఉన్నా... ఆ రుచిని మరవలేను. ప్రభాస్ చాలా మంచి వ్యక్తి. స్నేహానికి ప్రాణమిస్తారు. అందరినీ మర్యాదగా పలకరిస్తారు.

అవార్డు అందుకున్నా...

'సుల్తాన్'లో అనుష్కా శర్మ భిన్నంగా కనిపించేందుకు రోహతక్‌లోని రోడ్లు, బజార్లు తిరిగేదాన్ని. ఆ అమ్మాయిల ఆహార్యం, నగలు, జీవనశైలిని పరిశీలించా. అక్కడి నుంచే అనుష్క కోసం కొన్ని దుస్తులు, యాక్సెసరీలూ తీసుకొచ్చా. ఇందులో ఆమె మొత్తం మూడు జతల డెనిమ్‌లు, దాదాపు ఆరు సల్వార్ కమీజులు మాత్రమే వేసుకుంది. ఈ చిత్రానికి ఉత్తమ దుస్తుల డిజైనర్‌గా అవార్డును అందుకున్నా.

నజరానా

నాలుగు అరటిపండు తొక్కలను లీటరు నీటిలో వేయాలి. ఆ నీళ్లు రంగు మారాక మొక్కలకు పోయాలి. అరటిపండు తొక్కల్లోని ఫాస్పరస్, పొటాషియం... మొక్క ఆరోగ్యంగా ఎదిగేందుకు తోడ్పడతాయి.

బంగారం వెండి

26న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,685	3,680
వెండి (గ్రా)	49.80	49.20

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	39,940	39,760	38,300	39,800	38,400	37,800	39,930	39,760	39,980	39,560
ఆర్నమెంట్	37,600	37,220	35,600	36,860	35,460	34,960	36,910	36,800	37,180	36,800
వెండి(కిలో)	46,840	46,045	46,300	46,200	45,700	44,800	46,700	46,000	47,000	46,000

మేం కొన్న పొలాన్ని... మామగారు అమ్మొచ్చా?

డియర్ వసుంధర

జి. వరలక్ష్మి
న్యాయవాది

? మా పెళ్లి తరువాత కట్నం డబ్బుకి మరి కొంత సొమ్ము కలిపి పొలం కొన్నాం. మా వారు కొన్నేళ్ల క్రితం చనిపోయారు. ఇప్పుడు ఆ పొలాన్ని మా మామగారు అమ్మేసినా డబ్బును నా పిల్లలకి ఇవ్వనంటున్నారు. పెద్ద మనుషులతో చెప్పించినా న్యాయం జరగలేదు. లాయరేమో పహాణీలో మీ అత్తమామల పేరు లేదు... కాబట్టి ఏమీ చేయలేం అంటున్నారు. కొనుక్కున్నవారు డబ్బు చెల్లించడానికి ఇంకా మూడు నెలలు గడువుంది. ఈలోగా నేనేం చేయొచ్చు?

- ఓసోదరి

✔ పొలాన్ని మీ వారి పేరు మీద కొనలేదా... మీరు కట్నం ఇచ్చిన ఆధారాలు ఉన్నాయా... కట్నం డబ్బు రూపంలో ఇచ్చి ఉంటే అప్పుడు ఆ డబ్బు మీ నాన్నగారికి ఎలా వచ్చింది... అందుకు ఆధారాలేమైనా ఉంటే ఆ పొలాన్ని మీ కట్నం డబ్బుతో కొన్నారని నిరూపించవచ్చు. మీ మామగారు తన పిత్రార్జితపు ఆస్తి అమ్మగా వచ్చిన డబ్బుని ఈ భూమిని కొనడానికి వాడారా... అదే అయితే దాన్ని ఆధారంగా చూపించే అవకాశం ఏమైనా ఉందేమో తెలుసుకోండి. వీటన్నింటికీ సమాధానాలు దొరికితేనే...మీ సమస్య పరిష్కారం అవుతుంది. సాధారణంగా హిందూ వారసత్వ చట్టం ప్రకారం మనిషి చనిపోయిన తరువాత అతని ఆస్తిలో భాగానికి కొడుకు, కూతురు, భార్య, చనిపోయిన కొడుకు పిల్లలు వస్తారు. మీ మామగారు బతికే ఉన్నారు కాబట్టి ఆయన ఆ ఆస్తిని తన స్వార్జితంగా చూపించే అవకాశం ఉంది. దాన్ని తనకు నచ్చినవారికి ఇవ్వొచ్చు. హిందూ దత్తత, నిర్వహణ చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం భర్త చనిపోయిన కోడలు, మామగారి దగ్గరి నుంచి జీవన భృతి పొందవచ్చు. ఆమెకు వేరే ఆధారం లేదని నిరూపించగలగాలి. ముందు ఆ పొలంలో భాగం కావాలని మీ మామగారికి ఒక లాయర్ నోటీసు ఇప్పించండి. ఆ లీగల్ నోటీసు కాపీని కొనుక్కునే వారికి పంపించి మీకు రావాల్సిన భాగం తేలేవరకూ రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేదని చెప్పండి. రిజిస్ట్రార్ ఆఫీస్‌లోనూ రిజిస్ట్రేషన్ ఆపమని దరఖాస్తు ఇవ్వండి. వాళ్లు ఆపడానికి ఇష్టపడకపోతే రిజిస్ట్రార్‌ని, మీ మామగారిని ప్రతివాదులుగా చేర్చి ఒక ఇంజెంక్షన్ సూట్ వేయండి. దానిలో నాట్ టూ ఎలినేట్ ప్రాపర్టీ అని అభ్యర్థించండి. నా భర్త ఆస్తికి నేనూ, నా పిల్లలు వారసులు అని చెబుతూ పత్రికా ప్రకటన ఇవ్వండి. పహాణీలో మీ అత్తమామల పేరు లేదంటే పొలాన్ని ఎవరి పేరు మీద కొన్నారు మరి... లాయర్ నోటీస్ ఇవ్వడానికి పహాణీలో పేరు ఉండనక్కర్లేదు. మీ వారి పేరు మీద పొలం ఉంటే మీమామగారికి అసలు అమ్మడానికి అర్హతే లేదు. ముందు ఆస్తిని మీ పేరుమీద బదిలీ చేయించుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు దాన్ని అమ్మడానికి ఎవరికీ హక్కు ఉండదు. ఓ లాయర్‌ని ఏర్పాటు చేసుకుని ముందడుగు వేయండి.

మీ ప్రశ్నలు ఇకపై vasulegal@eenadu.net కు పంపించగలరు.

హ్యాండుబ్యాగు నప్పేలా...

ఈ రోజుల్లో దుస్తులకు నప్పేలా ఎంచుకునే యాక్సెసరీల్లో హ్యాండుబ్యాగులూ ఉంటాయి. రంగులే కాదు... అవీ సందర్భానుసారంగా ఉండేలా చూసుకుంటున్నారు నేటి మహిళలు. ఇది మంచి మార్పే కానీ... అసలు బ్యాగు ఎంచుకునే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో చూద్దామా...

- బ్యాగు కొనేముందు ఒకరోజులో మీరు దాన్ని ఎలా ఉపయోగిస్తారనేదీ ముఖ్యమే. ఎక్కడపడితే అక్కడ పెడతారా లేదా జాగ్రత్తగా చూసుకుంటారా... ప్రశ్నించుకోవాలి. ఎలాంటి వస్తువులు అందులో పెట్టాలనుకుంటున్నారో ఆలోచించుకోవాలి.
- దుస్తులు ట్రయల్ వేసుకున్నట్లు... కొనేముందు బ్యాగునీ ఒకటిరెండు సార్లు భుజానికి వేసుకుని అద్దంలో గమనించుకోవాలి. మీకు నప్పుతుందో లేదో తెలుస్తుంది. ఆ తరువాతే ధర గురించి ఆలోచించాలి.
- బ్యాగు పరిమాణం ఎంతుండాలనేదీ అవసరమే. మీరు సన్నగా, పొడుగ్గా ఉన్నట్లయితే గుండ్రని రకం బాగుంటుంది. ఒకవేళ మీది కర్వీ శరీరాకృతి అయితే... దీర్ఘచతురస్రాకారంలో, పల్చగా ఉన్నది ఎంచుకోవాలి.
- బ్యాగు మరీ చిన్నగా ఉంటే... అందులో మీ వస్తువులేవీ పట్టవు. ఒకవేళ బాగా పెద్దగా ఉన్నట్లయితే ఎక్కువ వస్తువుల్ని నింపేసే అవకాశం ఉంటుంది. ఈ రెండూ కాకుండా... సరైన రకాన్ని కొనుక్కునేలా చూసుకోవాలి. ట్రెండ్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎప్పుడూ నలుపు, గోధుమ అని కాకుండా... దుస్తుల్ని బట్టి... కాస్త భిన్నమైన రంగును ప్రయత్నించి చూడండి.

చిరునవ్వులు చిందించే సాయం

'చిరునవ్వులతో జీవితం సాగిపోవాలి' అని కోరుకోనివారెవరుంటారు? కానీ కొందరు విద్యార్థులకు ప్రతిభ ఉన్నా సరైన ఆర్థిక వనరులుండవు. ఇలాంటి వారికి చేయూతనిస్తూ సాయం చేస్తోంది కోల్గేట్. కీప్ ఇండియా స్మైల్ ఫౌండేషనల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌తో ఆ అవకాశాన్ని కల్పిస్తోంది. ఇంటర్ స్థాయి నుంచి పై చదువుల వారందరికీ ఆర్థిక సాయం అందిస్తోంది.

Colgate స్కాలర్‌షిప్

కీప్ ఇండియా స్మైలింగ్ ఫౌండేషనల్ ప్రోగ్రామ్‌ను కోల్గేట్- పామోలివ్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. 'ప్రతి ఒక్కరికీ చిరునవ్వును చిందించే భవిష్యత్తును పొందే హక్కు ఉంది' అనేది దీని నినాదం. ఫౌండేషనల్ సపోర్ట్ ఇవ్వడం ద్వారా ఏటా రెండు కోట్ల మందికి మంచి జీవితాన్ని ప్రసాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా స్కాలర్‌షిప్‌తోపాటు అవసరమైనవారికి మెంటర్‌షిప్, కెరియర్ గైడెన్స్ సదుపాయాలనూ అందిస్తారు. విద్యార్థులతో పాటు విద్యాపరంగా ఇతరులకు సాయపడే వారికీ వీటిని అందిస్తున్నారు.

పదకొండో తరగతి: రెండేళ్లపాటు ఇస్తారు. ఏడాదికి రూ. 20,000 చొప్పున చెల్లిస్తారు. ❍ 2019లో పదో తరగతి ఉత్తీర్ణులైనవారు దీనికి అర్హులు. ❍ పదోతరగతి బోర్డు పరీక్షల్లో 75% మార్కులు సాధించి ఉండాలి. ❍ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో పదకొండో తరగతిలో చేరి ఉండాలి. ❍ కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ. ఐదు లక్షలు మించకూడదు.

గ్రాడ్యుయేషన్/ డిప్లొమా: మూడేళ్లపాటు ఏడాదికి రూ.30,000 చొప్పున చెల్లిస్తారు. ❍ 2019లో ఇంటర్ పూర్తిచేసినవారు అర్హులు. ❍ బోర్డు పరీక్షలో కనీసం 60% మార్కులు సాధించి ఉండాలి. ❍ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో మూడేళ్ల గ్రాడ్యుయేషన్/ డిప్లొమాలో చేరి ఉండాలి. ❍ కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ. ఐదు లక్షలు మించకూడదు.

యూజీ/ ఇంజినీరింగ్: నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.30,000 చొప్పున చెల్లిస్తారు. ❍ 2019లో ఇంటర్ పూర్తిచేసినవారు అర్హులు. ❍ బోర్డు పరీక్షలో కనీసం 60% మార్కులు సాధించి ఉండాలి. ❍ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌లో చేరి ఉండాలి. ❍ కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ. ఐదు లక్షలు మించకూడదు.

ఒకేషనల్ కోర్సులు : ఏడాది వ్యవధికి రూ.20,000 చెల్లిస్తారు. ❍ 2019లో ఇంటర్ పూర్తిచేసినవారు అర్హులు. ❍ బోర్డు పరీక్షలో కనీసం 60% మార్కులు సాధించి ఉండాలి. ❍ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో ఏదేని ఒకేషనల్ కోర్సులో చేరి ఉండాలి. ❍ కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ. ఐదు లక్షలు మించకూడదు.

స్పోర్ట్స్ పర్సన్స్ : మూడేళ్లపాటు ఏడాదికి రూ.75,000 చొప్పున చెల్లిస్తారు. ❍ దేశ/ రాష్ట్ర/ జిల్లా స్థాయిల్లో ఏదో ఒక ఆటలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. అభ్యర్థుల వయసు 28 ఏళ్లకు మించకూడదు. ❍ జాతీయ స్థాయిలో 500లోపు గానీ, రాష్ట్ర స్థాయిలో 100లోపుగానీ, జిల్లా స్థాయిలో 10లోపుగానీ ర్యాంకు సాధించి ఉండాలి. ❍ కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ. ఐదు లక్షలు మించకూడదు.

ఇతరులకు సాయం అందించేవారికి : రెండేళ్లపాటు ఏడాదికి రూ.75,000 చొప్పున చెల్లిస్తారు. ❍ నిరుపేదలైన పిల్లలకు బోధించడమో, ఆటలకు సంబంధించిన శిక్షణనో ఇస్తున్నవారు అర్హులు. ❍ ఆర్థికపరంగా వెనుకబడిన లేదా మధ్య తరగతికి చెందినవారై ఉండాలి.

ఎంపిక విధానం

వివిధ దశల్లో ఎంపిక చేస్తారు. దరఖాస్తుల నుంచి అర్హులైనవారిని గుర్తించి, సంస్థ ప్రతినిధులు నేరుగా సంప్రదిస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఫేస్‌బుక్, గూగుల్+, ఈమెయిల్‌లలో ఒకదానితో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఫీజు ఏమీ లేదు. కేటగిరీని బట్టి సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పాస్‌పోర్ట్ సైజు ఫొటోగ్రాఫ్, ఐడీ ప్రూఫ్, ఆదాయ సర్టిఫికెట్, మార్కుల షీట్లు, బోనఫైడ్/ అడ్మిషన్ లెటర్ మొదలైనవి ఇందులో భాగంగా ఉంటాయి. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ: జనవరి 30, 2020.

వెబ్‌సైట్: https://www.colgatecares.co.in/keepindiasmiling/get-started.html

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్ఐఈలో టెక్నికల్ అసిస్టెంట్లు

చెన్నైలోని ఐసీఎంఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ (ఎన్ఐఈ)... కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్ (సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్) **ఖాళీలు:** 50 **అర్హత:** గ్రాడ్యుయేషన్ (సైన్స్)తోపాటు సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం లేదా మాస్టర్స్ డిగ్రీ (సైన్స్) ఉత్తీర్ణత. **వయసు:** 30 సంవత్సరాలు మించకూడదు. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్/ ఈమెయిల్ **చివరితేది:** సెప్టెంబరు 23 **వెబ్‌సైట్:** www.nie.gov.in

నైపర్ హైదరాబాద్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్), హైదరాబాద్... టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు:** ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సిస్టమ్ ఇంజినీర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తదితరాలు. **ఖాళీలు:** టీచింగ్-18, నాన్ టీచింగ్-08 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్/ ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 27 వరకు. **హార్డు కాపీలను పంపడానికి చివరితేది:** అక్టోబరు 7 **వెబ్‌సైట్:** www.niperhyd.ac.in

అప్రెంటిస్‌షిప్

డీఆర్‌డీఓ

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)... బెంగళూరు పరిశోధనా విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్-80, గ్యాస్ టర్బైన్ రిసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్-150. **విభాగాలు:** గ్రాడ్యుయేట్, టెక్నీషియన్, ట్రేడ్. **అర్హత:** సంబంధిత ట్రేడులు/ బ్రాంచుల్లో ఐటీఐ, ఇంజినీరింగ్ డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత. **వయసు:** 18-27 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** అకడమిక్ మెరిట్, రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 7 https://rac.gov.in/

ప్రవేశాలు

ఎనర్జీ మేనేజ్‌మెంట్‌లో పీజీ సర్టిఫికెట్

చెన్నైలోని నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ప్రాంతీయ కేంద్రమైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్టివిటీ... 2019-20 ఏడాదికిగానూ పీజీ సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. **కోర్సు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ప్రోగ్రాం **కాలవ్యవధి:** ఒక ఏడాది. **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 7 **అర్హత:** ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** అకడమిక్ మెరిట్, గేట్ స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** సెప్టెంబరు 5 **వెబ్‌సైట్:** www.npcindia.gov.in

విద్యుత్ పంపిణీలో పీజీ డిప్లొమా

నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌పీటీఐ).. పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. **కోర్సు:** పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ **కాలవ్యవధి:** 26 వారాలు. **మొత్తం సీట్లు:** 60 **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 14 **అర్హత:** ఎలక్ట్రికల్/ పవర్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బీఈ/ బీటెక్. **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరితేది:** అక్టోబరు 4 **వెబ్‌సైట్:** http://npti.gov.in/

వాక్-ఇన్స్

హోమి బాబా క్యాన్సర్ హాస్పిటల్

విశాఖపట్నంలోని టాటా మెమోరియల్ సెంటర్ - హోమి బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్... అడ్‌హాక్ పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది. **పోస్టులు-ఖాళీలు:** ఫార్మసిస్టు-03, సైంటిఫిక్ అసిస్టెంట్ (రేడియేషన్ అంకాలజీ)-06, మెడికల్ సోషల్ వర్కర్-03, మేనేజర్ (రేడియోథెరపీ)-01. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ, బీఫార్మసీ/ డీఫార్మసీ, పీజీ, గ్రాడ్యుయేషన్, డిప్లొమా, అనుభవం. **వాక్‌ఇన్ తేది:** ఆగస్టు 30 https://tmc.gov.in/

మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.net లో

లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్‌లపై ఓ కన్నేస్తుంటారా? సరికొత్త స్టైల్స్ ఇట్టే పట్టేస్తుంటారా? అందంగా కనిపించేలా చేయడం మీకు ఇష్టమా? సృజనాత్మకత అన్నా, కొత్త వాటిని రూపొందించడమన్నా ఆసక్తి ఉందా? వీటన్నిటికీ 'అవును' అనేది మీ సమాధానమయితే.. మీరు ఫ్యాషన్ కెరియర్‌కు ఓటేయొచ్చు. ఈ రంగంలో దుస్తుల డిజైన్ తెలిసిందేగా అనుకుంటున్నారా! అదొక్కటే కాదు, ఆక్సెసరీ డిజైనింగ్, జ్యూలరీ డిజైనింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, పర్సనల్ స్టైలింగ్.. ఇంకా బోలెడున్నాయ్. చదివేయండి!

అదిరేటి స్టైల్ మీదైతే..!

వయసుతో తేడా లేకుండా అందరినీ ఆకర్షించేది ఫ్యాషన్ రంగం. మంచి వేతనంతోపాటు పేరు ప్రఖ్యాతులను తెచ్చే రంగమిది. అందుకే యువతలో ఈ కెరియర్ అంటే క్రేజ్! కొంత సృజనాత్మకత, శైలి, సహజత్వం, అందమైన వాటిని గుర్తించగల తత్వం వంటి లక్షణాలున్నవారు ఇందులో బాగా రాణిస్తారు. నూతనత్వానికి జీవం పోయాలనుకునేవారికి ఈ రంగం ఎప్పుడూ ఆహ్వానం పలుకుతుంది. తరచి చూడాలే కానీ ఫ్యాషన్ రంగం అందించే అవకాశాలెన్నో. అందుకే చాలా సంస్థలు ఈ రంగానికి సంబంధించి వివిధ కోర్సులను అందిస్తున్నాయి. ఇవి రంగానికి సంబంధించిన అవగాహనను కల్పిస్తాయి. కోర్సు, ఎంచుకున్న సంస్థను బట్టి కరిక్యులమ్ ఉంటుంది. ఆసక్తి, అర్హత, నైపుణ్యాల ఆధారంగా విద్యార్థులు తమకు నచ్చినవాటిని ఎంచుకోవచ్చు.

ఫ్యాషన్ టెక్నాలజీ

క్రియేటివిటీ, టెక్నాలజీల కలయిక ఇది. మారుతున్న సమయానికి అనుగుణంగా దుస్తుల, యాక్సెసరీల రూపకల్పనలో టెక్నాలజీకి ప్రాముఖ్యం ఇస్తారు.

ఈ విభాగంలో డిగ్రీ, పీజీ కోర్సులు- బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (బీఎఫ్‌టెక్), మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కోర్సు కాలవ్యవధి సంస్థలను బట్టి మారుతుంది. చాలావరకూ సంస్థల్లో బ్యాచిలర్ కోర్సుకు నాలుగేళ్లు కాగా, కొన్నింటిలో మూడేళ్లు మాత్రమే. సెమిస్టర్లు ఉంటాయి. ఇంటర్ స్థాయిలో మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంపీసీ) సబ్జెక్టులను కలిగి ఉన్నవారు అర్హులు. పీజీ కోర్సులకు సంబంధిత విభాగంలో డిగ్రీ చేసినవారు లేదా ఏదేని బ్రాంచితో బీటెక్ చేసినవారు అర్హులు. కోర్సు కాలవ్యవధి రెండేళ్లు. కోర్సులో భాగంగా ఫ్యాషన్ పరిశ్రమకు అవసరమైన టెక్నిక్‌లు, మెథడ్స్, ఇన్‌స్ట్రుమెంట్ల గురించి తెలుసుకుంటారు. ఉన్న వస్త్రాల ఆధారంగా కొత్తరకాలను రూపొందించడం తెలుసుకుంటారు. తక్కువ ఖర్చులో ఎక్కువ నాణ్యమైన వాటిని రూపొందించడంపై దృష్టిపెడతారు. దీంతోపాటు రంగానికి అవసరమైన కొంత మేనేజ్‌మెంట్ అంశాలూ ఉంటాయి. ఫ్యాషన్ ప్రొడక్ట్‌లకు సంబంధించి కాన్సెప్చువలైజింగ్, డిజైనింగ్, మేనేజింగ్, మార్కెటింగ్ అంశాలపై అవగాహన తెచ్చుకుంటారు.

కోర్సులు అందిస్తున్న ప్రముఖ సంస్థలు: ❖ నిఫ్ట్ ❖ సీఈటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐరాపురం ❖ మహాత్మాగాంధీ యూనివర్సిటీ, కొట్టాయం

అవకాశాలు: ఎక్కువగా మాన్యుఫాక్చరింగ్ సంస్థలు వీరిని నిమమించుకుంటాయి. వివిధ బ్రాండ్‌లకు కన్సల్టేషన్ ఇవ్వడానికి వీరిని తీసుకుంటారు. ఫ్యాకల్టీగా అవకాశాలుంటాయి.

ఆక్సెసరీ డిజైనింగ్

ఫ్యాషన్ రంగం వస్త్రాలకే పరిమితం కాలేదు. దానికి తగ్గట్టుగా వేసుకునే వివిధ అంశాలకూ ప్రాధాన్యం పెరుగుతోంది. దీంతో ఆక్సెసరీ డిజైనింగ్ ఫ్యాషన్ రంగంలో ఒక శాఖగా ఎదుగుతోంది. అందాన్ని పెంచడంలో వీటికీ ప్రాధాన్యం ఉంటోంది. ఫుట్‌వేర్, స్కార్ఫ్, హ్యాండ్ బ్యాగ్, బెల్ట్‌లు, సన్ గ్లాసెస్, నెక్ పీస్‌లు మొదలైనవన్నీ దీని కిందకి వస్తాయి. వీటిని స్కెచ్ రూపంలో గానీ, క్యాడ్‌ను ఉపయోగించి సిస్టమ్‌లోగానీ రూపొందిస్తారు. డిప్లొమా, డిగ్రీ (బ్యాచిలర్, బీఎస్‌సీ), పీజీ (మాస్టర్, పీజీ డిప్లొమా) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిగ్రీ, డిప్లొమా కోర్సులకు గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదైనా గ్రూపుతో ఇంటర్ పూర్తిచేసినవారు అర్హులు. పీజీ డిప్లొమా కోర్సులకు డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. పీజీ కోర్సులకు డిగ్రీ అర్హత ఉండాలి. కొన్ని కోర్సులకు డిగ్రీలో సంబంధిత కోర్సును చదివుండటం తప్పనిసరి. చాలావరకూ సంస్థలు సొంతంగా ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తున్నాయి.

కోర్సులు అందిస్తున్న ప్రముఖ సంస్థలు: ❖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (హైదరాబాద్, చెన్నై, ముంబయి, బెంగళూరులతో సహా దేశవ్యాప్తంగా సంస్థలు 16 చోట్ల ఉన్నాయి) ❖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (దేశంలో చాలా ప్రదేశాల్లో ఇది అందుబాటులో ఉంది) ❖ సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, పుణె ❖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జ్యూలరీ డిజైన్, అహ్మదాబాద్

అవకాశాలు: అపారల్/ యాక్సెసరీ తయారీ సంస్థల్లో పనిచేయవచ్చు. సొంతంగా బ్రాండ్ సంస్థలను నిర్మించుకోవచ్చు. ఫిలిం, టెలివిజన్ రంగాల్లోనూ వీరికి అవకాశాలుంటాయి.

జ్యూలరీ డిజైన్

పండుగలు, ఫంక్షన్లు.. చిన్న కార్యక్రమమైనా ఆభరణాలవైపే దృష్టి మళ్లుతుంది. కస్టమర్ల దృష్టిని ఆకర్షించడంతోపాటు కొన్నేళ్లపాటు బోర్ కొట్టకుండా చేయడంపై వీరి విజయం ఆధారపడి ఉంటుంది. భారీ నుంచి తేలికపాటి వరకు అన్ని రకాల ఆభరణాలపై వీరు పని చేస్తుంటారు. అనుభవాన్ని బట్టి వీరికి అవకాశాలు పెరుగుతుంటాయి. వివిధ రకాల రాళ్లు, లోహాలపైనా అధ్యయనం చేస్తారు.

డిప్లొమా, డిగ్రీ (బ్యాచిలర్, బీఎస్‌సీ), మాస్టర్స్, పీజీ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిగ్రీ, డిప్లొమా కోర్సులకు గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదైనా గ్రూపుతో ఇంటర్ పూర్తిచేసినవారు అర్హులు. పీజీ డిప్లొమా కోర్సులకు డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. పీజీ కోర్సులకు డిగ్రీ అర్హత ఉండాలి. చాలావరకూ సంస్థలు సొంతంగా ప్రవేశపరీక్ష నిర్వహించి ఎంపిక చేసుకుంటున్నాయి.

కోర్సులు అందిస్తున్న ప్రముఖ సంస్థలు: ❖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జ్యూలరీ, అహ్మదాబాద్ ❖ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యూలరీ, న్యూదిల్లీ ❖ మణిపాల్ యూనివర్సిటీ, జయపుర ❖ వోగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, బెంగళూరు

అవకాశాలు: జ్యూలరీ, మాన్యుఫాక్చరర్లు, షోరూంలలో వీరికి అవకాశాలుంటాయి. రిటైల్ చైన్ సంస్థలూ వీరిని ఎంచుకుంటుంటాయి.

లగ్జరీ బ్రాండ్ మేనేజ్‌మెంట్

ఫ్యాషన్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్నకొద్దీ విలాస వస్తువులకు ఆదరణ పెరుగుతోంది. లగ్జరీ బ్రాండ్ మేనేజర్లు తమ మార్కెటింగ్, బిజినెస్ నైపుణ్యాలను ఉపయోగించి తమ బ్రాండ్ వస్తువులకు గిరాకీ ఏర్పరుస్తారు. పెరుగుతున్న పోటీ దృష్ట్యా తమ బ్రాండ్‌లను మార్కెట్‌లో నిలబడేలా చేయడానికి నిపుణులు అవసరమవుతున్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని కొన్ని సంస్థలు ప్రత్యేకంగా ఈ విభాగంలో మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తున్నాయి. పెద్ద బ్రాండ్‌లతో పనిచేయడానికి అవసరమైన నైపుణ్యాలను తెలుసుకోవచ్చు. కాంపిటిటివ్ స్ట్రాటజీ, మేనేజింగ్ మల్టీ బ్రాండ్స్, ఆంత్రపాలజీ ఆఫ్ లగ్జరీ కన్సమ్‌ప్షన్, బ్రాండింగ్ ఎక్స్‌పీరియన్స్, మార్కెట్, కన్సూమర్లను అర్థం చేసుకోవడం, ప్రైసింగ్, బ్రాండ్ బిల్డింగ్ వంటి అంశాలను నేర్చుకుంటారు. డిప్లొమా, బీబీఏ, ఎంబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా, డిగ్రీ కోర్సులకు ఏదైనా గ్రూపుతో ఇంటర్ పూర్తిచేసినవారు అర్హులు. పీజీ కోర్సులకు డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. కొన్ని సంస్థలు కామర్స్ నేపథ్యం ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. **కోర్సులు అందిస్తున్న ప్రముఖ సంస్థలు:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ ❖ ఎస్‌పీ జైన్ స్కూల్ ఆఫ్ గ్లోబల్ మేనేజ్‌మెంట్, ముంబయి ❖ ముద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్ అండ్ అడ్వర్టైజింగ్, అహ్మదాబాద్ ❖లగ్జరీ కనెక్ట్ బిజినెస్ స్కూలు, గుడ్‌గావ్, పెరల్ అకాడమీ, న్యూదిల్లీ, ముంబయి మొదలైనవి. **అవకాశాలు:** వివిధ సంస్థలు వీరిని బ్రాండ్ మేనేజర్, ఫ్యాషన్ గూడ్స్ ప్రొడక్ట్ మేనేజర్, ఫ్యాషన్ రిటైల్ మేనేజర్, ఫ్యాషన్ పబ్లిక్ రిలేషన్స్ స్పెషలిస్ట్, మార్కెటింగ్ అండ్ విజువల్ మర్చండైజింగ్ మేనేజర్ స్థానాల్లో నియమించుకుంటున్నాయి.

ఫ్యాషన్ ఫొటోగ్రఫీ

దుస్తులు, జ్యూలరీ ప్రమోషన్లు, అడ్వర్టైజింగ్‌లకు ప్రత్యేకమైన ఫొటోగ్రాఫర్లు అవసరమవుతుంటారు. వీరు ముఖ్యంగా మేగజీన్లు, పేపర్లు, హోర్డింగ్‌ల కోసం ఫొటోలు తీస్తుంటారు. ప్రచారం చేయాలనుకుంటున్న ప్రొడక్ట్‌పై కస్టమర్ల దృష్టి ఎక్కువగా పడేలా చేయడం వీరి విధి. అందుకు అవసరమైన రంగుల మేళవింపు, కోణాన్ని నిర్ధారించడం వంటివాటిపై పట్టు ఉండాలి. వీటన్నింటినీ కోర్సుల్లో భాగంగా నేర్చుకుంటారు. ఎక్కువగా డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కాలవ్యవధి ఏడాది నుంచి ఏడాదిన్నర వరకూ ఉన్నాయి. చాలావరకూ సంస్థలు డిగ్రీ వారికి అవకాశమిస్తుండగా, కొన్ని సంస్థలు ఇంటర్ వారినీ తీసుకుంటున్నాయి.

కోర్సులు అందిస్తున్న ప్రముఖ సంస్థలు: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫొటోగ్రఫీ, ముంబయి ❖ సింబయాసిస్ స్కూల్ ఆఫ్ ఫొటోగ్రఫీ, పుణె ❖ దిల్లీ కాలేజ్ ఆఫ్ ఫొటోగ్రఫీ, దిల్లీ మొదలైనవి.

అవకాశాలు: ఫ్యాషన్ మేగజీన్లు, ఫ్యాషన్ హౌజ్‌లు, కేటలాగ్, అడ్వర్టైజింగ్ సంస్థలు వీరికి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఫ్యాషన్ డిజైనర్ల దగ్గరా చేరొచ్చు.

ఫ్యాషన్ బిజినెస్ మేనేజ్‌మెంట్

ఫ్యాషన్, మేనేజ్‌మెంట్, మార్కెటింగ్‌ల కలయిక. బ్రాండ్ విలువను పెంచడం, మీడియా, అడ్వర్టైజ్‌మెంట్ల ద్వారా దానిపై అవగాహన కల్పించడం దీనిలో భాగం. సంబంధిత నిపుణులు మార్కెట్‌లో తమ వస్తువుకు గిరాకీ పెంచడానికి అవసరమైన కొత్త, సృజనాత్మక వ్యూహాలను రూపొందిస్తారు. ఇందుకు తాజా ట్రెండ్‌లను గమనించడం, వాటిపై పరిశోధన చేయడం ద్వారా విజయానికి అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తుంటారు. ఇందుకు మంచి కమ్యూనికేషన్ కూడా అవసరం అవుతుంది.

డిప్లొమా, డిగ్రీ (బీఏ), పీజీ (ఎంబీఏ) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిగ్రీ, డిప్లొమా కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్మీడియట్ పూర్తిచేసినవారు అర్హులు. ఎంబీఏ కోర్సుకు ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

కోర్సులు అందిస్తున్న ప్రముఖ సంస్థలు: ❖ ఇండియన్ స్కూల్ ఆఫ్ డిజైన్ అండ్ ఇన్నొవేషన్, ముంబయి ❖ ఎంఐటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, పుణె ❖ వోగ్ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్, న్యూదిల్లీ ❖ ఇండియన్ స్కూల్ ఆఫ్ డిజైన్ అండ్ ఇన్నొవేషన్, ముంబయి ❖ ఎఫ్‌డీడీఐ, చెన్నై, ముంబయి, కోల్‌కతా ❖ ఆర్క్ అకాడమీ ఆఫ్ డిజైన్, జయపుర మొదలైనవి.

అవకాశాలు: అపారల్ బ్రాండ్‌లు, బొటిక్‌లు, రిటైల్ చైన్ అవుట్‌లెట్‌లు వీరిని నియమించుకుంటాయి. పీఆర్, ఫ్యాషన్ ప్రొడక్ట్ మేనేజర్, బ్రాండ్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్‌గా అవకాశాలుంటాయి,

ఇమేజ్ కన్సల్టింగ్/ పర్సనల్ స్టైలింగ్

ఒక వ్యక్తి ఇమేజ్‌ను పూర్తిగా మెరుగ్గా మార్చేయడం వీరి విధి. దుస్తులు, స్టైలింగ్ వంటి అంశాలపై దృష్టి పెడతారు. వస్త్రాలు, యాక్సెసరీలకే పరిమితం కాకుండా వారి బాడీ లాంగ్వేజ్, తీరు తెన్నులు.. ఇంకా ఎన్నో అంశాలపై దృష్టి పెడతారు. మొత్తంగా ఒక పూర్తి వ్యక్తిగా తయారు చేస్తారు. కోర్సులో భాగంగా వీటికి సంబంధించిన అంశాలన్నింటిపై అవగాహన కల్పిస్తారు. ప్రత్యేకంగా డిగ్రీ కోర్సులేవీ అందుబాటులో లేవు. సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు వీటిని చేయొచ్చు. కోర్సుల కాలవ్యవధి ఆరు నెలల నుంచి ఏడాది వరకూ ఉంటుంది. **కోర్సులు అందిస్తున్న ప్రముఖ సంస్థలు:** ❖ జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్స్, ముంబయి ❖ ముద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్స్, అహ్మదాబాద్ ❖ ఇమేజ్ కన్సల్టింగ్ బిజినెస్ ఇన్‌స్టిట్యూట్ (దేశవ్యాప్తంగా చాలా నగరాల్లో అందుబాటులో ఉంది) ❖ స్టెర్లింగ్ స్టైల్ అకాడమీ, ముంబయి ❖ ఇమేజ్ ఎడ్జ్ అకాడమీ, ముంబయి ❖ ఇంపాక్ట్-ఇమేజ్ స్టైలింగ్ అండ్ ఎటిక్విట్ కన్సల్టెంట్స్, గుడ్‌గావ్, బెంగళూరు, ముంబయి ❖ ఫస్ట్ ఇంప్రెషన్, భువనేశ్వర్, అమృత్‌సర్ మొదలైనవి. **అవకాశాలు:** పబ్లిక్, ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు వీరికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇమేజ్ కన్సల్టింగ్ సంస్థల్లో చేరొచ్చు. ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ సేవలను అందించడం ద్వారా స్వీయ ఉపాధి పొందొచ్చు.

ఛాంపియన్

"గతంలో ఇన్‌స్వింగర్‌ను ఎక్కువగా ఉపయోగించేవాడిని. టెస్టులు ఆడుతున్నకొద్దీ ఔట్‌స్వింగర్లను సంధించే విశ్వాసం వచ్చింది. ముఖ్యంగా ఇంగ్లాండ్ పర్యటన నుంచి ఇది మొదలైంది. ప్రతి సారి వైవిధ్యంగా బంతులు వేయాలనే అనుకుంటా. నా బౌలింగ్ వెనుక ఎంతో శ్రమ ఉంది"
– బుమ్రా

ఒకప్పుడు విండీస్ గడ్డపై ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు కనిపించేవి.. కరీబియన్ బౌలర్లు భీకర వేగంతో బంతులు సంధిస్తుంటే వికెట్లు గాల్లో లేచి పడేవి.. వెస్టిండీస్‌తో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత పేసర్ బుమ్రా (5/7) ఆనాటి విండీస్ పేసర్లను తలపించాడు.

బుల్లెట్ బుమ్రా

తొలి టెస్టులో భారత్ ఘనవిజయం

ఆంటిగ్వా

తొలి టెస్టులో వెస్టిండీస్‌పై భారత్ విజయంపై ముందు నుంచి ఎవరికీ సందేహాల్లేవు. మ్యాచ్‌లో ఘనవిజయం ఆశ్చర్యమూ కలిగించలేదు. ఈ టెస్టు మొత్తంలో ప్రత్యేకంగా నిలిచింది బుమ్రా నాలుగో రోజు వేసిన సంచలన స్పెల్లే. అతని బుల్లెట్ బంతులకు వికెట్లు టపటపా రాలిపోయాయి.. విండీస్ బ్యాట్స్‌మెన్ దగ్గర బదులే లేదు. బుమ్రా అయిదు వికెట్లు తీస్తే.. అందులో నాలుగు క్లీన్ బౌల్డ్ కావడం విశేషం. బుమ్రాకు ఎదురు నిలవలేక బ్యాట్స్‌మెన్ నిస్సహాయులుగా మారడం, స్టంప్ ఎగిరి పడటం మ్యాచ్ చూసిన అభిమానులకు గొప్ప అనుభూతిని కలిగించి ఉంటాయనడంలో సందేహం లేదు. ఈ ఫాస్ట్‌బౌలర్ ధాటికి విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 100 పరుగులకే కుప్పకూలడంతో కోహ్లి సేన 318 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో టీమ్‌ఇండియా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో టెస్టు శుక్రవారం కింగ్‌స్టన్‌లో ఆరంభమవుతుంది.

నవ్వుతూనే..: వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో పెద్దగా ప్రభావం చూపని బుమ్రా.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం మామూలుగా చెలరేగలేదు. ఎప్పట్లాగే నవ్వుతూ, తుళ్లుతూ ప్రశాంతంగా బౌలింగ్ చేశాడు బుమ్రా. కానీ అతడి బంతులు మాత్రం నిప్పు కణికల్లాగా బ్యాట్స్‌మెన్ మీదికి దూసుకొచ్చాయి. 419 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్.. అందులో నాలుగో వంతు స్కోరు కూడా చేయలేదంటే అందుకు ఆరంభంలో బుమ్రా తీసిన దెబ్బే కారణం. తాను వేసిన తొలి ఓవర్లోనే బ్రాత్‌వైట్ (1)ను వికెట్‌కీపర్ క్యాచ్ ద్వారా పెవిలియన్ చేర్చిన ఈ పేసర్.. ఆ తర్వాత మరింత విజృంభించాడు. క్యాంప్‌బెల్ (7), డారెన్ బ్రావో (2), హోప్ (2), హోల్డర్ (8)లను క్లీన్ బౌల్డ్ చేశాడు. బంతి ఎక్కడ పిచ్ అయి ఎక్కడ వస్తుందో తెలియక ముందే ఈ విండీస్ బ్యాట్స్‌మెన్ వికెట్లు ఎగిరిపోయాయి. బుమ్రాకు తోడు ఇషాంత్ (3/31), షమి (2/13) విజృంభించడంతో టీ విరామానికి 5/15తో నిలిచిన విండీస్.. ఆ తర్వాత కూడా కోలుకోలేకపోయింది. 50 పరుగులకే 9 వికెట్లు కోల్పోయిన విండీస్ ఆలౌట్ కావడానికి ఎంతోసేపు పట్టదనిపించింది. కానీ రోచ్ (38; 31 బంతుల్లో 1×4, 5×6), కమిన్స్ (19 నాటౌట్; 22 బంతుల్లో 2×4, 1×6) అనూహ్యంగా ప్రతిఘటించారు. పదో వికెట్‌కు 50 పరుగులు జోడించి భారత బౌలర్లను విసిగించారు. అయితే గాబ్రియల్‌ను షమి ఔట్ చేసి భారత్‌కు విజయాన్ని అందించాడు. అంతకుముందు రహానె (102) సెంచరీ, హనుమ విహారి (93), కోహ్లి (51) అర్ధ సెంచరీలు చేయడంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 343/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 297 పరుగులు చేయగా.. విండీస్ 222 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

12 విదేశాల్లో కెప్టెన్‌గా కోహ్లి భారత్‌ను గెలిపించిన టెస్టులు. సౌరభ్ గంగూలీ (11)ని అధిగమించాడు.

- దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌ల్లో ఐదు వికెట్లు తీసిన తొలి ఆసియా బౌలర్‌గా బుమ్రా అరుదైన రికార్డు సృష్టించాడు.

27 సారథిగా విరాట్ గెలిపించిన మొత్తం టెస్టులు. ఈ ఫార్మాట్లో భారత్ తరఫున విజయవంతమైన కెప్టెన్‌గా ఉన్న ధోని (27) సరసన నిలిచాడు.

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మెరిసిన పి.వి.సింధు ఆటను బ్యాడ్మింటన్ కోర్టులో చూశాం. ఎంతటి ప్రత్యర్థినైనా సునాయాసంగా మట్టికరిపిస్తుంటే అబ్బురపడ్డాం. బేస్‌లైన్ దగ్గర షాట్ ఆడి ఒక్క సారిగా నెట్ దగ్గర షటిల్‌ను లాఘవంగా డ్రిబ్లింగ్ చేస్తుంటే ఆశ్చర్యపోయాం. ఎలాంటి అలసట లేకుండా ఏకధాటిగా సింధు రాకెట్ విన్యాసాల్ని చూసి ఔరా అనుకున్నాం. ఆటలో.. ఫిట్‌నెస్‌లో మిగతా క్రీడాకారిణులకు అందనంత ఎత్తుకు చేరుకున్న సింధు ఒక్కరోజులో ఈ స్థాయికి చేరుకోలేదు! కఠోర శ్రమ.. అంకితభావం.. పట్టుదలే సింధును సమున్నత స్థానంలో నిలబెట్టాయి. సింధు సాధించిన తాజా పతకం వెనుక పెద్ద ప్రణాళికే ఉంది.

ఈ పసిడి వెనుక..

ఈనాడు – హైదరాబాద్

2016లో రియో ఒలింపిక్స్‌లో రజతంతో పూర్తిగా సింధు జీవితం పూర్తిగా మారిపోయింది. కోహ్లి, ధోని, సచిన్ తర్వాత దేశంలో అత్యధికంగా ఆర్జన కలిగిన క్రికెటేతర క్రీడాకారిణిగా రికార్డు.. పేరుకు పేరు.. డబ్బుకు డబ్బు. సెలెబ్రిటీగా.. స్టార్‌గా విస్తృత ప్రచారం. 21 ఏళ్లకే క్రీడాకారుడి జీవితం ఇంతలా మారిపోతే కాస్తోకూస్తో ఏకాగ్రత చెదరడం సహజం! ఏకాగ్రత పక్కదారి పట్టి.. ఆట గాడితప్పడం సాధారణం! ఐతే వీటన్నింటికీ సింధు అతీతం. ఒలింపిక్స్‌లో సింధు రజతం గెలిచి మూడేళ్లయింది. ఇప్పటికీ ఆమె ఏకాగ్రత చెక్కు చెదరలేదు. పైగా పట్టుదల మరింత పెరిగింది. మధ్యలో మరెన్నో మేటి విజయాలు సాధించిన ఆమె.. ప్రతి షట్లర్ కోరుకున్నట్లే తాను కూడా ప్రపంచ ఛాంపియన్ అవ్వాలన్న కసితో సాధనను రెట్టింపు చేసింది. అందరిలా గోపీచంద్ అకాడమీలో సాధన చేస్తూనే.. ఫిట్‌నెస్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంది. ఇంటికి 30 కిలోమీటర్ల దూరంలో సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీలో ట్రెయినర్ శ్రీకాంత్‌వర్మ ఆధ్వర్యంలో కఠోర శిక్షణ మొదలుపెట్టింది. 2017 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు సరిగ్గా 27 రోజుల ముందు సింధు ఫిట్‌నెస్ మిషన్ మొదలైంది. సమయం తక్కువున్నా సింధును శ్రీకాంత్ అద్భుతంగా మలిచాడు. సింధు శరీరాకృతికి అనుగుణంగా శిక్షణ ప్రారంభించాడు. కోర్టులో ముందు భాగంలో సింధు బలహీనంగా ఉందని గుర్తించి.. అందుకు తగ్గ కసరత్తులు చేయించాడు. ప్రతిరోజు 60 కిమీ ప్రయాణిస్తూ.. 2 గంటల పాటు ఫిట్‌నెస్‌పై దృష్టిసారించింది సింధు. 2017 ఫైనల్లో నొజొమి ఒకుహర (జపాన్)తో 110 నిమిషాల పాటు హోరాహోరీగా తలపడానికి అదే కారణం.

2017 నుంచి క్రమం తప్పకుండా సాధన.. ఫిట్‌నెస్ కొనసాగిస్తున్న సింధు తాజా ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం ప్రత్యేకంగా సిద్ధమైంది. ఫిట్‌నెస్‌పై 45 రోజుల పాటు తీవ్రంగా కష్టపడింది. ఎంత శ్రమించినా అలసిపోని తత్వం సింధుకు మరింత కలిసొచ్చింది. తండ్రి రమణ, తల్లి విజయ ఇద్దరూ క్రీడాకారులే కావడంతో సింధుకు సహజసిద్ధమైన సామర్థ్యం అబ్బింది. వేగంగా కుదురుకోవడం ఆమెలోని ప్రత్యేకత. అత్యంత తీవ్రతతో కసరత్తులు చేసినా.. వేగంగా పరుగెత్తినా కేవలం 30 సెకన్లలోనే సింధు హృదయ స్పందన రేటు సాధారణానికి వస్తుంది. ఈ ప్రత్యేక లక్షణమే సింధును బ్యాడ్మింటన్ బాహుబలిగా మార్చేసింది. తిరుగులేని ఫిట్‌నెస్‌తో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లిన సింధుకు అక్కడ ఎదురే లేకుండా పోయింది. ఫేవరెట్‌గా బరిలో దిగిన తై జు యింగ్ (చైనీస్ తైపీ)ను క్వార్టర్‌ఫైనల్లో సింధు కట్టడి చేసే తీరే ఇందుకు నిదర్శనం. తొలి గేమ్‌ను కోల్పోయినా.. రెండు, మూడో గేమ్‌ల్లో సింధు పుంజుకున్న తీరు ప్రత్యర్థికి సైతం అర్థంకాని విషయమే. క్వార్టర్స్, సెమీస్, ఫైనల్లో ఓ సారూప్యత కనిపించింది. మూడు మ్యాచ్‌ల్లో తొలి గేమ్ పూర్తయ్యేసరికి ప్రత్యర్థులంతా చెమటతో తడిసి ముద్దయ్యారు. సింధు మాత్రమే అలసట.. ఆయాసం లేకుండా ఫిట్‌గా కనిపించింది. ఒక్కప్పుడు సింధుతో 110 నిమిషాలు తలపడి గెలిచిన ఒకుహర.. ఆదివారం నాటి ఫైనల్లో భారత స్టార్ వేగం, దూకుడును ఎదుర్కోలేక చేతులెత్తేసింది. ప్రస్తుతం ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యుత్తమ ఫిట్‌నెస్ కలిగిన సింధుకు 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడం కష్టమేమీ కాకపోవచ్చు. ఇదే ఏకాగ్రత.. పట్టుదల.. ఫిట్‌నెస్ కొనసాగిస్తే ఒలింపిక్స్‌లోనూ స్వర్ణ సింధూరం చూడొచ్చు!

హరియాణా కూత అదిరె

బంగాల్‌పై విజయం • ప్రొ కబడ్డీ లీగ్

దిల్లీ: ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగుతోంది. రైడర్లు వికాస్ ఖండోలా (11), వినయ్ (9) చెలరేగడంతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 36-33 తేడాతో బంగాల్ వారియర్స్‌పై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభంలో బంగాల్ ఆధిపత్యం చలాయించింది. అద్భుత ఫామ్‌లో ఉన్న మణిందర్ సింగ్ (15) మరోసారి రెచ్చిపోవడంతో తొలి పది నిమిషాలు ముగిసేసరికి ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన బంగాల్ 14-10తో ఆధిక్యం సంపాదించింది. వికాస్, వినయ్ సత్తాచాటడంతో తిరిగి పుంజుకున్న హరియాణా తొలి అర్ధభాగాన్ని 18-17తో ముగించింది. విరామం తర్వాత ఆట ఆరంభం కాగానే బంగాల్‌ను ఆలౌట్ చేసిన ఆ జట్టు 22-18తో నిలిచింది. అక్కడి నుంచి ఆ జట్టు దూకుడు ఏ మాత్రం తగ్గలేదు. ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెడుతూ.. ఆధిపత్యం ప్రదర్శించిన హరియాణా ఆధిక్యాన్ని పెంచుకుంటూ వెళ్లింది. మణిందర్‌తో పాటు ప్రపంజన్ (7) పోరాడినా కూడా ఆ జట్టును అందుకోలేకపోయారు. ఓ దశలో 29-25తో నిలిచిన హరియాణా విజయం దిశగా వేగంగా దూసుకెళ్లింది. మరో రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా 36-31తో ఆధిక్యంలో నిలిచిన ఆ జట్టు గెలుపు ఖరారు చేసుకుంది. ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా విజయంతో మ్యాచ్‌ను ముగించింది. ఆ జట్టుకు ఇది వరుసగా రెండో గెలుపు. మరో మ్యాచ్‌లో యూపీ యోధ 35-30తో పుణెరి పల్టాన్‌ను ఓడించింది.

రెండో రౌండ్లో ప్లిస్కోవా, నిషికోరి

యుఎస్ ఓపెన్



న్యూయార్క్: యుఎస్ ఓపెన్‌లో ప్లిస్కోవా, నిషికోరి రెండో రౌండ్లో అడుగుపెట్టారు. సోమవారం ఆరంభమైన టోర్నీలో తొలి రోజు మూడో సీడ్ ప్లిస్కోవా (చెక్) చెమటోడ్చింది. హోరాహోరీ సాగిన మహిళల సింగిల్స్ మొదటి రౌండ్లో ఆమె 7-6 (8-6), 7-6 (7-3)తో మార్టిన్‌కోవా (చెక్)పై విజయం సాధించింది. బ్రిటన్ తార కొంటా 6-1, 4-6, 6-2తో కసాట్కినా (రష్యా)ను ఓడించింది. బౌచర్డ్ 3-6, 3-6తో సెవత్సొవా (లాత్వియా) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో నిషికోరి 6-1, 4-1తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి ట్రుంజెలిటి రిటైరయ్యాడు. లజోవిచ్ (సెర్బియా) రెండో రౌండ్ చేరాడు.

లీచ్‌కు కళ్లద్దాలు జీవితాంతం ఉచితం

లీడ్స్: నమ్మశక్యం కాని ఇన్నింగ్స్‌తో యాషెస్ మూడో టెస్టులో ఇంగ్లాండ్‌ను బెన్ స్టోక్స్ గెలిపిస్తే.. అతడికి అద్భుత సహకారం ఇవ్వడం ద్వారా ఆఖరి బ్యాట్స్‌మన్ జాక్ లీచ్ కూడా చారిత్రక విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. లీచ్‌కు ఇప్పుడు బోనస్ కూడా దక్కింది. యాషెస్ స్పాన్సర్ స్పెక్సేవర్స్ అతడికి జీవితాంతం కళ్లు జోళ్లు ఇస్తామని ప్రకటించింది. "లీచ్‌కు జీవితకాలం కళ్ల జోళ్లు ఇవ్వరూ" అంటూ స్పెక్సేవర్‌ను ఉద్దేశించి స్టోక్స్ అన్నాడు. ఆ సంస్థ సరే అంది. మ్యాచ్ సందర్భంగా లీచ్ స్ట్రైక్ చేయడానికి ముందు చాలాసార్లు కళ్లద్దాలను తుడుచుకోవడం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

కివీస్ ఇన్నింగ్స్ విజయం

శ్రీలంకతో రెండో టెస్టు

కొలంబో: చివరిదైన రెండో టెస్టులో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 65 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకను చిత్తు చేసింది. సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 382/5తో ఆఖరి రోజు, సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్.. 431/6 వద్ద డిక్లేర్ చేసింది. వాట్లింగ్ సెంచరీ (105 నాటౌట్) సాధించాడు. 187 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక 70.2 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలింది. బౌల్ట్, సౌథీ, అజాజ్ పటేల్, సోమర్‌విలే తలో రెండు వికెట్లు పడగొట్టారు. డిక్వెలా (51) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

అప్పుడే కల నిజమయ్యేది!

సింధుది గర్వించదగ్గ ఘనత • స్వర్ణం గెలవాలనే వచ్చాం

'ఈనాడు'తో పుల్లెల గోపీచంద్

సింధు స్వర్ణం గెలుస్తుందన్న నమ్మకంతోనే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లినట్లు జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నాడు. సింధు సమర్థతపై తనకెప్పుడూ అనుమానం కలగలేదని తెలిపాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో సింధు ఫేవరెట్‌గా బరిలో దిగుతుందంటున్న గోపీచంద్‌తో 'ఈనాడు' ముఖాముఖి..

సింధు ఘనతను మీరెలా విశ్లేషిస్తారు?

దేశం గర్వించదగ్గ ఘనత ఇది. సింధు గత రెండు సార్లు ఫైనల్లో ఓడింది. ఈసారి స్వర్ణం గెలుస్తుందని ముందే అనుకున్నా. గత కొన్ని నెలలుగా సింధు సాధన.. ఫిట్‌నెస్‌పై కనబరిచిన శ్రద్ధ ఆమెకు కలిసొచ్చాయి. ఐదేళ్లుగా పెద్ద టోర్నీల్లో సింధు గొప్పగా ఆడుతోంది. ఈసారి అంచనాల్ని అందుకుని ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. సాయిప్రణీత్ కాంస్యం సాధించి 36 ఏళ్ల భారత నిరీక్షణకు తెరదించాడు. ఈ టోర్నీ భారత బ్యాడ్మింటన్ చరిత్రలో చిరస్మరణీయం.

ఫైనల్‌కు సింధును ఎలా సన్నద్ధం చేశారు?

ఫైనల్‌కు ప్రత్యేక వ్యూహంతో వెళ్లాం. ఎలాంటి ఒత్తిడి లేకుండా సింధు ప్రశాంతంగా ఉండేలా చూశాం. ఒకుహర ర్యాలీ క్రీడాకారిణి. ఆమె ఉచ్చులో చిక్కుకోకుండా ఆరంభం నుంచే ఎటాకింగ్ గేమ్ ఆడాలని సింధుకు సూచించా. షటిల్‌ను టాస్ చేయకుండా.. ప్రత్యర్థి దేహం మీదికే ఆడాలని చెప్పా. ప్రతి షాట్‌ను సింధు అలాగే ఆడటంతో ఒకుహరకు ఏమీ అర్థంకాలేదు. చివరి పాయింటు వరకు సింధు తీవ్రత తగ్గించలేదు.

గత రెండు ఫైనల్స్‌కు.. ఈ పోరుకు తేడా?

గతంలో రెండు సార్లు సింధు సుదీర్ఘ మ్యాచ్‌లు ఆడి ఫైనల్‌కు వచ్చింది. సరైన విశ్రాంతి.. రికవరీ లేకుండానే ఫైనల్లో ఆడాల్సొచ్చింది. ఈసారి మాత్రం సింధుకు కావాల్సినంత విశ్రాంతి దొరికింది. సెమీస్ పోరు 40 నిమిషాల్లో పూర్తవడంతో ఫైనల్‌కు సిద్ధమవడం సులువైంది. ఒకుహర, రచనోక్ సెమీస్ 80 నిమిషాలు సాగడం సింధుకు కలిసొచ్చింది.

సింధు సిల్వర్ స్టార్ అంటూ వచ్చిన విమర్శలకు సమాధానం లభించినట్లేనా?

సిల్వర్ స్టార్ అంటూ సింధు గురించి ఏవేవో మాట్లాడారు. మిగతా వారికి సందేహాలున్నాయేమో గానీ సింధు సమర్థతపై నాకెప్పుడూ అనుమానం లేదు. కావాల్సినంత శిక్షణ ఉంటే సింధుకు ఎదురుండదని తెలుసు. కచ్చితంగా ప్రపంచ ఛాంపియన్ అవుతుందన్న నమ్మకంతోనే ఇక్కడికి వచ్చాం. సింధు అందరి నమ్మకాన్ని నిలబెట్టింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యాలు గెలిచారు.. రజతాలు సాధించారు.. మరి స్వర్ణం మాటేమిటి? అంటూ ప్రశ్నలు తలెత్తాయి. తాజా ప్రదర్శనతో సింధు విమర్శకులకు సమాధానం చెప్పింది.

భారత బ్యాడ్మింటన్‌లో సింధును అత్యుత్తమ క్రీడాకారిణిగా భావించవచ్చా?

ప్రపంచ ఛాంపియన్‌షిప్, ఒలింపిక్స్, ఆసియా క్రీడలు సహా ప్రతి పెద్ద టోర్నీలో సింధు పతకాలు సాధించింది. బ్యాడ్మింటన్‌లో ముమ్మాటికీ సింధు అత్యుత్తమ క్రీడాకారిణిల్లో ఒకరు. ఈ క్రీడలో సైనా నెహ్వాల్, సింధులది ప్రత్యేక స్థానం. భారత బ్యాడ్మింటన్ ఎదుగుదలకు సైనా గట్టి పునాది వేసింది. ఆ బాటపై నడిచిన సింధు అత్యున్నత శిఖరాల్ని అధిరోహించింది.

టోక్యో ఒలింపిక్స్‌లో సింధు స్వర్ణం సాధిస్తుందా?

రియో ఒలింపిక్స్‌కు అండర్‌డాగ్‌గా వెళ్లాం. మన క్రీడాకారుల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో సన్నాహం సులువైంది. అందరినీ ఆశ్చర్యపరుస్తూ సింధు రజతం గెలిచింది. ఇప్పుడు పూర్తిగా భిన్నం. టోక్యో ఒలింపిక్స్‌కు ఫేవరెట్‌గా వెళ్తున్నాం. సింధును ఓడించడానికి మిగతా క్రీడాకారిణులు ఈ ఏడాదంతా ప్రయత్నిస్తారు. ప్రణాళికలు రచిస్తారు. సింధు ఆటతీరును క్షుణ్ణంగా చదివేస్తారు. ఈ నేపథ్యంలో మరింత అప్రమత్తత.. ఏకాగ్రత అవసరం. రెట్టింపు కష్టంతో టోక్యో ఒలింపిక్స్‌కు సిద్ధమవ్వాలి. అప్పుడే బంగారు కల నిజమవుతుంది.

– ఈనాడు, హైదరాబాద్

ఘనం (+) గ్రహణం (-)

నిఫ్టీ	26న	మార్పు%	నిఫ్టీ	26న	మార్పు%
YES BANK	62.90	6.16	JSW STEEL	214.10	-2.97
ADANI PORT	368.20	5.40	TATA STEEL	338.05	-2.09
HDFC	2148.35	5.12	SUN PHARMA	419.35	-1.98
BAJAJ FINANCE	3324.25	4.72	HERO MOTOCORP	2590.95	-1.87
ULTRATECH CEM	4038.40	4.57	VEDANTA	135.05	-1.71

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	65.48	75.92	థాయ్ బాత్/100	213.78	255.60
పౌండ్ స్టెర్లింగ్	80.37	93.22	బహ్రెయిన్ దీనార్	176.99	202.77
యూరో	72.94	84.58	కువైట్ దీనార్	195.65	243.63
జపనీస్ యెన్/100	62.08	71.99	సౌదీ రియాల్	17.37	20.63
ఆస్ట్రేలియా డాలరు	44.12	51.04	యూఏఈ దిర్హమ్	17.77	20.84
సింగపూర్ డాలరు	47.14	55.84	చైనీస్ యువాన్	7.13	11.57



26న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	316	వరంగల్	317
చిల్లరగా(ఒక గుడ్డు)	3.80	విశాఖపట్నం	361
బెంగళూరు	330	చెన్నై	345
27వ తేదీకి...		చిత్తూరు	338
విజయవాడ	336	నమక్కల్	345
గోదావరి	336		

రూ.1.76 లక్షల కోట్లు

ప్రభుత్వానికి బదిలీకి ఆర్‌బీఐ బోర్డు ఆమోదం

- ఇదే ఇప్పటిదాకా అత్యధికం
- జలాన్ కమిటీ సిఫారసుల నేపథ్యం

ముంబయి: ప్రభుత్వానికి రూ.1.76 లక్షల కోట్ల మేర డివిడెండు, అదనపు నిధులను బదిలీ చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) బోర్డు ఆమోద ముద్ర వేసింది. ఓ వైపు ద్రవ్యలోటు పెరగకుండానే మరో వైపు మందగమనం పాలవుతున్న ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు అందించాల్సిన తరుణంలో ప్రభుత్వానికి ఈ నిధులు అందుతున్నాయి. 2018-19 ఏడాదికి గాను మొత్తం రూ.1,76,051 కోట్లను బదిలీ చేయడానికి గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆర్‌బీఐ కేంద్ర బోర్డు సోమవారమిక్కడ అనుమతి తెలిపింది. సవరించిన ఆర్థిక మూలధన ప్రణాళిక(ఈసీఎఫ్) ప్రకారం.. ఇందులో రూ.1,23,414 కోట్లు అదనపు నిధులు కాగా, రూ.52,637 కోట్లు అదనపు కేటాయింపులుగా గుర్తించినట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

ఉద్దీపనకు మరింత అవకాశం

ఆర్‌బీఐ ఎంత మేర మూలధన నిధులను ఉంచుకోవాలన్న దానిపై ఏర్పాటు చేసిన బిమల్ జలాన్ నేతృత్వంలోని కమిటీ సిఫారసులకు అనుగుణంగా ఈ అదనపు నిధుల బదిలీ జరిగింది. ఈ కమిటీలోని సభ్యుడు, ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్ ఆగస్టు 14న తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన సంగతి తెలిసిందే. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలన్న ప్రభుత్వ ఉద్దేశానికి తాజాగా జరిగే ఈ నిధుల బదిలీ గట్టి దన్ను ఇవ్వనుంది. అయిదేళ్ల కనిష్ఠానికి చేరిన వృద్ధి రేటును మెరుగుపరచడంతో పాటు.. ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతం కంటే అధికం కాకుండా చూడడం కోసం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత వారం పలు చర్యలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆర్‌బీఐ ద్వారా వచ్చే నిధులతో ఆర్థిక వ్యవస్థకు మరింత ఉద్దీపన కల్పించడానికి ప్రభుత్వానికి వీలుకానుంది.

ఉర్జిత్ రాజీనామాకు కారణం ఈ నిధులే..

ఆర్‌బీఐ అదనపు నిధుల విషయంలో మోదీ ప్రభుత్వానికి, ఆర్‌బీఐ గత గవర్నర్ ఉర్జిత్ పటేల్‌కు మధ్య తీవ్ర సంఘర్షణ తలెత్తిన సంగతి తెలిసిందే. తదనంతర పరిణామాల్లో భాగంగా నవంబరు 2018 నాటి బోర్డు సమావేశంలో అదనపు నిధులను సమీక్షించడం కోసం ఆర్‌బీఐ ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయమూ విదితమే. అయితే కమిటీ ఏర్పాటు కాకముందే ఉర్జిత్‌పటేల్ రాజీనామా చేశారు. దీంతో కొత్త గవర్నర్ శక్తికాంత దాస్‌తో చర్చించిన మీదట డిసెంబరు 26న ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు.

ఏ ఏడాది ఎంత?

2013-14 నుంచే ఆర్‌బీఐ తన ఖర్చుచేయదగ్గ ఆదాయంలో 99 శాతాన్ని ప్రభుత్వానికి ఇస్తూ వస్తోంది.

- ✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.90,000 కోట్ల డివిడెండు వస్తుందని అంచనా వేయగా.. అంతకు మించి రూ.95,414 కోట్లు లభిస్తుండడం విశేషం.
- ✦ ఆర్‌బీఐ నుంచి రూ.1.06 లక్షల కోట్ల మేర డివిడెండు లభించవచ్చని కేంద్ర బడ్జెట్ 2019-20లో అంచనా వేశారు.
- ✦ అంతక్రితం ఏడాది రూ.74,140.37 కోట్లు వచ్చాయి.
- ✦ ఇక 2017-18లో ఆర్‌బీఐ నుంచి రూ.40,659 కోట్లు డివిడెండు రూపంలో బదిలీ అయ్యాయి. అంతక్రితం ఏడాది అంటే పెద్ద నోట్ల రద్దు జరిగిన సంవత్సరం(2016-17)లో రూ.30,659 కోట్లు బదిలీ అయ్యాయి. 2015-16లో మాత్రం ఇంతకు రెట్టింపుగా రూ.65,876 కోట్లు చెల్లించింది.

కమిటీ ఏం పేర్కొందంటే..

కేంద్ర బ్యాంకులు ఊహించిన కొరత(ఈఎస్)ను విశ్వసనీయ స్థాయి(సీఎల్)లో 99 శాతంగా పరిగణిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో దానిని 99.5 శాతంగా మార్చాలని కమిటీ సిఫారసు చేస్తోంది. ఆర్‌బీఐ తన పరపతి, ఆర్థిక, స్థిరత్వ నష్టభయాల కోసం కేటాయించే డబ్బులు.. దేశానికి అవసరమైనపుడు పనికి రావాల్సిన అవసరం ఉంది. అందుకు తగ్గట్లుగానే బ్యాలెన్స్ షీట్లు, పరపతి, ఆర్థిక స్థిరత్వ నష్టభయాలు, రుణ, కార్యకలాపాల నష్టభయాలకు కేటాయించాల్సిన వాటిపై సిఫారసులు చేసింది. ఈ సిఫారసులన్నీ సోమవారం నిర్వహించిన తన 578వ సమావేశంలో ఆర్‌బీఐ కేంద్ర బోర్డు ఆమోద ముద్ర వేసింది. సవరించిన ప్రణాళిక ప్రకారం.. 2018-19 ఖాతాలను మారుస్తారు. కాగా, బోర్డు ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ, దేశీయ సవాళ్లు, ఆర్‌బీఐకి చెందిన వివిధ విభాగాల కార్యకలాపాలను బోర్డు సమీక్షించింది. అదే సమయంలో 2018-19 ఏడాదికి వార్షిక నివేదికను సైతం ఆమోదించింది.

టీవీ9 గ్రూప్ సీఈఓగా వరుణ్ దాస్

హైదరాబాద్: టీవీ9 గ్రూప్ సీఈఓగా వరుణ్ దాస్ నియమితులయ్యారు. ప్రస్తుతం గ్రూప్ తాత్కాలిక సీఈఓగా ఉన్న మహేంద్ర మిశ్రా, ఇకపై టీవీ9 బోర్డు ముఖ్య సలహాదారుగా వ్యవహరించనున్నారు. మీడియా రంగంలో వరుణ్ దాస్‌కు 25 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఇంతకు ముందు జీ మీడియా సీఈఓగా అయిదేళ్లకు పైగా దాస్ పనిచేశారు. ఏబీపీ న్యూస్, ఇండియా టుడే గ్రూప్, ఆస్ట్రో ఆల్ ఏషియా నెట్‌వర్క్, ఏబీపీ గ్రూప్‌ల్లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రగామిగా ఉన్నామని, దేశవ్యాప్తంగా ఇదే స్థాయి విజయాలను సాధించడం తమ లక్ష్యమని టీవీ9 బోర్డు సభ్యుడు, పూర్తి స్థాయి డైరెక్టర్ సింగారావు పేర్కొన్నారు. వరుణ్ అనుభవం ఇందుకు దోహదపడుతుందని తెలిపారు. కొత్త సవాళ్లను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని వరుణ్ వెల్లడించారు.

వచ్చే 15 రోజుల్లో మరో 2 ఉద్దీపనలు: డీబీఎస్

సింగపూర్: వచ్చే పక్షం రోజుల్లో ప్రభుత్వం మరో రెండు విడతల్లో ఉద్దీపన ప్యాకేజీల్ని ప్రకటించే అవకాశం ఉందని డీబీఎస్ నివేదిక అంచనా వేసింది. గత వారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా పలు రంగాలకు ప్రోత్సాహకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి కొనసాగింపుగా మరో రెండు విడతల్లో ఉద్దీపన ప్యాకేజీలు ఉండొచ్చని డీబీఎస్ అభిప్రాయపడింది. గత శుక్రవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ప్రోత్సాహకాల్లో విదేశీ, దేశీయ ఈక్విటీ మదుపర్లకు అధిక సంపన్న వర్గంపై పెంచిన సర్‌చార్జీని బడ్జెట్‌కు ముందున్న స్థితికి తీసుకొచ్చారు. అంకురాలకు ఏంజెల్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇచ్చారు. వాహన రంగంలో ఒత్తిడిని తగ్గించేందుకు ప్యాకేజీని ప్రకటించారు. అలాగే ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.70,000 కోట్ల సాయమందించారు. గత మార్చి త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి అయిదేళ్ల కనిష్ఠమైన 5.8 శాతానికి పడిపోయిన నేపథ్యంలోనే మంత్రి ఈ ప్రోత్సాహకాలు ప్రకటించారు. దీనికి కొనసాగింపుగా ఆమె మరో రెండు ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించే అవకాశం ఉందని డీబీఎస్ గ్రూప్ రీసెర్చ్ ఆర్థిక వేత్త రాధికారావు అంచనా వేశారు.

జీఎస్‌టీ వార్షిక రిటర్న్‌లకు నవంబరు 30 వరకు గడువు

దిల్లీ: జీఎస్‌టీ వార్షిక రిటర్నుల దాఖలుకు గడువును మరో 3 నెలలు పాటు.. అంటే నవంబరు 30 వరకు పొడిగించారు. రిటర్నుల సమర్పణలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని పన్ను చెల్లింపుదార్ల నుంచి పలు ఫిర్యాదులందడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి వార్షిక రిటర్నుల దాఖలుకు గడువు ఈనెల 31తో ముగియనుంది. '2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీఎస్‌టీఆర్-9, జీఎస్‌టీఆర్-9ఏ, జీఎస్‌టీఆర్-9సి దాఖలుకు గడువును 2019 ఆగస్టు 31 నుంచి 2019 నవంబరు 30 వరకు పొడిగించామ'ని అని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) వెల్లడించింది. జీఎస్‌టీ కింద నమోదైన పన్ను చెల్లింపుదార్లు దాఖలు చేసే వార్షిక రిటర్నే జీఎస్‌టీఆర్ 9. రూ.2 కోట్ల టర్నోవర్ మించితే జీఎస్‌టీఆర్-9సి, కాంపోజిషన్ పథకాన్ని ఎంచుకుంటే జీఎస్‌టీఆర్-9ఏ రిటర్న్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది.

మార్కెట్ కబుర్లు

- ✦ తెలంగాణ, చత్తీస్‌గఢ్‌ల్లోని థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో ఉద్గార నియంత్రణ పరికరాలను ఏర్పాటు చేయడానికి ఎన్‌టీపీసీ నుంచి రూ.2500 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయని ప్రభుత్వ రంగ సంస్థ **భెల్** వెల్లడించింది.
- ✦ వంట గదులకు నేరుగా పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసే **సిటీ గ్యాస్ ప్రాజెక్ట్**లోకి రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.
- ✦ నీటిపై తేలియాడే ఎల్ఎన్‌జీ (ద్రవరూపిత సహజవాయువు) టెర్మినల్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం వద్ద నిర్మించనున్నట్లు **భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)** వెల్లడించింది. 2022కు పూర్తయ్యే ఈ టెర్మినల్ నిర్మాణానికి రూ.1500-1700 కోట్లు పెట్టుబడి పెడతామని బీపీసీఎల్ ఛైర్మన్ డి.రాజ్‌కుమార్ తెలిపారు.
- ✦ ఘజియాబాద్‌లోని ఫార్ములేషన్ల ప్లాంట్‌ను తనిఖీ చేసిన అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ, ఒక అభ్యంతరాన్ని లేవనెత్తినట్లు **యునికెమ్ లేబొరేటరీస్** వెల్లడించింది.
- ✦ మధ్యప్రదేశ్‌లోని వింధ్యాచల్ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్‌లో ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఎన్‌టీపీసీ నుంచి ఆర్డరు లభించినట్లు **ఎల్ అండ్ టీ** తెలిపింది. కాంట్రాక్టు విలువ వెల్లడించనప్పటికీ.. ప్రాధాన్య విభాగంలో ఆర్డర్లు రూ.1000- 2500 కోట్ల మధ్య ఉంటాయి.

రామ్‌రాజ్ కాటన్ 100వ షోరూమ్

- నెల్లూరు నగరంలో ప్రారంభం

ఈనాడు, నెల్లూరు: "పంచెకట్టు అవమానం కాదు.. అది మన భారతీయుల గౌరవం, సంప్రదాయం. మన సంస్కృతి.." అని రామ్‌రాజ్ కాటన్ సంస ఛైర్మన్, వ్యవసాపకులు కె.ఆర్.నాగరాజన్ అన్నారు. నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డులో ఆ సంస 100వ షోరూంను రామ్‌రాజ్ కాటన్ బ్రాండ్‌అంబాసిడర్ ప్రముఖ సినీ నటుడు వెంకటేష్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. అనంతరం ఉత్పత్తులను పరిశీలించి తొలి విక్రయం జరిపారు. ఈ సందర్భంగా నాగరాజన్ మాట్లాడుతూ భవిష్యత్తులో సొంతంగా తమ సంస ప్రత్యేక యూనిట్ ఏపీలో ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. తమ సంసలో 9 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. మొత్తం 12,500 రిటైలర్లు, ఎంబీవోల ద్వారా తమ ఉత్పత్తులు సరఫరా చేస్తున్నామన్నారు. 100 షోరూంలు.. 46 ఫ్రాంచైజ్ అవుట్‌లెట్‌లతో కలిపి మొత్తం 146 పనిచేస్తున్నాయని.. 50 వేల చేనేత కుటుంబాలకు తమ సంస ఉపాధి కల్పిస్తోందని చెప్పారు. స్వదేశంలో ఉన్నా, విదేశాల్లో ఉన్నా మన సంప్రదాయ ఉత్పత్తులు ధరించినప్పుడు ఆ కిక్కు వేరుగా ఉంటుందని ప్రముఖ సినీ నటుడు వెంకటేష్ అన్నారు. రామరాజ్ కాటన్ సంస 100వ షోరూం ప్రారంభించిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 2015లో రామరాజ్ సంస బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలని చెప్పినప్పుడు, మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశాన్ని ఇష్టపడి.. బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలని నిర్ణయించుకొన్నట్లు స్పష్టం చేశారు.

నెల్లూరు నగరంలో నూతన వస్త్ర దుకాణాన్ని ప్రారంభిస్తున్న నటుడు వెంకటేష్, రామ్‌రాజ్ కాటన్ అధినేత కేఆర్ నాగరాజన్

రూ.40,000కు చేరువలో పసిడి

దిల్లీ: వరుసగా అయిదోరోజూ బంగారం ధరలు పెరిగాయి. మేలిమి (999 స్వచ్ఛత) బంగారం 10 గ్రాముల ధర సోమవారం రూ.675 పెరిగి, రూ.39670కి చేరింది. వెండి కూడా కిలోకు రూ.1450 అధికమై రూ.46,550కి చేరింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర ఆరేళ్ల గరిష్ఠమైన 1554.56 డాలర్లకు చేరింది. అమెరికా, చైనాల మధ్య సుంకాల యుద్ధం తీవ్రమవుతూ, స్టాక్‌మార్కెట్లు నష్టపోతున్నందున, అంతర్జాతీయంగా పసిడిపైకి పెట్టుబడులు మళ్లడమే ధరలు ఇప్పుడు పెరగడానికి కారణం. రూపాయి మారకపు విలువ మరింత బలహీనపడి, డాలర్ విలువ రూ.72.02 కావడంతో, దేశీయంగా పసిడి ధర ఒక్కసారిగా పెరిగింది. ఆభరణాల బంగారం (916 స్వచ్ఛత) సెవరు (8 గ్రాములు) ధర రూ.700 పెరిగి రూ.29,500 పలుకుతోంది.

హైదరాబాద్ బులియన్ విపణిలో సోమవారం రాత్రికి 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.39,910కి, కిలో వెండి ధర రూ.46,650కి చేరాయి.

డీజిల్ బదులు సీఎన్‌జీ కార్లు!

మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఈడీ రామన్

దిల్లీ: డీజిల్ ఇంజిన్‌తో నడిచే చిన్న కార్ల తయారీ నిలిపి వేయాలని నిర్ణయించినందున, ఆ స్థానాన్ని సీఎన్‌జీ ఇంజిన్ కార్లతో భర్తీ చేయాలని యోచిస్తున్నట్లు మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీవీ రామన్ తెలిపారు. 2020 ఏప్రిల్ నుంచి బీఎస్ 6 ఉద్గార ప్రమాణాలు కలిగిన కార్లనే విక్రయించాల్సి ఉన్నందున, ఇంజిన్లను మెరుగు పరచాల్సి ఉంది. ఇందువల్ల డీజిల్ చిన్న కార్ల ధరలు భారీగా పెంచాల్సి వస్తుంది కనుక, గిరాకీ తగ్గుతుందనే భావనతో, అమ్మకాలే నిలిపేయాలని ఎంఎస్ఐ గతంలోనే నిర్ణయించింది. ప్రస్తుతం దేశీయంగా విక్రయమవుతున్న మారుతీ కార్లలో డీజిల్ వాటా 23 శాతం కావడం గమనార్హం. 'చిన్న కార్లకు డీజిల్ బదులు సీఎన్‌జీ మంచి ప్రత్యామ్నాయం అవుతుంది. పర్యావరణ హితం కూడా. సీఎన్‌జీ లభ్యత కూడా మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది' అని రామన్ తెలిపారు. ఇకపై పెట్రోల్, సీఎన్‌జీతో పనిచేసే బీఎస్ 6 ఇంజిన్లపైనే దృష్టి సారిస్తున్నట్లు వివరించారు.

సీఎన్‌జీలోనూ ఈ మోడళ్లు లభ్యం: ఆల్టో, ఆల్టో కే10, సెలెరియో, వ్యాగన్‌ఆర్, డిజైర్, ఎర్టిగాతో పాటు తేలికపాటి వాణిజ్య వాహనం సూపర్‌క్యారీ

30 లక్షలు: దేశీయంగా రోడ్లపై ఉన్న సీఎన్‌జీ వాహనాల సంఖ్య

5 లక్షలు: ఎంఎస్ఐ ఇప్పటివరకు విక్రయించిన సీఎన్‌జీ వాహనాలు

రంగాల వారీగా ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపు

- ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదనలు

దిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తోంది. పలు రంగాల్లోకి విదేశీ నిధుల్ని తీసుకొచ్చేందుకు నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చే ప్రతిపాదనల్ని పరిశీలిస్తోంది. త్వరలోనే వీటిపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సింగిల్ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్, డిజిటల్ మీడియా, బొగ్గు, కాంట్రాక్టు తయారీ తదితర రంగాల్లోకి విదేశీ పెట్టుబడిదారుల్ని ఆకర్షించేందుకు నిబంధనల్ని సడలించే యోచనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కేంద్ర కేబినెట్ త్వరలోనే ఈ మార్పులకు తుది ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. కాంట్రాక్టు తయారీ రంగంలోకి 100 శాతం ఎఫ్‌డీఐల్ని అనుమతించేందుకు ప్రతిపాదన సిద్ధమైనట్లు తెలుస్తోంది. భారత్‌లో తయారైన వస్తువుల్ని ప్రభుత్వ అనుమతి లేకుండానే టోకుగా, రిటైల్‌గా విక్రయించడంతోపాటు ఇ-కామర్స్ విధానంలోనూ అమ్ముకొనే వెసులుబాటు ఉంది. అయితే ఈ విధానం కాంట్రాక్ట్ తయారీ రంగంలో లేదు. అంతర్జాతీయంగా ఉన్న పెద్ద పెద్ద సాంకేతిక సంస్థలు ఈ విధానంపై సందిగ్ధత వ్యక్తం చేయడంతో దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వబోతోందని తెలిసింది. ప్రింట్ మీడియా రంగంలోకి 26 శాతం ఎఫ్‌డీఐల్ని మాత్రమే ప్రభుత్వ అనుమతి ద్వారా ఇప్పటి వరకు అనుమతిస్తున్నారు. బ్రాడ్‌కాస్టింగ్ కంటెంట్ సేవల రంగంలోకి 49 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతిస్తున్నారు. సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలోని విదేశీ సింగిల్ బ్రాండ్ రిటైలర్లకు ఇప్పటివరకు ఉన్న 30 శాతం స్థానిక వనరుల్ని తప్పక వినియోగించుకోవాలన్న నిబంధనను కూడా సవరించాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, దుకాణాలు ఏర్పాటు చేయక ముందే, ఆన్‌లైన్‌లోనూ విక్రయాలు జరుపుకొనే వెసులుబాటు కల్పించనుంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 1 శాతం తగ్గి, 44.36 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.3,19,000 కోట్లు) పరిమితమైన నేపథ్యంలో గత జులైలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎఫ్‌డీఐ నిబంధనల్ని సడలిస్తామని ప్రకటించారు. అందులో భాగంగా పలు రంగాలకు ఎఫ్‌డీఐ నిబంధనల్ని సవరించేందుకు ప్రభుతం సిద్ధమైంది.

దేశీయ విపణిలోకి గూగుల్ నెస్ట్ హబ్

లైట్లు, కెమేరా, స్మార్ట్ పరికరాల నియంత్రణ

దిల్లీ: ఇంట్లో కూర్చున్న చోటు నుంచి కదలకుండానే లైట్లు, కెమేరా, స్మార్ట్ పరికరాల వంటివి ఆన్ - ఆఫ్ చేసేందుకు ఉపయోగపడే గూగుల్ నెస్ట్ హబ్ పరికరాన్ని దేశీయ విపణిలోకి గూగుల్ ప్రవేశ పెట్టింది. 7 అంగుళాల తెర, మైక్‌ను ఆపే బటన్ కలిగి, గూగుల్ అసిస్టెంట్‌తో పనిచేసే ఈ పరికరం విలువ రూ.9999 అని గూగుల్ డైరెక్టర్ (ఆసియా పసిఫిక్ వ్యాపారం) మికే కిమ్ తెలిపారు. గూగుల్ సేవలైన వెతుకులాట, క్యాలెండర్, మ్యాప్‌లు, యూట్యూబ్, గూగుల్ ఫోటోల కోసమూ వినియోగించుకోవచ్చని వివరించారు. అంతర్జాతీయంగా 3,500 బ్రాండ్ల (ఎల్‌జీ, ఫిలిప్స్, షియామీ, సిస్కాలైట్స్..)కు చెందిన 20 కోట్ల పరికరాలకు అనుసంధానం అయ్యేలా రూపొందించినట్లు తెలిపారు. స్మార్ట్ పరికరాలకు పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లు, క్రోమ్‌కాస్ట్ (స్ట్రీమింగ్ పరికరం), గూగుల్ హోమ్ (స్మార్ట్ స్పీకర్), గూగుల్ డేడ్రీమ్ వ్యూ (వీఆర్ హెడ్‌సెట్) వంటివి ఇప్పటికే ప్రవేశ పెట్టినట్లు గుర్తు చేశారు.

హైదరాబాద్‌లో రఫేల్ విస్తరణ

- గతంలో కల్యాణి గ్రూపుతో యూనిట్
- తాజాగా ఆస్ట్రా మైక్రోవేవ్‌తో భాగస్వామ్యం
- సంయుక్త సంస్థ ప్రారంభం నేడు
- అత్యాధునిక ఆయుధ సామగ్రి తయారీకి అవకాశం

ఈనాడు, హైదరాబాద్: ఇజ్రాయెల్‌కు చెందిన రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థ రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ మనదేశంలో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందుకు హైదరాబాద్‌ను కేంద్రస్థానంగా చేసుకోవటం ఆసక్తికరమైన అంశం. ఇప్పటికే కల్యాణి గ్రూపుతో కలిసి హైదరాబాద్‌లో తయారీ కార్యకలాపాలను చేపట్టిన ఈ సంస్థ, మరోపక్క స్థానిక డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ అయిన ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రోడక్ట్స్‌తో కలిసి మరో సంయుక్త సంస్థను నెలకొల్పింది. దీని పేరు ఆస్ట్రా రఫేల్ కామ్‌సిస్ ప్రైవేట్ లిమిటెడ్. ఈ సంయుక్త సంస్థకు చెందిన తయారీ యూనిట్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి నేడు ప్రారంభించనున్నారు. మనదేశంలో ఇజ్రాయెల్ రాయబారి రాన్ మల్కా, రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ ప్రెసిడెంట్ సీఈఓ మేజర్ జనరల్ యోవ్ హర్-ఈవెన్ తదితరులు ఈ సందర్భంగా హాజరు కానున్నారు. ఈ యూనిట్లో అత్యాధునిక మిలటరీ గ్రేడ్ ఎస్‌డీఆర్ (సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో) తయారీ సదుపాయాన్ని రఫేల్, ఆస్ట్రా మైక్రోవేవ్ నెలకొల్పాయి. దీనివల్ల నూతన తరం ఆయుధ సామగ్రికి సంబంధించిన ఉపకరణాల తయారీ/ అసెంబ్లింగ్ చేయవచ్చని తెలుస్తోంది.

కల్యాణి గ్రూపు, రఫేల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కలిసి హైదరాబాద్‌లో నెలకొల్పిన కల్యాణి రఫేల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (క్రాస్)కు ఇటీవల బీడీఎల్ (భారత్ డైనమిక్స్ లిమిటెడ్ నుంచి 100 మిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టు లభించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం వెయ్యి యూనిట్ల బరాక్-8 ఎంఆర్ శామ్ క్షిపణి కిట్లను 'క్రాస్' సరఫరా చేయాల్సి ఉంది. బీడీఎల్‌కు అందించే ఈ క్షిపణి ఉపకరణాలకు భవిష్యత్తులో 'సర్వీస్' కూడా చేయాల్సి ఉన్నందున అందుకు అనువుగా హైదరాబాద్ శివార్లలో మరో యూనిట్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్లు, అందుకు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు సాగిస్తున్నట్లు 'క్రాస్' ప్రతినిధులు అప్పట్లో వెల్లడించారు. దీన్నిబట్టి ఇక్కడ రఫేల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ తన భాగస్వామ్య సంస్థల ద్వారా తయారీ కార్యకలాపాలు విస్తరించేందుకు సన్నద్ధం అవుతున్నట్లు స్పష్టమవుతోంది.

ఇజ్రాయెల్‌కు చెందిన ఆయుధ సామగ్రి, ఉపకరణాలు తయారు చేసే సంస్థ అయిన రఫేల్, ఫ్రాన్స్‌కు చెందిన యుద్ధ విమానాల తయారీ సంస్థ అయిన రాఫెల్ రెండూ వేరువేరు సంస్థలు. కానీ పలు సందర్భాల్లో ఈ రెండూ ఒకటే అని అనుకుంటూ ఉంటారు. వాస్తవానికి ఇజ్రాయెల్ సంస్థ

రఫేల్ ఎన్నో ఏళ్లుగా మనదేశంలో కార్యకలాపాలు సాగిస్తోంది. నేరుగా, సంయుక్త సంస్థల ద్వారా ఈ సంస్థ మన రక్షణ బలగాలకు అత్యాధునిక యుద్ధపరికరాలు సరఫరా చేస్తోంది. ఏటా తన ఆదాయాల్లో దాదాపు 8 శాతం సొమ్మును ఇజ్రాయెలీ రఫేల్ పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలపై వెచ్చిస్తోంది. తద్వారా ఎలక్ట్రో-ఆప్టిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, రాడార్/ ఆర్ఎఫ్ టెక్నాలజీస్, ప్రొపల్షన్- ఎక్స్‌ప్లోజివ్స్, బిగ్ డేటా- సైబర్ టెక్నాలజీస్, గైడెన్స్- నావిగేషన్ వంట

సంస్కరణలకు జేజేలు

ప్రభుత్వ ఉద్దీపనలతో మదుపరి ఖుషీ

● వాణిజ్య భయాలు బేఖాతరు ● రూ.2.41 లక్షల కోట్లు పెరిగిన సంపద

ఎఫ్‌పీఐలపై పన్ను సర్‌ఛార్జీ ప్రతిపాదన వెనక్కి తీసుకోవడంతో మార్కెట్‌కు నల్లేరు మీద నడకేనని అందరూ భావించారు. అయితే ఎవరూ ఊహించని విధంగా ప్రారంభంలో మార్కెట్లు తడబడ్డాయి. కానీ అది కొద్దిసేపు మాత్రమే.. అనంతరం అంతర్జాతీయ ప్రతికూలతలను అధిగమించిన సూచీలు కొనుగోళ్లతో కళకళలాడాయి. సెన్సెక్స్, నిఫ్టీలు మళ్లీ కీలక స్థాయిలను అందుకున్నాయి. మొత్తం మీద సోమవారం మార్కెట్లు మదుపరిలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి ప్రభుత్వం ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించడంతో మార్కెట్లు ఉరకలేశాయి. అమెరికా- చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, రూపాయి క్షీణత.. ఇవన్నీ బుల్ పరుగులో కొట్టుకుపోయాయి. సెన్సెక్స్ మూడు నెలల్లోనే అతిపెద్ద ఒక రోజు లాభాన్ని నమోదు చేయగా, నిఫ్టీ కీలకమైన 11,000 పాయింట్ల ఎగువకు చేరింది. అమెరికా-చైనా వాణిజ్య చర్చలు మళ్లీ ప్రారంభం కావొచ్చన్న అంచనాలు కలిసొచ్చాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 36 పైసలు తగ్గి 72.02 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి. బీఎస్‌ఈలో మదుపర్ల సంపదగా పరిగణించే నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.41 లక్షల కోట్లు పెరిగి రూ.140.34 లక్షల కోట్లకు చేరింది.

-208 నుంచి +843కు

ప్రభుత్వ ఉద్దీపనలతో సెన్సెక్స్ ఉదయం 37,363.95 పాయింట్ల వద్ద మంచి జోరు మీద ప్రారంభమైంది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాల నేపథ్యంలో కుదేలైన సూచీ.. కొద్దిసేపటికే 36,492.65 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. అప్పటికి సెన్సెక్స్ 208 పాయింట్లు కోల్పోయింది. అక్కడ నుంచి బలంగా పుంజుకుని.. మళ్లీ వెనక్కి తిరిగి చూడలేదు. ఇంట్రాడేలో 843 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్ 37,544.48 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 792.96 పాయింట్ల లాభంతో 37,494.12 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 228.50 పాయింట్లు దూసుకెళ్లి 11,057.85 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,756.55- 11,070.30 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ ప్రభుత్వం రూ.70,000 కోట్ల మూలధన సాయం ప్రకటించడంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు రాణించాయి. సెంట్రల్ బ్యాంక్ 10.08%, అలహాబాద్ బ్యాంక్ 8.33%, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 5.98%, బ్యాంక్ ఆఫ్ ఇండియా 3.96%, యూనియన్ బ్యాంక్ 3.62%, ఎస్‌బీఐ 3.38%, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 3.46%, కెనరా బ్యాంక్ 3.39%, బ్యాంక్ ఆఫ్ బరోడా 1.71% చొప్పున లాభాలు నమోదు చేశాయి.

ఈనాడు బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ
▲ 793	▲ 229
37494	11058

జోరుకు కొన్ని కారణాలు

అమెరికా- చైనా చర్చలు

అమెరికా- చైనా మధ్య ఆగిపోయిన వాణిజ్య చర్చలు మళ్లీ ప్రారంభం కావొచ్చన్న అంచనాలు మార్కెట్లకు కలిసొచ్చాయి. జీ-7 దేశాల సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇందుకు సంకేతాలు ఇవ్వడం సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది.

ఉద్దీపన ప్యాకేజీ

జీడీపీ వృద్ధి పుంజుకోవడానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్దీపనలు ప్రకటించడం మదుపర్లను మెప్పించింది. ఎఫ్‌పీఐలపై పన్ను సర్‌ఛార్జీ ప్రతిపాదన ఉపసంహరణ, ఎన్‌బీఎఫ్‌సీలకు నగదు లభ్యత, వాహన రంగానికి ఉపశమన చర్యలు సానుకూల ప్రభావం చూపాయి.

మూలధన సాయం

ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.70,000 కోట్ల మూలధన సాయం అందించనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించడంతో ఈ రంగ షేర్లు రాణించాయి.

లాభపడ్డాయి ఇవే..		నష్టాలు వీటికే..	
యెస్ బ్యాంక్	+6.33%	టాటా స్టీల్	-2%
హెచ్‌డీఎఫ్‌సీ	+5.24%	సన్‌ఫార్మా	-1.96%
బజాజ్ ఫైనాన్స్	+4.66%	హీరో మోటో	-1.92%
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	+4.29%	వేదాంతా	-1.82%
ఐసీఐసీఐ బ్యాంక్	+4.09%	రిలయన్స్	-0.79%
ఎల్ అండ్ టీ	+3.63%	టాటా మోటార్స్	-0.58%

హైదరాబాద్‌లో వన్‌ప్లస్ ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేటీఆర్. చిత్రంలో వన్‌ప్లస్ ఇండియా జీఎం వికాస్ అగర్వాల్, తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, వన్‌ప్లస్ వ్యవస్థాపకుడు, సీఈఓ పీట్ లావ్, హైదరాబాద్ కేంద్రం హెడ్ రామగోపాల రెడ్డి.

మూడేళ్లలో రూ.1,000 కోట్ల పెట్టుబడి

● హైదరాబాద్‌లో వన్‌ప్లస్ ఆర్‌అండ్‌డీ కేంద్రం

● 1,500 సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ● ఏడాదిలోగా 5జీ ఫోన్లు

ఈనాడు, హైదరాబాద్: చైనాకు చెందిన ప్రీమియం స్మార్ట్ ఫోన్ల సంస్థ వన్‌ప్లస్ భారత్‌లో తన తొలి పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించింది. ఈ ఆర్‌అండ్‌డీ కేంద్రంపై రానున్న మూడేళ్ల కాలంలో రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టబోతున్నట్లు వన్‌ప్లస్ ప్రకటించింది. సోమవారం హైదరాబాద్ నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మాజీ మంత్రి, టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి.రామారావు ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ 200 మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు ఉండగా.. మూడేళ్లలో వీరి సంఖ్య 1,500లకు చేరనుంది. పూర్తిస్థాయిలో విస్తరించాక, అంతర్జాతీయంగా వన్‌ప్లస్‌కు ఉన్న అభివృద్ధి కేంద్రాల్లో ఇది అతి పెద్దదిగా మారనుందని వన్‌ప్లస్ వ్యవస్థాపకుడు, సీఈఓ పీట్ లావ్ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వన్‌ప్లస్‌కు అవసరమైన కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, 5జీ, ఐఓటీ సేవలు ఇక్కడ్నుంచి అందుతాయని తెలిపారు. కెమేరా అభివృద్ధి, నెట్‌వర్కింగ్, ఆటోమేషన్ ల్యాబ్‌లను ఇందులో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఆక్సిజన్ ఓఎస్‌కు సంబంధించిన అభివృద్ధి, నెట్‌వర్క్, సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్, టెస్టింగ్‌లాంటివీ ఇక్కడ జరగనున్నాయని వెల్లడించారు. ఇందులో కెమేరా ల్యాబ్ ఏర్పాటు కోసం రూ.100 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఏడాదిలోపు 5జీ ఫోన్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది చివరికల్లా రాబోతున్న వన్‌ప్లస్ టీవీలకూ హైదరాబాద్ ఆర్‌అండ్‌డీ కేంద్ర సహాయం అందుతుందని తెలిపారు.

వన్‌ప్లస్ ఇండియా జనరల్ మేనేజర్ వికాస్ అగర్వాల్ మాట్లాడుతూ.. దేశంలో అతి పెద్ద 'ఎక్స్‌పీరియెన్స్ సెంటర్'ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ఇది 16,000 చదరపు అడుగుల్లో ఉండబోతోందని చెప్పారు. ఇక్కడి ఆర్‌అండ్‌డీ కేంద్రం 5 అంతస్తుల్లో 1,86,000 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుభవం ఉన్న వారితోపాటు, ఐఐటీలు, ఎన్ఐటీల నుంచి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా 100 మందిని తీసుకునేందుకు ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి కేంద్రం నుంచి అభివృద్ధి చేసిన వర్క్‌లైఫ్ బ్యాలెన్స్, ఎస్ఎంస్‌లను విభజించడంలాంటి వాటిని ఫోన్లలో అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించిందని తెలిపారు. నోయిడా కేంద్రంలో సామర్థ్యం మించి పోయినందున వన్‌ప్లస్ తమ రెండో ఉత్పత్తి కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించే విషయాన్ని పరిశీలించాలని కోరారు.

పాత బంగారం మార్చేసుకుంటున్నారు

● మొత్తం విక్రయాల్లో 40 శాతం ఇవే ● దిగుమతులు తగ్గినా, దేశీయ అమ్మకాలు భేష్

● ధర పెరిగితే వినియోగదార్లకు సంతోషమే ● ప్రస్తుత స్థాయుల్లో దిద్దుబాటు రావచ్చు

● ఆభరణాలకు 4 రకాల భరోసా ఇస్తున్నాం

'బంగారం ధర పెరిగితే అమ్మకాలు తగ్గిపోతాయనుకుంటారు. దిగుమతులు తగ్గుతాయేమో కానీ, పాత బంగారం మార్పిడితో, అమ్మకాలు అధికంగానే జరుగుతున్నాయి. దేశంలో ప్రతి కుటుంబం వద్ద ఎంతో కొంత బంగారం ఉండే ఉంటుంది. అందువల్ల ధర పెరిగితే, మా సంపద వృద్ధి చెందిందనే సంతోషం వారికి ఉంటుంది. ఫలితంగా స్థోమత ఉన్న వారు మరింత బంగారం కొందామనే చూస్తున్నారు. మా సంస్థ 26 ఏళ్ల అనుభవంలో ఈ సంగతి రుజువైంది' అని కల్యాణ్ జువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) రమేశ్ కల్యాణ్‌రామన్ పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆయన పరిశ్రమ తీరుతెన్నులు, సంస్థ వ్యూహాలను 'ఈనాడు' ఇంటర్వ్యూలో వివరించారు. ముఖ్యాంశాలివీ..

ఈనాడు ఇంటర్వ్యూ
కల్యాణ్ జువెలర్స్ ఈడీ
రమేశ్ కల్యాణరామన్

? బంగారం ధర జూన్ నుంచి ఇప్పటికి 17 శాతం పెరిగింది. 10 గ్రాముల మేలిమి బంగారం రూ.40,000 సమీపానికి చేరింది. ధరలపై మీ అంచనా ఏమిటి

బంగారం ధర బాగా పెరిగిన మాట వాస్తవం. ఇందుకు అంతర్జాతీయ అంశాలే కారణం. వాణిజ్య ఉద్రిక్తతల వల్ల ఇతర రంగాల్లో పెట్టుబడులపై నష్టం వస్తుంటే, సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి, పసిడిలోకి పెట్టుబడులు మళ్లిస్తున్నారు కనుక, అంతర్జాతీయంగా ధర పెరిగింది. దీనికితోడు రూపాయితో పోలిస్తే, డాలర్ మారకపు విలువ అధికమైంది కనుక, దేశీయంగా ధర బాగా పెరిగింది. పన్నుల రూపేణ 15.5 శాతం (కస్టమ్స్ 12.5 శాతం + వస్తు సేవల పన్ను 3 శాతం) జతచేరుతుంది కనుక, అంతర్జాతీయంగా పోలిస్తే, ఇక్కడ మరింత అధికంగా కనపడుతోంది. అంతర్జాతీయంగా ప్రసిద్ధ పెట్టుబడి దారులు బంగారం ధర మరింత పెరుగుతుందనే చెబుతున్నారు. కానీ ప్రస్తుత స్థాయిల్లో కొంత దిద్దుబాటు రావచ్చు. ఆ తరవాత ధరలు పెరగడం ప్రారంభవుతాయన్నది మా అంచనా. పాత బంగారం మార్చుకోకుండా, కొత్తగా బంగారం కొనడం భారమే అయినా వివాహాల కోసమే తప్పనిసరిగా కొంటున్నవారే ఎక్కువగా ఉంటున్నారు. ధర మరింత పెరుగుతుందనే భావనతో కొందరు కొంటున్నారు.

? ధర ఇంతగా పెరగడం వల్ల, అమ్మకాలపై ప్రభావం ఎలా ఉంది

గత ఆర్థిక సంవత్సరంలో కల్యాణ్ జువెలర్స్ సుమారు రూ.10,600 కోట్ల వ్యాపారం నిర్వహించింది. ఈ ఏడాది రూ.11,000 కోట్లకు చేరుకుంటుందని భావిస్తున్నాం. ధరలు ఇంత అధికంగా పెరిగినందున, కొనుగోళ్లు తగ్గుతాయని అందరూ భావిస్తారు. కానీ ప్రజలు తమ దగ్గర వారసత్వంగా వచ్చిన, గతంలో కొనుగోలు చేసిన ఆభరణాలు మార్చుకుని, కొత్తవి కొనుగోలు చేసుకుంటున్నారు. మొత్తం అమ్మకాల్లో ఈ విభాగం వాటా 30 శాతం ఉండేది. 3 నెలల వ్యవధిలోనే ఇది 40 శాతానికి చేరింది. పండుగ సీజన్‌కు 45 శాతానికి చేరుతుందని భావిస్తున్నాం. 22 క్యారెట్ల (916 స్వచ్ఛత) ఆభరణాలు తెస్తే, పరీక్షించి, అంతే నాణ్యమైన ఆభరణాలు ఇస్తున్నాం. తయారీ ఛార్జీలు (జతచేరిన విలువ -వీఏ) వంటివి భరిస్తే సరిపోతుంది. నగదు బదులు పాత బంగారం తెస్తున్నందున, మా అమ్మకాలు తగ్గడం లేదు. పైగా పెరుగుతున్నాయి.

? కొత్త పెట్టుబడి ప్రణాళికలు వివరిస్తారా

కల్యాణ్ జువెలర్స్ నిర్వహిస్తున్న 138 విక్రయశాలల్లో 104 దేశీయంగా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో చూస్తే, తెలంగాణలో 4, ఆంధ్రప్రదేశ్‌లో 9 విక్రయశాలలున్నాయి. హైదరాబాద్‌లో తాజాగా అతిపెద్ద విక్రయశాల ప్రారంభించాం. రాబోయే నెల రోజుల్లో వాసి (ముంబయి), అబుదాబి, షార్జాలలో మరో 3 విక్రయశాలలు ప్రారంభించబోతున్నాం. వీటిపై రూ.125 కోట్ల పెట్టుబడి పెడుతున్నాం. ప్రాంతానికి అనుగుణంగా డిజైన్ల రూపకల్పనతో పాటు, వాటిపై ప్రజలకు సులభంగా తెలియ చెప్పేందుకే, ఆయా ప్రాంతాల్లో స్థానిక సెలెబ్రిటీలను ప్రచారకర్తలుగా నియమించుకుంటున్నాం.

? తెలుగు రాష్ట్రాల్లో ప్రజల కొనుగోలు ధోరణి ఎలా ఉంది

మొత్తం అమ్మకాల్లో దక్షిణ భారతదేశ వాటా 50 శాతం ఉంటే, మిగిలిన 50 దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశీ శాఖల నుంచి వస్తోంది. బంగారాన్ని వివాహాది శుభకార్యాలు, పండుగలు, వేడుకల సందర్భంగా, జ్ఞాపకంగా కొనుగోలు చేసే సంస్కృతి ఇక్కడ ఉంది. రైతు కుటుంబాల్లో ఇది మరింత అధికం. అందువల్ల ప్రతి కుటుంబం దగ్గర బంగారు ఆభరణాలు ఉంటాయి. పసిడి ధర పెరిగితే, తమ సంపద మరింత అధికమైందనే సంతోషమే వినియోగదారుల్లో చూస్తున్నాం. మరింతగా ప్రోది చేసేందుకు ఇది కారణమవుతోంది. ఆర్థిక మందగమనం ఉన్నా, శక్తిమేర తమ కుటుంబంలోని మహిళలకు బంగారం కొనుగోలు చేయడం ఆగదు. ఇదే గిరాకీ కొనసాగడానికి హేతువు. రత్నాభరణాలను తీసుకుంటే, రాళ్ల విలువ ఏమీ మారలేదు కనుక, వాటి రూపేణ భారం పడదు. పాత బంగారం తెచ్చుకుని, అంతకు సరిపడా బంగారంతో చేసినవి కొనుగోలు చేసుకుంటుంటారు.

? విదేశాల్లో పెట్టుబడిని ప్రధానంగా పెట్టుబడి సాధనంగా చూస్తారు. మన దగ్గర ఆభరణాల రూపంలో కొనేందుకు, పన్నులకు అదనంగా తయారీ ఛార్జీల రూపంలో 25 శాతం వరకు అదనపు భారం పడుతోంది. ఇది బాగా ఎక్కువ కదా

సులువుగా రూపొందించగలిగే ఆభరణాలు కనుకే గతంలో తయారీ ఛార్జీలు తక్కువగా ఉండేవి. రోజువారీ వినియోగించే గాజులను ఒక వ్యక్తి, ఒక రోజులో పూర్తి చేస్తారు కనుక, ఇప్పుడైతే వాటికి వీఏ తక్కువే. అదే పోల్కీ ఆభరణం తీసుకుంటే, ఒక వ్యక్తి 35 రోజుల పాటు శ్రమించాల్సి వస్తుంది. టెంపుల్, యాంటిక్ జువెలరీ వంటి సంక్లిష్ట డిజైన్లలో రూపొందే ఆభరణాలన్నింటికీ ఇంతే. అందువల్ల తయారీఛార్జీలు ఎంత ఉన్నా, విక్రయదార్లకు మిగిలే మార్జిన్లు ఒకే విధంగా ఉంటాయి. మా విక్రయశాలల్లో 3 శాతం నుంచీ తరుగు వసూలు చేస్తున్నాం.

? ఆభరణాల కొనుగోలుదార్లకు 4 అంచెల భరోసా కార్డులు ఇస్తున్నామంటున్నారు. ప్రత్యేకత ఏమిటి

కొనుగోలుదార్లకు 4 విధాల భరోసా

అది. 1. బంగారం స్వచ్ఛతకు భరోసా ఇస్తాం. 2. ఆభరణం తయారీలో బంగారంతో పాటు విలువైన రాళ్లు, వ్యాక్స్, ఎనామిల్ వంటివి వాడతారు. కేవలం బంగారం బరువుకే వసూలు చేస్తాం. 3. కొంతకాలం వినియోగించుకున్నాక విక్రయించ దలచినా, మార్చుకోవాలనుకున్నా, ఎంత విలువ లభిస్తుందో నిర్ధారించి, కొనుగోలు సమయంలోనే వెల్లడిస్తాం. మార్పిడికి అయితే బంగారానికి, అంతే బరువు ఇచ్చేస్తాం. తిరిగి కొనుగోలుకు 2 శాతం తగ్గిస్తాం. 4. ఆభరణాల్లో రాళ్లు పోవడం, ఇతర మరమ్మతులకు జీవితకాలం ఉచితంగా సేవ ఇస్తాం. అదనపు సామగ్రి ఏదైనా పడితే, ఆ ధర చెల్లిస్తే సరిపోతుంది.

? యువత ఆన్‌లైన్ కొనుగోళ్లు చేస్తున్నారా

మా అమ్మకాల్లో 50 శాతం వివాహాలకు ప్రత్యేకించిన ముహూరత్ శ్రేణి నుంచే వస్తున్నాయి. ఆన్‌లైన్ అమ్మకాల వాటా తక్కువే. ఇది కూడా యువత మాత్రమే చేస్తున్నారు. సగటు విక్రయ విలువ రూ.15,000 ఉంటుంది. దూరప్రాంతాల్లోని కుటుంబసభ్యులు, సన్నిహితులకు బహుమతిగా ఇచ్చేందుకు ఈ సదుపాయాన్ని వాడుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా సరఫరా చేసేందుకు కొరియర్ కంపెనీలతో ఒప్పందం చేసుకుని, సరఫరా చేస్తున్నాం. యువతను ఆకట్టుకునేందుకు డిజిటల్ విభాగాలపై ప్రకటనలకు 15 శాతం వెచ్చిస్తున్నాం. ముద్రణ, టీవీ, బహిరంగ ప్రకటనలకే 85 శాతం వ్యయం చేస్తున్నాం.

– ఈనాడు వాణిజ్య విభాగం

హ్యుందాయ్, కియా కార్లలో ఇ-స్కూటర్!

● 20 కిలోమీటర్ల ప్రయాణానికి వీలు

● గరిష్ఠవేగం 20 కిలోమీటర్లు

● కారు వెళ్తున్నపుడే ఛార్జింగ్ కూడా

సెలవురోజు.. కారేసుకుని షాపింగ్ బయలుదేరాడు విహాన్. మాల్స్ ఇంకా 3 కిలోమీటర్ల దూరం ఉండగానే ట్రాఫిక్ జామ్.. దూరాన్నుంచే గమనించి, ప్రత్యామ్నాయ మార్గంలోకి వెళ్లి, అక్కడ ఉన్న పార్కింగ్‌లో తన కారు నిలిపాడు. అందులోంచి, చిన్నపాటి ఎలక్ట్రిక్ స్కూటర్ తీసి, కార్ల మధ్యలోంచే దూసుకెళ్లాడు.. భవిష్యత్తులో హ్యుందాయ్, కియా కార్ల వినియోగదార్లకు ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది. ఎందుకంటే వారి కార్లలోనే అతి తక్కువ బరువుతో ఉండే ఇ-స్కూటర్‌ను పొందుపరచనున్నారు. ఇరుకు మార్గాల్లో ప్రయాణానికి, పర్యావహరణ హితంగా దీన్ని వినియోగించుకోవచ్చు. హ్యుందాయ్ మోటార్ గ్రూప్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం..

సంస్థ సరికొత్త ప్రోటోటైప్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఆవిష్కరించింది. వెనుక చక్రం సాయంతో ప్రయాణించే ఈ స్కూటర్‌కు 10.5 యాంపియర్ల లిథియం బ్యాటరీ ఉంటుంది. దీనిసాయంతో గంటలకు 20 కిలోమీటర్ల దూరం వరకు, గరిష్ఠంగా 20 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చు. ముందు, వెనుక లైట్లు కూడా ఉన్నందున, చీకటిలో కూడా ఇబ్బంది ఉండదు. ముందు చక్రానికి ఉన్న సస్పెన్షన్ వల్ల ప్రయాణం సాఫీగా ఉంటుంది. ఈ స్కూటర్‌ను భవిష్యత్తులో హ్యుందాయ్, కియా కార్లలో అమర్చుతారు. కారు వెళ్లేప్పుడే, ఈ స్కూటర్ బ్యాటరీ ఛార్జ్ అవుతుంది. 7.7 కిలోల బరువు మాత్రమే ఉండే ఈ స్కూటర్‌ను మడత పెట్టేయవచ్చు. అందువల్ల కారులో ఎక్కువ చోటునూ ఆక్రమించదు. బ్యాటరీ ఛార్జింగ్ ఎంత ఉంది, ఎంత సేపు వస్తుంది, ఎంతవేగంతో వెళ్తోందీ తెలిపే సూచికలు కూడా ఉంటాయి.

– ఈనాడు వాణిజ్య విభాగం

కశ్మీర్ ద్వైపాక్షిక అంశమే

- అంగీకరించిన ట్రంప్
- మోదీ సమక్షంలో ప్రకటన
- మధ్యవర్తిత్వానికి తావులేదని తేల్చిచెప్పిన ప్రధాని

ఫ్రాన్స్‌లోని బియరజ్‌లో సోమవారం జర్మనీ ఛాన్సలర్ మెర్కెల్‌తో మాట్లాడుతున్న మోదీ

బియరజ్/ లండన్: కశ్మీర్ అంశంలో భారత్ దౌత్యపరంగా పెద్ద విజయాన్ని నమోదు చేసింది. ఈ సమస్యపై భారత్, పాకిస్థాన్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేస్తానంటూ పదేపదే చెబుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను తీరు మార్చుకునేలా ఒప్పించగలిగింది. కశ్మీర్ అంశాన్ని భారత్, పాక్‌లు ద్వైపాక్షికంగా చర్చించుకొని పరిష్కరించుకుంటాయని స్వయంగా ఆయనే చెప్పారు. ఫ్రాన్స్‌లోని బియరజ్ పట్టణంలో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అనంతరం సోమవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్-పాకిస్థాన్‌ల మధ్య తృతీయ పక్ష మధ్యవర్తిత్వానికి ఎలాంటి ఆస్కారం లేదని ప్రధాని తేల్చి చెప్పారు. ట్రంప్ ఏకీభవించారు.

జమ్మూ-కశ్మీర్‌లో ప్రత్యేక ప్రతిపత్తి రద్దు, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో భారత్, పాక్‌ల మధ్య మాటల యుద్ధం పెరిగిన సంగతి తెలిసిందే. ఈ వివాదం చుట్టూ ఉన్న ప్రాంతీయ రాజకీయాలు అంతర్జాతీయ వేదికలపైకి చేరాయి. ఈ వివాద పరిష్కారం కోసం తాను మధ్యవర్తిత్వం వహిస్తానని ట్రంప్ పదేపదే చెప్పారు. ఈ నేపథ్యంలో మోదీ, ట్రంప్‌ల మధ్య జరిగిన భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కశ్మీర్ అంశంపై మోదీతో చర్చిస్తానని అంతకుముందు ట్రంప్ చెప్పడం ఇక్కడ ప్రస్తావనార్హం. సమావేశం అనంతరం ఇద్దరు నేతలు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. మోదీ మాట్లాడుతూ.. భారత్-పాక్ చర్చించుకొని ద్వైపాక్షికంగా అన్ని సమస్యలనూ పరిష్కరించుకోగలవని స్పష్టంచేశారు. ఈ విషయంలో 'మూడో దేశాన్ని మేం ఇబ్బంది పెట్టదలచుకోలేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. 1947కు ముందు రెండు దేశాలూ కలసి ఉండేవని గుర్తుచేశారు. "పాక్‌లో ఎన్నికల తర్వాత ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు నేను ఫోన్ చేశా. భారత్, పాక్‌లు పేదరికం, నిరక్షరాస్యత, వ్యాధులపై పోరాటం చేయాల్సి ఉందని చెప్పా. ఇరు దేశాల ప్రజల సంక్షేమం కోసం మనం కలసి పనిచేయాలని సూచించా" అని పేర్కొన్నారు. ట్రంప్ మాట్లాడుతూ.. కశ్మీర్ అంశంపై మోదీ, తాను సుదీర్ఘంగా చర్చించుకున్నామని తెలిపారు. అక్కడ పరిస్థితి అదుపులో ఉందని మోదీ చెప్పారన్నారు. "వారు పాకిస్థాన్‌తో మాట్లాడి మంచి జరిగేలా ఏదో ఒకటి చేస్తారని నాకు నమ్మకం ఉంది. మోదీ, ఇమ్రాన్‌లతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. సమస్యను వారే పరిష్కరించుకోగలరనుకుంటున్నా" అని పేర్కొన్నారు.

'డిజిటల్‌తో అసమానతల తొలగింపు: మోదీ

భారత్‌లో సామాజిక అసమానతల నిర్మూలనకు డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జీ7 దేశాల కూటమి సదస్సులో డిజిటల్ మార్పులు అన్న అంశంపై ప్రసంగించారు. డిజిటల్ చెల్లింపుల్లో చేపట్టిన నూతన ఆవిష్కరణలను వివరించారు. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన ఆవశ్యతను జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. సదస్సులో భాగంగా 'జీవ వైవిధ్యం, మహాసముద్రాలు, పర్యావరణం' అంశంపై జరిగిన సదస్సులో జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. మోదీ స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యారు.

అమెజాన్ అడవుల్లో చెలరేగిన మంటలను అదుపు చేయడానికి 22 మిలియన్ డాలర్లు (సుమారు రూ.154 కోట్లు) కేటాయించాలని జీ7 నేతలు తీర్మానించారు. అక్కడ అడవుల పెంపకం కోసం బ్రిటన్ 12.3 మిలియన్ డాలర్ల (రూ.86 కోట్లు) సాయం చేస్తుందని ఆ దేశ ప్రధాని బోరిస్ జాన్సన్ తెలిపారు. హాలీవుడ్ నటుడు డికాప్రియోకు చెందిన 'ఎర్త్ అలయెన్స్' అనే స్వచ్ఛంద సంస్థ రూ.36 కోట్లు విరాళాన్ని ప్రకటించింది.

మోదీ ఆంగ్లంలో బాగా మాట్లాడగలరు కానీ..: ట్రంప్

విలేకర్ల సమావేశంలో మోదీ, ట్రంప్ మధ్య సరదా వ్యాఖ్యలు సాగాయి. మోదీ ఆంగ్లంలో అద్భుతంగా మాట్లాడగలరని, అయినా ఆ భాషలో మాట్లాడటం ఆయనకు ఇష్టం ఉండదంటూ ట్రంప్ చలోక్తి విసిరారు. దీంతో ఆ గదిలో ఉన్నవారంతా ఒక్కసారిగా నవ్వేశారు. ఇదే సమయంలో ఇద్దరు నేతలు పరస్పరం కరచాలనం చేసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. మరోవైపు మోదీ-ట్రంప్ భేటీ.. పాక్‌కు చావు దెబ్బ అని భాజపా అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు వ్యాఖ్యానించారు.

చిదంబరం సీబీఐ కస్టడీ పొడిగింపు

దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరానికి విధించిన సీబీఐ కస్టడీని దిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం మరో నాలుగు రోజులు పొడిగించింది. ఈ నెల 30 వరకూ ఆయనను విచారించేందుకు సీబీఐని అనుమతిస్తూ, ప్రత్యేక న్యాయమూర్తి అజయ్‌కుమార్ కుహర్ సోమవారం ఆదేశాలు జారీచేశారు. ఇదే కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ చిదంబరం పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. పిటిషనర్‌ను ఇప్పటికే సీబీఐ అరెస్టు చేసి, కస్టడీలోకి తీసుకున్నందున... 'ఈ పిటిషన్ వృథా' అని వ్యాఖ్యానించింది. చిదంబరం తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సంఘ్వి వాదనలు వినిపించారు.

★ 'ఐఎన్ఎక్స్ మీడియా నగదు అక్రమ చలామణి కేసు'లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు నుంచి చిదంబరానికి మంగళవారం వరకూ సుప్రీంకోర్టు ధర్మాసనం మినహాయింపు ఇచ్చింది.

రూపాయికే 'సువిధ' శానిటరీ నాప్కిన్

దిల్లీ: మహిళలకు 'సువిధ' పేరుతో జన్ ఔషధి కేంద్రాల ద్వారా రూ.2.50కే విక్రయిస్తున్న ఒక్కో శానిటరీ నాప్కిన్‌ను... ఇక నుంచి కేవలం రూపాయికే అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

సముద్ర మార్గంలో దాడులకు 'జైష్' పన్నాగాలు

పుణె: పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలు సాగించే జైష్ ఎ మహ్మద్ ముఠాలో 'జలాంతర విభాగం' ఏర్పాటైందని నౌకాదళాధిపతి అడ్మిరల్ కరంబీర్ సింగ్ తెలిపారు. సముద్రంలో దాడులు చేయడానికి ముష్కరులకు శిక్షణ ఇస్తున్నట్లు నిఘా సమాచారం అందిందన్నారు. సాగరమార్గంలో చొరబాట్లు లేకుండా చూసేందుకు తీర రక్షణకు సంబంధించిన అన్ని విభాగాలూ చర్యలు చేపట్టాయని పేర్కొన్నారు.

★ నిషిద్ధ జమాతుల్ ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జేఎంబీ) ఉగ్రవాద ముఠా నాయకుడు ఎజాజ్ అహ్మద్ అలియాస్ అమిర్‌ను బిహార్‌లోని గయా జిల్లాలో పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు.

కశ్మీర్ అంశాన్ని లేవనెత్తుతా: ఇమ్రాన్

ఇస్లామాబాద్: కశ్మీర్ అంశాన్ని ఐరాస సర్వప్రతినిధి సభ సహా అంతర్జాతీయ వేదికలన్నింటిపైనా లేవనెత్తుతానని పాకిస్థాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ చెప్పారు. ఈ అంశంలో పాక్ దుందుడుకు వైఖరిని అవలంబించినప్పటికీ అంతర్జాతీయంగా పెద్దగా స్పందన లేని నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. కశ్మీర్‌లో ఆంక్షలను భారత్ తొలగించే వరకూ కశ్మీరీలకు మద్దతుగా ఉంటామని పాక్ ప్రజలకు భరోసా ఇస్తున్నట్లు చెప్పారు.

ఈపీఎఫ్‌వోలో త్వరలో ఈ-ఇన్‌స్పెక్షన్ వ్యవస్థ

బెంగళూరు: ఈపీఎఫ్‌కు అర్హత కలిగిన ఉద్యోగులందరికీ కల్పించే 12 అంకెల విశ్వజనీన ఖాతా సంఖ్య యూఏఎన్‌ను డేటాబేస్‌తో సరిపోలని సమస్యను పలువురు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పరిష్కారం ఆలోచిస్తున్నట్లు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) తెలిపింది. యూఏఎన్ సంఖ్య ఆధార్‌తో అనుసంధానమై, బ్యాంకు ఖాతా, మొబైల్ నంబర్ నమోదై, కేవైసీ కలిగిన లబ్ధిదారులకు మూడు రోజుల్లో సెటిల్మెంట్ జరిగే దిశగా ఈపీఎఫ్‌వో కృషి చేస్తోందని వెల్లడించింది.

మన్మోహన్‌కు ఎస్పీజీ భద్రత ఉపసంహరణ

దిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు దేశంలో అత్యున్నత స్థాయి రక్షణ కవచమైన ప్రత్యేక భద్రత బృందాన్ని(ఎస్పీజీ) ఉపసంహరించారు. మాజీ ప్రధానికి ఇకపై జడ్ ప్లస్ భద్రత కొనసాగుతుందని కేంద్ర హోంశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. వివిధ భద్రతా సంస్థలు సమీక్ష చేపట్టిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. దిల్లీలోని మన్మోహన్ నివాసం నుంచి ఎస్పీజీ దళాన్ని ఉపసంహరించిన తర్వాత కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో(సీఏపీఎఫ్) ఒక విభాగానికి జడ్ ప్లస్ భద్రతా బాధ్యతల్ని అప్పగించే అవకాశం ఉందని, కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్పీఎఫ్) బలగాలకు ఆ బాధ్యత అప్పగించవచ్చన్నారు. మన్మోహన్‌కు ఎస్పీజీ భద్రతను ఉపసంహరించడంతో ఇకపై ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ కుటుంబానికి మాత్రమే ఈ తరహా రక్షణ లభించనుంది. మన్మోహన్ రాజకీయంగా క్రియాశీలంగా ఉన్నారని, ఆయనకు ఎస్పీజీ భద్రత ఉపసంహరణ ప్రభుత్వం నైతిక దిగజారుడుకు నిదర్శనమని కాంగ్రెస్ అధికారప్రతినిధి సంజయ్‌ఝా విమర్శించారు.

22 మంది పన్ను అధికారులకు నిర్బంధ పదవీ విరమణ

దిల్లీ: అవినీతి, ఇతరత్రా ఆరోపణలు ఎదుర్కొంటున్న 22 మంది పన్ను అధికారులకు కేంద్రం నిర్బంధ పదవీ విరమణను ప్రకటించింది. వారంతా సూపరింటెండెంట్ ర్యాంకు ఆఫీసర్లేనని అధికార వర్గాలు వెల్లడించాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు 'కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల మండలి'(సీబీఐసీ) జూన్ నుంచీ నిర్బంధ పదవీవిరమణ నివ్వడం ఇది మూడోసారని పేర్కొన్నాయి. ఇదివరకు ఇలాగే నిర్బంధ పదవీ విరమణకు గురైన వారిలో అత్యున్నత స్థాయి ఐఆర్ఎస్ అధికారులున్న విషయం గమనార్హం.

చుక్‌చుక్ బండి కాదు.. చదువుల ఒడి!

చిత్రంలోని చిన్నారులు రైలెక్కుతూ తమ ఆప్తులకు టాటా చెప్తున్నట్టు కనిపిస్తోంది కదూ..! నిజానికి వారు తమ పాఠశాలలోనే ఉన్నారు. రాజస్థాన్‌లోని బీకానేర్‌లో మహారాణి బాలికల మాధ్యమిక పాఠశాల తరగతి గదులకు రైలు బోగీలను తలపించేలా రంగులు వేయడంతో సోమవారం ఇలాంటి 'చిత్రం' ఆవిష్కృతమైంది.

ఉల్లిని మార్కెట్‌లోకి తీసుకురండి: కేంద్రం

దిల్లీ: దేశంలో ఉల్లి ధరలు పెరగకుండా ఉండేందుకు 50,000 టన్నుల కేంద్ర అత్యవసర నిల్వలను (బఫర్ స్టాక్) విడుదల చేయాలని, మార్కెట్‌లోకి సరఫరాను పెంచాలని కేంద్ర ఆహార శాఖ మంత్రి రామ్‌విలాస్ పాసవాన్ సోమవారం రాష్ట్రాలను కోరారు. ఉల్లి పంట ఎక్కువగా సాగయ్యే కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో వరదలు సంభవించడంతో సరఫరా పడిపోయింది. ఈ నేపథ్యంలో దిల్లీ సహా దేశంలోని పలు నగరాల్లో ధరలకు రెక్కలొచ్చాయి. కేజీ రూ.40 నుంచి రూ.45కు ధర పెరిగింది.

జన భవితకు జల భద్రత

- కొత్తగా జల సామర్థ్య బ్యూరో ఏర్పాటు
- కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్ణయం

ఈనాడు, దిల్లీ: జల సంరక్షణ కోసం ఇప్పటికే సంకల్పం తీసుకున్న కేంద్రప్రభుత్వం నీటిని సమర్థంగా వినియోగించుకునే దిశగా మరో అడుగేస్తోంది. దేశంలో నీటి పరిరక్షణకు జల సామర్థ్య బ్యూరో (బీడబ్ల్యూఈ)ను ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. విద్యుత్తు సామర్థ్యాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకునేలా కృషి చేసే ప్రస్తుతమున్న ఇంధన సామర్థ్య బ్యూరో తరహాలోనే బీడబ్ల్యూఈ కూడా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా కృషి చేయనుంది.

బ్యూరో విధులేమిటి?

- కుళాయిల నవీకరణ వంటి చర్యల ద్వారా నీటి వృథాను నియంత్రించే చర్యలు తీసుకుంటుంది.
- బొగ్గు, విద్యుత్తు, సిమెంట్, ఉక్కు రంగాల్లోని పరిశ్రమల్లో జల వినియోగ తీరుపై ఆడిట్ చేపడుతుంది.
- పరిశ్రమలు తమ బ్యాలెన్స్ షీట్లలో జల వినియోగం వివరాలనూ అందించేలా చర్యలు తీసుకుంటుంది.
- నీటి విలువపై వినియోగదారుల్లో అవగాహనను పెంచుతుంది. జల సంరక్షణపై ప్రవర్తనపరమైన మార్పుల్ని సాధించడం వంటి పనులతోపాటు, పరిశ్రమలు జల వినియోగంలో నియంత్రణ చర్యలు చేపట్టడం తదితర బాధ్యతల్ని నిర్వర్తిస్తుంది.
- దేశవ్యాప్తంగా పురపాలక సంఘాలు జల సంరక్షణ దిశగా చేపట్టిన చర్యల్ని తెలుసుకోనుంది.
- పురపాలక సంఘాల కృషి ఆధారంగా జాతీయ స్థాయిలో వాటికి ర్యాంకులు కేటాయిస్తారు.
- గ్రామ పంచాయతీలు తమకు అందుబాటులో ఉండే నీటిని గరిష్ఠంగా, సమర్థంగా ఉపయోగించుకొనేలా కృషి జరుగుతుంది.

భారత్ ఎక్కడ?

జల సంరక్షణలో భారత్ పేలవ పనితీరు చూపుతున్న దేశాల జాబితాలో ఉండగా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్, ఇజ్రాయెల్, డెన్మార్క్, ఫిన్లాండ్, బ్రిటన్ మంచి పనితీరు చూపుతున్న దేశాల జాబితాలో ఉన్నాయి.

దేశంలో నీటి లభ్యత

(ఏడాదికి క్యూబిక్ మీటర్లలో)

సంవత్సరం	తలసరి నీటి లభ్యత
1951	5177
1991	2209
2001	1820
2011	1545
2021	1341

(కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ గణాంకాల ఆధారంగా)

ఎంతవరకు వచ్చింది?

గరిష్ఠ జలసామర్థ్య వినియోగానికి సంబంధించి మంత్రిత్వ శాఖ నుంచి ముసాయిదా పత్రం తయారైందని, ఆమోదం కోసం కేంద్ర మంత్రివర్గం ముందుంచనున్నట్లు అధికారులు తెలిపారు.

- రాష్ట్రాల పరిధిలో ఉండే పరిశ్రమల్లో నీటి ఆడిటింగ్‌కు సంబంధించి సమ్మతి కోసం రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపనున్నారు.

వచ్చేనెల 3న ఆండ్రాయిడ్ 10 విడుదల

వాషింగ్టన్: స్మార్ట్‌ఫోన్ ప్రియులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'ఆండ్రాయిడ్ 10 ఆపరేటింగ్ సిస్టమ్‌ను గూగుల్ సంస్థ వచ్చేనెల 3న విడుదలచేసే అవకాశముంది. దీంతో పాటే ఆవిష్కరిస్తారని భావించిన పిక్సల్-4 శ్రేణి స్మార్ట్‌ఫోన్లు మాత్రం అక్టోబరులో అందుబాటులోకి రావచ్చని సమాచారం. కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేస్తున్న గూగుల్ అనుబంధ ఏజెంట్ సంస్థ ఫోన్ ఎరీనా ఈ వివరాలను వెల్లడించింది. ఆండ్రాయిడ్-10 సాఫ్ట్‌వేర్‌తో పిక్సల్-3, 3 ఎక్స్ఎల్, 3ఎ, 3ఎ-ఎక్స్ఎల్ స్మార్ట్‌ఫోన్లను అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. పిక్సల్ 2, 2-ఎక్స్ఎల్ ఫోన్లకు మాత్రం ఈ కొత్త సాఫ్ట్‌వేర్ సరిపడదని ఫోన్ ఎరీనా వర్గాలు చెప్పాయి. ఆపరేటింగ్ సిస్టమ్ వర్షన్లకు కిట్‌కాట్, లాలీపాప్ వంటి వివిధ పేర్లు ఇస్తూ వస్తున్న గూగుల్ ఇక నుంచి సంఖ్యతోనే కొత్త వర్షన్లను సూచించాలని నిర్ణయించింది.

విమానాల్లో ఆ ల్యాప్‌టాప్‌లకు నో

దిల్లీ: యాపిల్ సంస్థ ఉత్పత్తి చేసిన 15-అంగుళాల మ్యాక్‌బుక్ ప్రో ల్యాప్‌టాప్‌లను ప్రయాణికులెవరూ తమతో పాటు విమానాల్లోకి తీసుకురావద్దని 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)' కోరింది. ఈ ల్యాప్‌టాప్ బ్యాటరీలు వేడెక్కుతున్నాయని, వీటి కారణంగా పేలుళ్లు సంభవించవచ్చని యాపిల్ సంస్థ హెచ్చరించిన క్రమంలో ఈ మేరకు ట్విట్టర్‌లో పేర్కొంది.(

తుపాన్లు రాకుండా అణు బాంబులు వేయండి!

- ట్రంప్ సూచించినట్లు కథనం

వాషింగ్టన్: అమెరికాను అతలాకుతలం చేస్తున్న హరికేన్లు (తుపాన్లు) రాకుండా అణు బాంబులు ప్రయోగించాలని అధ్యక్షుడు డొనాల్డ్ జాతీయ భద్రతా అధికార్లకు సూచించినట్టు ఓ వార్తా పోర్టల్ వెల్లడించింది. ఈ సూచనతో అధికారులు ఆశ్చర్యపోయారని తెలిపింది. 'హరికేన్ల ప్రారంభ సమయంలోనే వాయుగుండం కేంద్ర స్థానంలో బాంబు వేస్తే అది చెల్లాచెదురవుతుంది కదా! మనమెందుకు చేయకూడదు?'' అని అన్నట్టు పేర్కొంది. ఈ వార్తను ట్రంప్ ఖండించారు. తాను అలా అనలేదని, అది నకిలీ వార్త అని పేర్కొన్నారు.

గువాహాటి ఐఐటీలో 4 అంతర్జాతీయ కోర్సులు

దిల్లీ: జపాన్‌లోని గిఫు (జి.ఐ.ఎఫ్.యు) విశ్వవిద్యాలయ సహకారంతో గువాహాటి ఐఐటీలో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి 4 అంతర్జాతీయ కోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు ఐఐటీ సంచాలకుడు సీతారామ్ సోమవారం నాడిక్కడ వెల్లడించారు. డేటా సైన్స్‌లో ఎం.టెక్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇంటర్నేషనల్ జాయింట్ మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్, పీహెచ్.డీ ప్రోగ్రామ్, ఇంటిగ్రేటెడ్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో జాయింట్ పీహెచ్.డీ కోర్సులను ప్రవేశపెడుతున్నామన్నారు. రెండు దశాబ్దాల తర్వాత రూర్కీ ఐఐటీ ఇంజినీరింగేతర విద్యార్థులకు ఎంబీఏలో ప్రవేశం కల్పించనుంది.

వోరా, హూడాలపై ఈడీ అభియోగపత్రం

దిల్లీ: 'అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్)కు 1992లో భూమి కేటాయింపులకు సంబంధించిన కేసులో ఈడీ సోమవారం సీనియర్ కాంగ్రెస్ నేత మోతీలాల్ వోరా, హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపేందర్‌సింగ్ హూడాల పేర్లను చేరుస్తూ అభియోగపత్రం దాఖలు చేసింది. ఈ కేసులో ఈడీ అభియోగపత్రం దాఖలు చేయడం ఇదే ప్రథమం. చండీగఢ్ సమీపంలోని పంచ్‌కులలో ఏజేఎల్‌కు భూమి కేటాయింపు వ్యవహారంలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఏజేఎల్‌పై ఈడీ కేసు నమోదు చేసింది. ఇదే కేసులో సీబీఐ ఇప్పటికే కేసు దాఖలు చేసిన విషయం గమనార్హం.

ప్రతి 100 మందికి 90 ఫోన్లు



జన సాంద్రత.. మనం తరచూ వినే మాట. అంటే నిర్ణీత ప్రాంతంలో ఎంత జనాభా ఉందో లెక్కించడం. నేటి ప్రపంచంలో 'టెలీ సాంద్రత' ప్రాచుర్యంలోకి వచ్చింది. అంటే ప్రతి వంద మందికి ఎన్ని ఫోన్ కనెక్షన్లు ఉన్నాయన్నది లెక్క. ఇప్పుడు ఫోన్ లేని మనిషిని ఊహించలేక పోతున్నాం. కొందరికి రెండు, మూడు ఫోన్ కనెక్షన్లు కూడా సాధారణమైపోయింది. భారత్‌లో ఏకంగా 90.11% టెలీ సాంద్రత ఉన్నట్లు ట్రాయ్ తాజా గణాంకాలను వెల్లడించింది. ఈ ఏడాది జూన్ 30 నాటికి వంద మందికి 240.53 ఫోన్ కనెక్షన్లతో దేశంలో దిల్లీ ప్రథమ స్థానంలో నిలవగా బిహార్ (ఝార్ఖండ్‌తో కలిపి) ఆఖరు స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో సంయుక్తంగా వంద మందికి 97కు పైగా ఫోన్ కనెక్షన్లు ఉన్నాయి.

సింధుకు 'దాజీ' అభినందనలు

హైదరాబాద్: బాడ్మింటన్‌లో అఖండవిజయాన్ని సాధించిన తెలుగుతేజం పీవీ సింధుకు శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్(దాజీ) అభినందనలు తెలిపారు. ఆద్యంతం ఎంతో హుందాగా...సంయమనంతో ఆడి...స్వర్ణాన్ని చేజిక్కించుకున్నారంటూ ప్రశంసించారు. ధ్యానముద్రలో ఉన్నట్లుగా చెక్కుచెదరని ఏకాగ్రతతో ఆడిన ఆమె పట్టుదల చివరకు అద్భుత ఫలితాన్ని తెచ్చిపెట్టిందన్నారు. సింధూ ఘనవిజయం యావద్దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ముమ్ముందు ఆమె ఇలాంటి ఘనవిజయాలెన్నిటినో సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

మా ఆత్మీయ జ్ఞాపకం....'అంబేడ్కర్ హౌస్'

- మ్యూజియంగా కొనసాగించండి
- లండన్‌లో వాదనలు వినిపించనున్న భారత్

లండన్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఒకప్పుడు లండన్‌లో కొద్దికాలం పాటు నివసించిన ఇల్లు ఇప్పుడు వివాదంలో చిక్కుకుంది. ఆయన జ్ఞాపకంగా ఆ ఇంటిని మ్యూజియంగా మార్చడంతో సందర్శకుల సందడితో ఇబ్బందిగా ఉందంటూ ఇరుగుపొరుగున ఉన్న ఇద్దరు సంబంధిత 'కామ్‌డెన్' కౌన్సిల్‌కు 2018 జనవరిలో ఫిర్యాదు చేశారు. మ్యూజియం నడపడానికి అనుమతి లేదని కౌన్సిల్ చెప్పింది. దీంతో 2018 ఫిబ్రవరిలో మహారాష్ట్ర సర్కారు మ్యూజియం నిర్వహణకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకుంది. అదే ఏడాది అక్టోబరులో 'కామ్‌డెన్ కౌన్సిల్' మహారాష్ట్ర అభ్యర్థనను తిరస్కరించింది. దానిపై మహారాష్ట్ర సర్కారు మళ్లీ అపీలు చేసుకుంది. ఆ క్రమంలో మూసివేతకు ముందడుగేసిన కౌన్సిల్ చర్యను భారత ప్రభుత్వం సవాలు చేసింది. దీంతో, సెప్టెంబరు 24న బహిరంగ విచారణ జరపాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఈ వరుస పరిణామాల నేపథ్యంలో మ్యూజియంను కొనసాగించే దిశగా 'కౌన్సిల్' ముందు వాదనలు వినిపించేందుకు పేరొందిన న్యాయ నిపుణులిద్దరిని మహారాష్ట్ర సర్కారు శుక్రవారం నియమించింది. తమ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ప్రముఖ న్యాయసేవల సంస్థ 'సింఘానియా అండ్ కంపెనీ'ని నియమించుకుంది. లండన్‌లోని భారత హై కమిషన్ ద్వారా వాదనలు వినిపించే ప్రత్యేక బృందంలో సదరు న్యాయనిపుణులిద్దరు కూడా ఉంటారు. 'అంబేడ్కర్ హౌస్'గా పేరొందిన ఈ ఇల్లు సంపన్నులు అధికంగా ఉండే 'ప్రిమ్‌రోజ్ హిల్' ప్రాంతంలో ఉంది. లండన్‌స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకునే రోజుల్లో అంబేడ్కర్ 1921-22లో ఈ ఇంట్లో నివసించారు. ఆ మహానుభావుడి జ్ఞాపకార్థం ఈ ఇంటిని ఓ మ్యూజియంగా తీర్చిదిద్దాలని మహారాష్ట్ర సర్కారు సంకల్పించింది. దానిని 2015లో కొనుగోలు చేసి చక్కగా తీర్చిదిద్దింది. ప్రధాని మోదీ దీనికి ప్రారంభోత్సవం చేశారు.

ఊర్లోకి వచ్చిన కొండచిలువ

ఎప్పుడూ అడవిలో ఉండి చికాకు అనిపించిందేమో.. ఓ కొండచిలువ ఊర్లో ప్రత్యక్షమైంది. కర్ణాటకలోని రాంనగర్ జిల్లా అవరగెరే గ్రామంలోకి వచ్చింది. 15 అడుగుల పొడవైన ఈ భారీ పామును చూసిన గ్రామస్థులు భయంతో కేకలు వేశారు. ఆ అరుపులకు బెదిరిపోయిన కొండచిలువ రహదారి పక్కన నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం ఎక్కేసింది. చుట్టూ జనం చేరి కేకలు వేయడంతో.. కొద్దిసేపు అక్కడే ఉండిపోయింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు కొండ చిలువను జాగ్రత్తగా బంధించారు. అనంతరం మాయాగహనహళ్లి దగ్గర్లోని ఉలాతార్ అడవిలో విడిచిపెట్టారు.

ఈ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

పునరావాస కేంద్రంలో పిల్ల ఏనుగు సందడి

కేరళలోని కప్పుకడు ఏనుగుల పునరావాస కేంద్రంలో కొత్తగా వచ్చిన పిల్ల ఏనుగు సందడిచూసి అధికారులు మురిసిపోతున్నారు. నీలంబూర్‌లో ఇటీవల వరదల సమయంలో రెండు నెలల వయసున్న ఓ పిల్ల ఏనుగు గుంపు నుంచి విడిపోయింది. అధికారులు దానిని పునరావాస కేంద్రానికి తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. ఇప్పటికే ఈ సంరక్షణ కేంద్రంలో ఐదు ఏనుగు పిల్లలు ఉన్నాయి. మొత్తంగా 19 ఏనుగులు పునరావాసం పొందుతున్నాయి.